WWW.nindam.co.in

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

శుక్రవారం, మార్చి 01, 2024 | సంపుటి - 20 | సంచిక 170 | వెల - 6 | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

# 11,062 టీచర్ పోస్టులు

- మెగా డిఎస్సీ నోటిఫికేషన్
- ప్రకటనను విడుదల చేసిన సిఎం రేవంత్
- మార్చి 4నుంచి ఎప్రిల్ 2 వరకు దరఖాస్తుల స్వీకరణ

11వేల 62 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. వీటిలో స్కూల్ అసిస్టెంట్ 2,629, భాషా పండితులు 727, పీఈటీలు 182, ఎస్జీటీలు 6,508, ప్రత్యేక కేటగిరీలో స్కూల్ అసిస్టెంట్లు 220, ఎస్జీటీలు 796 పోస్టులు ఉన్నాయి.

వీటిల్లో గత కేసీఆర్ ప్రభుత్వం జారీ చేసిన 5,089 పోస్టులు కూడా ఉన్నాయి. ఈ పోస్టులకు అదనంగా 4,957 టీచర్ పోస్టులు, మరో 1, 016 స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులు కలిపి మొత్తం 11, 062 పోస్టులకు కొత్త నోటిఫికేషన్‌ను ప్రభుత్వం జారీ చేసింది.




మార్చి 4వ తేదీ నుంచి ఏప్రిల్ 2 వరకు దరఖాస్తులు అన్ లైన్ లో స్వీకరిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా 11 చోట్ల ఆన్ లైన్ లో డీఎస్సీ పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష తేదీలను త్వరలో ప్రభుత్వం ప్రకటించనుంది. అభ్యర్థుల వయోపరిమితిని 18 ఏళ్ల నుంచి 46గా నిర్ధారించారు.

హైదరాబాద్,ఫిబ్రవరి29 (నినాదం న్యూస్):

నిరుద్యోగులకు తీపి కబురు అందింది. ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న వారికి తెలంగాణలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలైంది. డీఎస్సీ నోటిఫికేషన్‌ను సీఎం రేవంత్‌రెడ్డి తన నివాసంలో విడుదల చేశారు. గతంలో అప్లై చేసుకున్న వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు. కొత్తగా దరఖాస్తు చేసుకునే వాళ్లు మాత్రం రూ.1000 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. కాగా గతేడాది సెప్టెంబరు 6న 5 వేల 89 పోస్టులతో జారీ చేసిన డీఎస్సీ ప్రకటనను ఫిబ్రవరి 28 బుధవారం రాత్రి రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా పోస్టులను అదనంగా పెంచి నోటిఫికేషన్ ఇచ్చింది. డీఎస్ డీఎస్సీ`2024 ఆన్‌లైన్ దరఖాస్తు పక్రియ మార్చి 4 నుంచి ప్రారంభం కానుంది. ఏప్రిల్ 2 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. అభ్యర్థులు దరఖాస్తు ఫీజు కింద రూ.1000 చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వ ఉద్యోగాలకు వయోపరిమితి పెంచిన నేపథ్యంలో 46 సంవత్సరాల వయసు ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే పరీక్షల తేదీలను ప్రభుత్వం ఇంకా వెల్లడిరచలేదు. త్వరలోనే తెలియజేస్తామని ప్రకటించింది. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ, సంగారెడ్డి జిల్లా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. గతేడాది సెప్టెంబరు 6న 5,089 పోస్టులతో జారీ చేసిన డీఎస్సీ

తరువాయి 2లో..

## భద్రాద్రి రామాలయంలో భారీ మోసం

వివరాలు 2 లో..



18 లక్షల నగదును పక్కదారి పట్టించిన ఘనుడు

## జెనీవా వేదికగా మరోమారు పాక్‌కు చెంపదెబ్బ

జెనీవా: అంతర్జాతీయ వేదికపై భారత్ ను దోషిగా నిలబెట్టాలని ప్రయత్నించిన పాకిస్థాన్ కు మరోసారి భంగపాటు తప్పలేదు. ఐక్య రాజ్యసమితి మానవ హక్కుల మండలి (ఐరాహెచ్ఆర్సీ)లో జమ్మూకశ్మీర్ అంశాన్ని లేవనెత్తిన దాయాదికి భారత్ గట్టిగా బుద్ధిచెప్పింది.

ఘాటుగా విమర్శలను తిప్పికొట్టిన భారత్

వివరాలు 2 లో..




# దమ్ముంటే రాండి..

కాళేశ్వరంపై నిజాలు చెప్పి గుట్టు విప్పుతాం

నీళ్లు ఇవ్వలేని దుస్థితిలో సర్కార్

## పదవులకు రాజీనామా చేసి బరిలోకి దిగుదాం

- డబ్బుల కోసమే బిల్డర్లకు వేధింపులు
- రేపు వారు రోడ్డెక్కడం ఖాయం
- మీడియాతో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

హైదరాబాద్,ఫిబ్రవరి29(నినాదం న్యూస్):

దమ్ముంటే రండి..మల్కాజిగిరిలో తేల్చుకుందాం.. అంటూ సిఎం రేవంత్‌కు కెటిఆర్ సవాల్ విసిరారు. తెలంగాణలో ఒక్క ఎంపీ సీటు అయినా గెలిచి చూపించాలని భారాసకు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరిన నేపథ్యంలో.. ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఘాటుగా స్పందించారు. మీకు ధైర్యముంటే సీఎం, ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేయండి.. నేను సిరిసిల్ల ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా. ఇద్దరం కలిసి మల్కాజిగిరిలో ఎంపీగా పోటీ చేసి తేల్చుకుందాం అని ప్రతి

తరువాయి 2లో..

## నేడు కాళేశ్వరం టూర్

రంగారెడ్డి`పాలమూరుకు కాంగ్రెస్ నేతల పిలుపు

హైదరాబాద్: కాళేశ్వరంపై వచ్చిన విమర్శలకు సమాధానంగా బీఆర్ఎస్ చేపట్టిన మేడిగడ్డ పర్యటనకు కౌంటర్‌గా కాంగ్రెస్ మరో పర్యటనకు సిద్ధమైంది. పాలమూరు ` రంగారెడ్డి పర్యటనకు కాంగ్రెస్ పిలుపునిచ్చింది. శుక్రవారం పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పర్యటనకు ఉమ్మడి రంగారెడ్డి, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా కాంగ్రెస్ నేతలు పిలుపునిచ్చారు.

02

## ఆరుగురు క్రాస్ ఓటింగ్ ఎమ్మెల్యేలపై చర్య

అనర్హత వేటు వేసిన హిమాచల్ స్పీకర్

02

సిమ్లా, నినాదం న్యూస్: హిమాచల్ ప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్‌కు పాల్పడిన ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడిరది. రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ కుల్దీప్ సింగ్ పథానియా వారిని ఎమ్మెల్యే సభ్యత్వాల నుంచి తొలగించారు. కాంగ్రెస్ తరఫున గెలిచి పార్టీ ఫిరాయింపులకు పాల్పడినం దున ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. భాజపాకు అనుకూలంగా క్రాస్ ఓటింగ్‌కు పాల్పడిన ఈ ఎమ్మెల్యేలు తిరుగుబావుటా ఎగురవేయడంతో స్పీకర్ ఈ చర్య తీసుకున్నారు.

# నిరుద్యోగులను నిరాశపర్చిన మెగా డిఎస్సీ

## 4 లక్షల మందికి 11,062 పోస్టుల నియామకమా

### బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ట్వీట్

మెగా డీఎస్సీ నోటిఫికేషన్ చాలా మంది బీఎడ్ అభ్యర్థులకు నిరాశ మిగిల్చిందంటూ సీఎం రేవంత్ రెడ్డిని ట్యాగ్ చేస్తూ బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ట్వీట్ చేశారు. 11,062 పోస్టుల నియామకానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. అయితే దాదాపు 4 లక్షల మంది బీఎడ్ అభ్యర్థులకు కేవలం 2692 స్కూల్ అసిస్టెంట్ పోస్టులే ప్రకటించడం అన్యాయమన్నారు. ఈ పోస్టుల సంఖ్యను పెంచాలని కోరారు.

02

హైదరాబాద్,ఫిబ్రవరి29 (నినాదం న్యూస్):

గత ప్రభుత్వం కేవలం మూడు సార్లే టెట్ నిర్వహించిందని, మీరు ఏటా రెండు సార్లు చేపట్టాలని ప్రవీణ్ కుమార్ కోరారు. నిరుద్యోగులు తన దృష్టికి తీసుకొచ్చిన కొన్ని అంశాలను సీఎం రేవంత్ ముందు ఉంచి, వాటిని పరిశీలించాలని కోరారు. బీఎడ్ చేసిన వారు పాఠశాల విద్యా శాఖలో కేవలం స్కూల్ అసిస్టెంటుకు మాత్రమే అర్హులు. వాళ్ల సంఖ్య దాదాపుగా నాలుగు లక్షలు ఉన్నది. కాని కేవలం 2629 పోస్టులే ప్రకటిస్తున్నట్లుగా వార్తలొస్తున్నయి. ఈ పోస్టులు ఎలాగైనా పెంచే విధంగా చూడగలరని అన్నారు. గత ప్రభుత్వం కేవలం మూడు సార్లే టెట్ నిర్వహించింది. నిజానికి టెట్ సంవత్సరానికి రెండు పర్యాయాలు నిర్వహించాలి. ఈ సారి కూడా టెట్ నిర్వహించి నోటిఫికేషన్ వేయడం చేస్తే బాగుంటుంది. లేదా టెట్, డీఎస్సీ రెండూ ఒకే సారి కూడా చేస్తే చాలా మందికి అర్హత వచ్చే అవకాశం ఉంది.





## 2లక్షల ఉద్యోగాలు ఇచ్చి తీరుతాం

బిఆర్ఎస్ ఒక్క ఎంపి సీటు గెలవకుండా చేస్తాం

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి

02

## మేడారం హుండీల లెక్కింపు ప్రారంభం

వరంగల్ : తెలంగాణ మహా కుంభమేళాగా ప్రసిద్ధిగాంచిన మేడారం మహాజాతర హుండీల లెక్కింపు హన్మకొండలోని తితిదే కళ్యాణ మండపంలో గురువారం ప్రారంభమైంది. ఎండోమెంట్, రెవెన్యూ, జాతర ట్రస్ట్ బోర్డు సభ్యులు, పోలీసు సమక్షంలో హుండీలు తెరుచుకున్నాయి. 518 హుండీలను 10 రోజుల పాటు అధికారులు లెక్కించనున్నారు.

## ఫ్రస్టేషన్‌లో పవన్

02

పార్టీ పెట్టి పదేళ్లయినా ముష్టి సీట్లకోసం పోరాటం: రోజా



### ధరణి సమస్యల పరిష్కారానికి

# మార్గదర్శకాలు

## 1 నుంచి 9 వరకు ధరణిపై రాష్ట్రవ్యాప్త సదస్సులు

హైదరాబాద్,ఫిబ్రవరి29(నినాదం న్యూస్):

తెలంగాణలో ధరణి సమస్యల పరిష్కారానికి రేవంత్ ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ మేరకు కలెక్టర్లకు సీసీఎల్ఏ మార్గదర్శకాలు సూచించింది. మార్చి ఒకటి నుంచి మార్చి 9 వరకు ధరణి సమస్యలను పరిష్కారించేందుకు రాష్ట్రవ్యాప్తంగా సదస్సులు నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో 24వ తారీఖున ధరణిపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన రివ్యూలో ధరణి అప్లికేషన్లను వెంటనే క్లియర్ చేయాలని ఆదేశించింది. అందుకు అనుగుణంగా ధరణి కమిటీ కొన్ని సూచనలు చేసింది. తహశీల్దార్, ఆర్డీవో, అడిషనల్ కలెక్టర్లు, కలెక్టర్ల సమక్షంలో కమిటీలు పని చేస్తాయి. టైం లైన్ విధించి ఆ లోపు పెండిరగ్ అప్లికేషన్లను క్లియర్ చేయాలని ఆదేశించింది. కరెక్షన్ చేసిన అప్లికేషన్ల వివరాలను ఎలక్ట్రానిక్స్ రికార్డ్స్ లో భద్రపరచాలని సూచించింది. ధరణి అడ్డం పెట్టుకొని ఆక్రమించిన ప్రభుత్వ భూముల విషయంలో కఠినంగా వ్యవహరించాలి.

తరువాయి 2లో..

# గ్యాస్ సబ్సిడీ అర్హులకు చేరేది రూ.415

## లెక్కలు తీస్తున్న పౌరసరఫరాల శాఖ



హైదరాబాద్,ఫిబ్రవరి29(నినాదం న్యూస్):

సబ్సిడీ గ్యాస్ పథకానికి అర్హుల జాబితా రూపొందించిన రాష్ట్ర పౌర సరఫరాల శాఖ.. ఏడాదికి ఎవరికి ఎన్ని సిలిండర్లు ఇవ్వాలన్న దానిపై లెక్కలు సిద్ధం చేసింది. రూ.500 గ్యాస్ సిలిండర్ పథకానికి అర్హులైన వారి మూడేళ్ల వినియోగాన్ని పరిగణనలోకి తీసుకుంది. ఈ మేరకు ఏటా ఇవ్వాల్సిన గరిష్ఠ సిలిండర్ల సంఖ్య ఎనిమిదిగా తేల్చింది. ఈ పథకానికి తొలుత 39.78 లక్షల మందిని అర్హులుగా తేల్చగా.. తర్వాత ఆ సంఖ్య 39.50 లక్షలకు తగ్గింది. ఇది మరింత తగ్గవచ్చని అధికార వర్గాల సమాచారం. అర్హులైన వారిలో దాదాపు 9.10 లక్షల మంది అత్యధికంగా ఏటా 8 గ్యాస్ సిలిండర్లు చొప్పున వినియోగిస్తారని అధికారులు లెక్కలు తేల్చారు.

తరువాయి 2లో..

# 11,062 టీచర్ పోస్టులు

**మొదటిపేజీ తరువాయి**

ప్రకటన రద్దుకు ప్రభుత్వం ఫిబ్రవరి 28న రాత్రి ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. పాతపోస్టులకు కొత్తగా ఖాళీలను జతచేస్తూ తాజాగా కొత్త నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అయితే పాత దరఖాస్తులు చెల్లుబాటులో ఉంటాయని.. కొత్త డీఎస్సీకి వాటిని పరిగణనలోనికి తీసుకుంటామని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఇప్పటిచే ప్రకటించారు. అంటే పాత అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. గతేడాది విడుదల చేసిన డీఎస్సీకి 1.77 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించారు. గత దరఖాస్తులను పరిగణనలోకి తీసుకొనేలా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. అప్పట్లో దరఖాస్తు చేసుకున్న వారు తాజాగా మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. మే నెలలో డీఎస్సీ రాత పరీక్షలను కంప్యూటర్‌బేస్డ్ టెస్ట్ (సీబీటీ) పద్ధతిలో నిర్వహించే అవకాశం ఉన్నది. మొత్తం 10 రోజుల పాటు ఈ పరీక్షలు జరుగుతాయి. ఒకే అభ్యర్థి సెకండరీ గ్రేడ్ టీచర్, స్కూల్ అసిస్టెంట్ పోస్టులతోపాటు స్కూల్ అసిస్టెంట్‌లో గణితం, ఫిజిక్స్ వంటి వివిధ సబ్జెక్టులకు పోటీపడనున్న నేపథ్యంలో పరీక్షలను వేర్వేరు తేదీల్లో నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. రాష్ట్రంలోని నిరుద్యోగులు డీఎస్సీ నోటిఫికేషన్‌పై భారీగా ఆశలు పెట్టుకున్నారు. దాదాపు 4 లక్షల మంది ఇప్పటికే ఉపాధ్యాయ అర్హత పరీక్ష ఉత్తీర్ణులయ్యారు. వాళ్లంతా డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎక్కడా ఎలాంటి సమస్య తలెత్తకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రశ్నపత్రాలు మొదలుకొని ఫలితాల వరకూ సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. ఇందులో భాగంగా సాఫ్ట్‌వేర్ రూపకల్పనపై మరింతగా దృష్టి పెట్టారు. పాస్‌వర్డ్స్, ఆన్‌లైన్ వ్యవస్థ భద్రతాంశాలను ఉన్నతాధికారులు సమీక్షించారు. సాంకేతిక విభాగంలో ప్రైవేటు సంస్థల పాత్ర ఉండటంతో అప్రమత్తంగా ఉండాలని ఉన్నతాధికారులు విద్యాశాఖ సిబ్బందిని ఆదేశించారు. కీలకపాత్ర పోషించే అధికారులు ప్రతి అంశాన్నీ పరిశీలించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి.

## జెనీవా వేదికగా మరోమారు
# పాక్‌కు చెంపదెబ్బ

**మొదటిపేజీ తరువాయి**

ఉగ్ర దాడులతో పారిన రక్తంతో వారి చేతులు తడిసిపోయాయని న్యూదిల్లీ మండిపడిరది. తమ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకునే హక్కు లేదని మరోసారి గట్టిగా హెచ్చరించింది. జెనీవా వేదికగా ఐరాస మానవ హక్కుల మండలి 55వ సమావేశం జరుగుతోంది. ఇటీవల ఈ సమావేశంలో జమ్మూకశ్మీర్ అంశాన్ని పాకిస్థాన్, తుర్కియే లేవనెత్తాయి. మానవ హక్కుల అణచివేత జరుగుతోందని నోరుపారేసుకున్నాయి. ఈ ఆరోపణలకు భారత్ దీటుగా బదులిచ్చింది. 'రైట్ టు రిప్లై' అవకాశం కింద ఈ మండలికి భారత కార్యదర్శి అనుపమ సింగ్ తాజాగా మాట్లాడుతూ.. పాక్ తీరును ఎండగట్టారు. భారత్‌పై అసత్య ఆరోపణలు చేయడానికి అంతర్జాతీయ వేదికను పాక్ దుర్వినియోగం చేయడం దురదృష్టకరం. ఆ దేశం తమ ప్రసంగంలో జమ్మూకశ్మీర్ అంశాన్ని ప్రస్తావించింది. వారికి మేం చెప్పేది ఒక్కటే..! కేంద్రపాలిత ప్రాంతాలైన జమ్మూకశ్మీర్, లద్దాఖ్ మా దేశ అంతర్భాగాలే. మా అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడానికి ఆ దేశానికి ఎలాంటి హక్కు లేదు' అని అనుపమ స్పష్టం చేశారు.2023 ఆగస్టులో పాకిస్థాన్‌లోని జరన్‌వాలా నగరంలో మైనార్టీలపై దారుణమైన దాడులు జరిగాయి. 19 చర్చీలను తగలబెట్టారు. 89 క్రిస్టియన్ నివాసాలను కాల్చివేశారు. అలాంటి వారు మానవహక్కుల గురించి ఇప్పుడు మొసలి కన్నీళ్లు కారుస్తున్నారు. వారు ప్రోత్సహిస్తున్న ఉగ్రవాదం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. వారి రక్తంతో పాక్ తడిసిపోయింది. అప్పుల ఊబిలో కూరుకుపోయింది. సొంత ప్రజల కష్టాలు తీర్చలేక ఆ ప్రభుత్వం విఫలమైంది. అలాంటి దేశం చేసే అసత్య ఆరోపణలపై మేం దృష్టి పెట్టాల్సిన అవసరం లేదు' అని దాయాదిని కడిగిపారేశారు. ఇక, జమ్మూకశ్మీర్ అంశాన్ని లేవనెత్తిన తుర్కియేపైనా భారత్ అసంతృప్తి వ్యక్తం చేసింది. 'పాక్ మాటలకు వంతపాడుతూ తుర్కియే కూడా మా దేశ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం విచారకరం. భవిష్యత్తులో మరోసారి ఇలా జరగకుండా.. అనుచిత వ్యాఖ్యలకు వారు దూరంగా ఉంటారని విశ్వసిస్తున్నాం' అని అనుపమ తెలిపారు.

# నిరుద్యోగులను నిరాశపర్చిన మెగా డీఎస్సీ

**మొదటిపేజీ తరువాయి**

ఆన్‌లైన్ కాబట్టి పెద్దగా సమస్య ఉండక పోవచ్చు. ఎస్జీటీ నుండి స్కూల్ అసిస్టెంటు ప్రమోషన్లలో నిష్పత్తి ప్రస్తుతం 70:30 ఉంది. అంటే 70 శాతం పదోన్నతి, 30 శాతం డైరెక్టు రిక్రూట్‌మెంట్. దీని వల్ల బీఎడ్ అభ్యర్థులకు పోస్టులు తక్కువ కావడమే కాకుండా సంస్థలో లతిబిజ్జీతిబా దెబ్బతినే ప్రమాదం ఉంది. అందుకే కొన్ని గురుకులాల్లో లాగా ఈ నిష్పత్తిని 50:50 లాగా సర్వీసు రూల్స్‌ను మారిస్తే అందరికీ లాభమైతది. . చాలా కాలంగా ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్, లైబ్రేరియన్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ రిక్రూట్‌మెంట్ ప్రభుత్వ పాఠశాలల్లో ఆగిపోయింది. వీళ్లను ఎంత అర్జంటుగా రిక్రూట్ చేస్తే (ప్రతి స్కూల్‌కు ఒకరు) అంత మంది తెలంగాణ బిడ్డలు సృజనాత్మకంగా,ఆరోగ్యంగా తయారవుతారు. పాఠశాలల్లో మానసిక నిపుణులను ను నియమిస్తే తప్పకుండా విద్యార్థులపై ఒత్తిడి తగ్గి ఆత్మహత్యలు గణనీయంగా తగ్గే అవకాశముంది. డీఎస్సీ 2008 అభ్యర్థులు న్యాయం కోసం తొక్కని గడప లేదు. వారికి పక్క రాష్ట్రంలో న్యాయం జరిగింది. మన దగ్గర కూడా వాళ్ల కన్నీళ్లను తుడిచే ప్రయత్నం చేయగలరు. గురుకులం ఆశావహులు బ్యాక్ లాగ్ ఖాళీలను ఎలాగైనా నివారించేందుకు 'అవరోహణ క్రమంలో' రిక్రూట్‌మెంట్‌కు సంబంధించి ప్రభుత్వం నుండి శుభవార్త కోసం ఎదురు చూస్తున్నారని ప్రవీణ్ వివరించారు.

# నేడు కాళేశ్వరం టూర్

**మొదటిపేజీ తరువాయి**

బీఆర్ఎస్ ప్రభుత్వంలో పాలమూరు రంగారెడ్డిని విస్మరించారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో ఛలో పాలమూరు రంగారెడ్డి పర్యటనకు హసత్తం నేతలు పిలుపునిచ్చారు. మరోవైపు రేపు ఛలో మేడిగడ్డకు బీఆర్ఎస్ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. శుక్రవారం ఉదయం 8 గంటలకు తెలంగాణ భవన్ నుంచి బీఆర్ఎస్ నేతలు బయలు దేరనున్నారు. మేడిగడ్డ విజిట్ చేసే బృందంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు, ముఖ్య నాయకులు ఉన్నారు. ఏడు బస్సుల్లో 150 మంది నేతలు మేడిగడ్డకు పయనంకానున్నారు. మధ్యాహ్నం భూపాలపల్లిలో లంచ్ చేయనున్నారు. సాయంత్రం మేడిగడ్డ వద్ద కాళేశ్వరంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. రిటైర్డ్ ఇంజినీర్ శ్యామ్ ప్రసాద్ రెడ్డి నేతృత్వంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. కాళేశ్వరంను ప్రభుత్వం విఫల ప్రాజెక్ట్‌గా చూపే కుట్రలు చేస్తోందని బీఆర్ఎస్ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. కాళేశ్వరం అంటే ఒక్క బ్యారేజ్ మాత్రమే కాదని గులాబీ పార్టీ చెబుతోంది. కాళేశ్వరంపై ప్రజలకు వాస్తవాలు చెప్పడానికే చలో మేడిగడ్డ అని నేతలు అంటున్నారు.



# దమ్ముంటే రాండి..

**మొదటిపేజీ తరువాయి**

సవాల్ విసిరారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, ముందు రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఆడబిడ్డలకు రూ.2,500 సహా ఇచ్చిన 420 హామీలు అమలు చేయాలని హితవు పలికారు. మాది మేనేజ్‌మెంట్ కోటా అయితే.. రాహుల్, ప్రియాంకా గాంధీది ఏం కోటా రేవంత్‌ది పేమెంట్ కోటానా.. అలా సీటు తెచ్చుకున్నందుకు రేవంత్.. దిల్లీకి పేమెంట్ చేయాలి. బ్యాగులు మోయాలి. ఇందుకోసం బిల్డర్లు, వ్యాపారులను బెదిరించాలి. అందుకే భవన నిర్మాణ అనుమతులు ఆపారు. ఇప్పటివరకు ఎన్ని అనుమతులు ఇచ్చారో చెప్పాలి. త్వరలో బిల్డర్లు, వ్యాపారులు రేవంత్ తీరును వ్యతిరేకిస్తూ రోడ్డు ఎక్కుతారు. ఆయనే సీఎం అని ఎన్ని సార్లు చెబుతారు. ఆయనకు తానే సీఎం అన్న నమ్మకం లేదా? మా ప్రభుత్వంలో కొన్ని తప్పులు జరిగి ఉండొచ్చు. పాలనలో అన్నీ సీఎం, మంత్రులకు తెలియాలని లేదు. తప్పులు జరిగాయనుకుంటే విచారించి చర్యలు తీసుకోండి' అని చెప్పారు. రాష్ట్రంలో ప్రాజెక్టులపై కాంగ్రెస్ ప్రభుత్వం సిల్లీ రాజకీయాలు చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. గురువారం మీడియాతో చిట్ చాట్ నిర్వహించిన కేటీఆర్.. మాకుకు సెన్స్ లేదని కాంగ్రెస్ వాళ్లు అంటున్నారని.. మరి సెన్స్ ఉండి నీళ్లు వృధా పోతుంటే కాంగ్రెస్ వాళ్లు ఏం చేస్తున్నారంటూ ప్రశ్నించారు. రేపు మేడిగడ్డ,అన్నారం పర్యటనకు వెళ్తున్నాం. మేడిగడ్డ దగ్గర కుంగిన పిల్లర్లు, అన్నారం బ్యారేజ్ లను పరిశీలిస్తాం. అన్నారం బ్యారేజ్ దగ్గర మీడియా సమావేశం నిర్వహిస్తాం. కడియం శ్రీహరి, హరీష్ రావు ఇద్దరు రెండు బ్యారేజ్ లపై మాట్లాడుతారు. ప్రాజెక్టు కుంగడం.. ఇదేం కొత్తది కాదు. ఈ విషయంలో రాజకీయాలు చేయడం తగదు అంటూ ఉత్తమ్ కుమార్ రెడ్డి కేటీఆర్ హితవు పలికారు. డ్యాం సేఫ్టీ అధికారులు ప్రాజెక్టు కుంగిన దగ్గర సాయిల్ టెస్ట్ చేశారా?. కనీసం కింద దిగకుండా పై పైన చూసి పోవటం కాదు. దీన్ని ప్రామాణికంగా చేసుకొని మాట్లాడటం సరికాదు. మార్చి 1 తర్వాత నీళ్ళు ఇచ్చే పరిస్తితి లేదు. సెన్స్ మాకు లేదు అంటున్నారు.. ఉండి మీరు నీళ్లు వృధాగా పోతుంటే మీరేం చేస్తున్నారు?. అందర్నీ తికమక పెడుతున్నారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానంలో పోటీ చేద్దాం. నేను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి పోటీ చేస్తా. సీఎం పదవికి రాజీనామా చేసి రేవంత్ పోటీ చేయాలి. మల్కాజ్‌గిరిలో తేల్చుకుందాం.. ఇద్దరిలో ఎవరు గెలుస్తారో చూద్దాం' అని సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ సవాల్ విసిరారు.

# భద్రాద్రి రామాలయంలో భారీ మోసం

**భద్రాద్రి కొత్తగూడెంఫిబ్రవరి 29(నినాదం న్యూస్):** భద్రాద్రి రామాలయంలో భారీ మోసం వెలుగుచూసింది. ఆలయంలో కీలక బాధ్యతలు నిర్వర్తించే అధికారి చేసిన అవినీతి దందా ఆలస్యంగా బయటపడిరది. మూడేళ్ల క్రితం సత్రం నిర్మాణానికి దాతలు రూ.18 లక్షల నగదును ఆలయానికి ఇచ్చారు. అయితే ఆ నిధులను సదరు ఉద్యోగి పక్కదారి పట్టించారు.



భద్రాద్రి రామాలయం వద్ద గల సౌమిత్రి సదనం పక్కన నిర్మిస్తున్న సత్రానికి గత మూడేళ్ల క్రితం హైదరాబాద్‌కు చెందిన దాతలు రూ.18 లక్షలు విరాళంగా అందజేశారు. రూ.18 లక్షలకు సంబంధించిన రసీదులు ఇవ్వాలని పలుమార్లు వారు అడిగినా ఆ కీలక అధికారి నుంచి సరైన సమాధానం రాలేదు. భయపడిన అధికారి వెంటనే నగదును తీసుకువచ్చి దాతలకు ఇచ్చేందుకు ప్రయత్నించారు. ఈ విషయాన్ని భద్రాద్రి ఆలయ ఈవో రమాదేవికి దాతలు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం బయటపడిరది. దాంతో ఆ కీలక అధికారిపై ఈవో చర్యలు చేపట్టారని సమాచారం. ఈ విషయంపై ఈవో రమాదేవి మీడియాకు వివరాలు వెల్లడిరచారు. దాతలు విరాళం విషయంపై తనకు ఫిర్యాదు చేశారని.. అయితే డబ్బులను ఎవరికి అందజేశారో చెప్పలేదని ఆలయ ఈవో రమాదేవి అన్నారు. విరాళం పక్కదారి పట్టిన విషయం తన దృష్టికి రావడంతో సదరు అధికారి పైసలను డోనర్స్‌కు తిరిగి చెల్లించారు. రామాలయం ప్రతిష్ఠ దెబ్బతీసే ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ విషయంపై దేవాదాయ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తానని ఆలయ ఈవో రమాదేవి తెలిపారు.

# 2లక్షల ఉద్యోగాలు ఇచ్చి తీరుతాం

**భద్రాద్రి కొత్తగూడెం,ఫిబ్రవరి 29(నినాదం న్యూస్):** మూడు నెలల్లో 25 వేల ఉద్యోగాలు, మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ వేశామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. 2 లక్షల ఉద్యోగాలు ఇచ్చి తీరుతాం, పేపర్ లీకేజీలు లేని పరీక్షలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ వైఖరిని ప్రజలు అసహ్యించు కుంటున్నారని.. పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క ఎంపీ సీటును గెలవనీయబోమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించి తీరుతామని.. ఇది దొరల ప్రభుత్వం కాదు.. ఇందిరమ్మ రాజ్యం అన్నారు. గురువారం నాడు కొత్తగూడెంలో పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మీడియాతో మాట్లాడుతూ...ఇందిరమ్మ రాజ్యంలో గత ప్రభుత్వ దోపిడీ, దౌర్జన్యాలకు అడ్డుకట్ట వేశామని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారెంటీల్లో 4 హామీలను అమల్లోకి తీసుకువచ్చామని తెలిపారు. మహిళలకు మహాలక్ష్మి హామీలో భాగంగా ఉచిత బస్సు, రూ.10 లక్షల మెడికల్ బీమా, రూ.500 గ్యాస్, రూ.200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని అన్నారు గత ప్రభుత్వాల వైఫల్యాలపై శ్వేతపత్రాల్లో అసెంబ్లీ సాక్షిగా గత ప్రభుత్వ అవినీతిని బహిరంగ పరిచామని అన్నారు. తాము కాళేశ్వరం వెళ్తే కేసీఆర్ దుర్భాషలాడారని.. ఇప్పుడు బీఆర్ఎస్ నేతలు ఎందుకు వెళ్తున్నారని ప్రశ్నించారు. ప్రజలకు నిత్యం సీఎం సహా ప్రతి మంత్రి అందుబాటులో ఉంటామని అన్నారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ తెలంగాణ నుంచి పోటీ చేస్తారని.. ప్రధాని పదవి చేపడతారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.



# శభాష్ పోలీస్ వీరులారా ?

## యువరైతు ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్

**కరీంనగర్ :** ఓ కానిస్టేబుల్ సాహస కృత్యం వ్యక్తి ప్రాణాలు నిలిపింది. దీంతో ఇప్పుడు ఆ కానిస్టేబుల్‌ను అంతా అభినందిస్తున్నారు. వివరాల్లోకి వెళితే..ఇంటిలో జరిగిన చిన్న గొడవ కారణంగా మనస్థాపానికి గురయ్యారు ఒక యువకుడు. దీంతో తన పొలంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. ఆతనిని గమనించిన పోలీస్ కానిస్టేబుల్ భుజాలపై ఎత్తుకొని పొలాల గట్ల పై నుండి రెండు కిలో మీటర్ల మేర పరుగెత్తుకుంటూ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. వెంటనే చికిత్స అందించడంతో ఆ వ్యక్తి ప్రాణాలు కాపాడగలిగాడు.ఈ సంఘటన కరీంనగర్ జిల్లా వీణవంక మండలంలో చోటు చేసుకుంది. కరీంనగర్ జిల్లా వీణవంక మండలం బేతిగల్ గ్రామానికి చెందిన కుర్ర సురేష్ అనే వ్యక్తి ఇంట్లో కుటుంబ సభ్యులతో గొడవపడి పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. చుట్టుపక్కల వారు గమనించి 100 కు సమాచారం ఇవ్వడంతో బ్లూ కోట్స్ కానిస్టేబుల్ జైపాల్, హోమ్ గార్డ్ కిన్నెర సంపత్ సంఘటన స్థలానికి పది నిమిషాల్లో చేరుకున్నారు. అపస్మారక స్థితిలో పడి ఉన్న వ్యక్తి ప్రాణాలను కాపాడాలనే తపనతో ఏమాత్రం ఆలోచించకుండా సురేష్?ని కానిస్టేబుల్ జైపాల్ భుజాన ఎత్తుకొని పొలం గట్ల మధ్యనుండి సుమారు రెండు కిలోమీటర్ల మేర పరిగెత్తి గ్రామంలోకి తీసుకొచ్చాడు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించి ఆటోలో జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సురేష్?ను పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. ఎంతో శ్రమపడి అపస్మారక స్థితికి వెళ్లిన సురేష్ ప్రాణాలను కాపాడిన కానిస్టేబుల్ జైపాల్‌ను, హోమ్ గార్డ్ సంపత్‌ను వీణవంక ఎస్ఐ వంశీ కృష్ణతో పాటు గ్రామస్తులు అభినందించారు. సురేష్ ఇంట్లో గొడవ పడి పొలం వద్ద బుధవారం పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా.. బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ జయపాల్, హోంగార్డు కిన్నెర సంపత్ లు అక్కడికి చేరుకున్నారు. అపస్మారక స్థితిలో పడి ఉన్న సురేష్ ను జయపాల్ భుజాన వేసుకుని సుమారు 2 కిలో మీటర్ల వరకూ పొలాల గట్ల మీద మోసుకుంటూ వచ్చారు. అనంతరం కుటుంబ సభ్యుల సాయంతో జమ్మికుంట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. శ్రమించి రైతు ప్రాణాలు కాపాడిన బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్, ఇతర సిబ్బందిని ఎస్ఐ వంశీకృష్ణ, స్థానిక నేతలు అభినందించారు.

# ఆరుగురు క్రాస్ ఓటింగ్ ఎమ్మెల్యేలపై చర్య

**మొదటిపేజీ తరువాయి**

కర్ణాటక, ఉత్తరప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్‌లలో మొత్తం 15 రాజ్యసభ స్థానాలకు మంగళవారం రాజ్యసభ ఎన్నికల ఓటింగ్ జరిగిన విషయం తెలిసిందే. హిమాచల్‌లో ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడటంతో ఆ పార్టీ అభ్యర్థికి భాజపా అభ్యర్థికి సరిసమానంగా ఓట్లు వచ్చాయి. దీంతో టాస్ వేయగా భాజపా అభ్యర్థిని విజయం వరించింది. ఈ క్రమంలోనే మంత్రి విక్రమాదిత్య సింగ్ రాజీనామా చేయడం హస్తం పార్టీకి తలపోటుగా మారింది. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు భాజపా ప్రతినిధివర్గం గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాను కలిసినట్లు సమాచారం. రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కాగానే ఆందోళనకు దిగిన 15 మంది భాజపా ఎమ్మెల్యేలను స్పీకర్ సస్పెండ్ చేశారు. ఫిరాయింపుల నిరోధక చట్టం కింద క్రాస్ ఓటింగ్‌కు పాల్పడిన ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై తాజాగా అనర్హత వేటు విధించారు.

# ధరణి సమస్యల పరిష్కారానికి మార్గదర్శకాలు

**మొదటిపేజీ తరువాయి**

ఆధార్ నెంబర్ మిస్ మ్యాచ్, రైతుల పేర్లు తప్పుగా ఉండి ఆగిపోయిన అప్లికేషన్లు, ఫొటో మిస్ మ్యాచ్ వంటి పెండిరగ్ అప్లికేషన్లను సత్వరమే పరిష్కరించాలి. అసైన్డ్ ల్యాండ్ ల సమస్యలు పరిష్కరించాలి. పాస్ బుక్ కరెక్షన్స్, పాస్ బుక్ లో మిస్ అయిన పేర్లు సర్వే నెంబర్లు, కాటా మర్జింగ్, ఒక మండల ఆఫీసులో తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్లతో కలిపి టీంలు ఏర్పాటు చేయాలి. పెండిరగ్ అప్లికేషన్లను మోజుల వైస్ విభజించాలి. అభ్యర్థుల ఫోన్ నెంబర్ల ద్వారా వాట్సాప్ ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం వెంటనే చేరవేయాలి అని ఆదేశాల్లో పేర్కొంది. అప్లికేషన్లను క్లియర్ చేసే ముందు ప్రభుత్వ రికార్డులో వాటి వివరాలను తప్పనిసరిగా చెక్ చేయాలని ప్రభుత్వం సూచించింది. అన్ని అప్లికేషన్స్ మార్చి ఒకటి నుంచి తొమ్మిది లోగానే క్లియర్ చేయాలని ఆదేశించింది. జిల్లా కలెక్టర్లు పరిష్కరించడం ధరణి సమస్యలపై రివ్యూ నిర్వహించి సీసీఎల్ఏకు రిపోర్ట్ సబ్మిట్ చేయాలని ఆదేశాల్లో ప్రభుత్వం స్పష్టం చేసింది.

# పాలమూరును ఎండబెట్టిన కెసిఆర్

**కెసిఆర్ వల్లనే పాలమూరు ఆగం**

**కాంగ్రెస్ నేత వంశీచంద్ రెడ్డి ఆరోపణ**

**మహబూబ్‌నగర్:** బీఆర్ఎస్ చీఫ్, మాజీ సీఎం కేసీఆర్ వల్లనే పాలమూరు ఆగమైందని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి ఆరోపించారు. కేసీఆర్ హయాంలో పాలమూరుకు ఒక్క చుక్కరలేదని విమర్శించారు. ఈ మేరకు పాలమూరు ప్రజల తరుపున కేసీఆర్ కు బహిరంగ లేఖ రాశారు. పాలమూరుకు కల్వకుర్తి, నెట్టంపాడు, జూరాల, డిరడి ప్రాజెక్టుల ద్వారా నీళ్లు వస్తున్నాయని చెప్పారు . కృష్ణ బేసిన్ నీళ్ళు తమకు రావాల్సింది పెన్నా బేసిన్ ద్వారా ఆంధ్రవాళ్లు నీళ్లు తరలించుకు పోతున్నారని లేఖలో ఆరోపించారు. నీళ్లు, నిధులు, నియమాకాలతో రాష్ట్రాన్ని సాధిస్తే .. కేసీఆర్ కుటుంబ పాలన చేశారని విమర్శించారు. పాలమూరు ఓట్లతో రాజకీయ పునర్జన్మ పొందిన కేసీఆర్... నీళ్లు ఆంధ్రా వాళ్లకు, నియామకాలు ఆయనకుటుంబానికి, నిధులు ఆంధ్రా కాంట్రక్టర్ లకు అప్పగించి లక్షల కోట్లు కమిషన్ తీసుకున్నారని ఆరోపణలు గుప్పించారు. తప్పు చేయలేదని చెప్పే దమ్ము ధైర్యం ఉంటే కేసీఆర్ మహబూబ్ నగర్ నుంచి పోటీ చేయాలని వంశీచంద్ రెడ్డి డిమాండ్ చేశారు. కేసీఆర్ పదేళ్ల పాటు దుర్మార్గపు పాలన కొనసాగించారని, తెలంగాణ ప్రజలను మోసం చేసి కల్వకుంట్ల కుటుంబం బాగుపడిరదని వంశీచంద్?రెడ్డి లేఖలో తెలిపారు. రేవంత్ ప్రజా పాలన చేస్తుంటే బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేయడం సరికాదన్నారు. అబద్దపు మాటలు చెబుతూ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

# వైభవంగా శ్రీకళ్యాణ వేంకటేశ్వర బ్రహ్మోత్సవాలు

## - ధ్వాజరోహణంతో వేదోక్తంగా ప్రారంభం

తిరుపతి : తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం శ్రీనివాసమంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. గురువారం ఉదయం ధ్వజారోహణ ఘట్టంతో వేదపండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణ నడుమ ఈ కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. అంతకుముందు ఉదయం 7 గంటల నుండి 8 గంటల వరకు స్వామివారికి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవం ద్వారా బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను స్వామివారు ఒకమారు ముందుగా పర్యవేక్షిస్తారని నిర్వాహకులు తెలిపారు. అనంతరం అర్చకులు విష్వక్సేన ఆరాధన, వాస్తుహోమం, గరుడ లింగహోమం, గరుడ ప్రతిష్ఠ, రక్షా బంధనం చేపట్టారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి సమక్షంలో ధ్వజారోహణం నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణ నడుమ ఈ కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. అంతకుముందు ఉదయం 6.30 నుండి 8.30 గంటల వరకు స్వామివారి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవం ద్వారా తన బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను స్వామివారు ఒకమారు ముందుగా పర్యవేక్షిస్తారు. అనంతరం అర్చకులు విష్వక్సేన ఆరాధన, వాస్తుహోమం, గరుడ లింగహోమం, గరుడ ప్రతిష్ఠ, రక్షా బంధనం చేపట్టారు. మీన లగ్నంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి సమక్షంలో ధ్వజారోహణం నిర్వహించారు. ఇందులో వైఖానస శాస్త్రోక్తంగా గరుత్మంతుణ్ణి కొత్త వస్త్రంపై లిఖించి, పూజలు చేసి, ధ్వజస్తంభంపై ప్రతిష్టించారు.18 గణాలను, ముక్కోటి దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడం దీని లక్ష్యం. కంకణబట్టార్ శ్రీ శేషాచార్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. జేఈవో శ్రీ వీరబ్రహ్మం మీడియాతో మాట్లాడుతూ, కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ఫిబ్రవరి 29 నుండి మార్చి 8వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తామన్నారు.

# ఫ్రస్టేసన్‌లో ఉన్న పవన్

**గుంటూరు:** పార్టీ పెట్టి పదేళ్ళైనా.. 24 సీట్లకే పోటీ చేసే దుస్థితిలో ఉన్నారంటూ జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై మంత్రి ఆర్కో రోజా సెటైర్లు వేశారు. తాడేపల్లిగూడెం టీడీపీ`జనసేన ఉమ్మడి సభలో పవన్ చేసిన వ్యాఖ్యలకు గురువారం ఆమె కౌంటర్ ఇచ్చారు. పవన్ కల్యాణ్ ఫ్రస్టేషన్ పీక్స్‌కు చేరింది. పార్టీ పెట్టి పదేళ్లయినా 24 సీట్లకే పోటీ చేస్తున్నారు. ముష్టి 30 సీట్లు కూడా తెచ్చుకోలని స్టేజ్‌లో ఉన్నాడు. ఆ ఫ్రస్టేషన్‌లోనే ఇష్టమున్నట్లు మాట్లాడుతున్నారు. సీఎం జగన్‌ను విమర్శించే అర్హత పవన్ కల్యాణ్‌కు లేదు. చంద్రబాబు మాయలో పవన్ పూర్తిగా పడిపోయారు. పార్టీ అధ్యక్షుడైనా పవన్ ఇంతదాకా మండల, బూత్ కమిటీలు వేయలేదు. 24 సీట్లు తీసుకొని... జనసేన నేతలకు పవన్ అన్యాయం చేశారు. తన తప్పును కార్యకర్తలపై రుద్దాలని పవన్ ప్రయత్నిస్తున్నారు. గట్టిగా అరిచినంత మాత్రాన ఓట్లు పడవని పవన్ గుర్తించాలి. రిషికొండలో అద్భుతమైన భవనం నిర్మిస్తున్నాం. ముఖ్యమంత్రి రిషికొండలో ఉండాలని కమిటీ నిర్ణయించింది. క్యాంప్ ఆఫీసు కాకపోతే.. టూరిస్టు ప్లేస్ గా ఉంటుంది అని మంత్రి రోజా అన్నారు.

# గ్యాస్ సబ్సిడీ అర్హులకు చేరేది రూ.415

**మొదటిపేజీ తరువాయి**

దీంతో ఈ పథకం కింద సబ్సిడీపై ఇవ్వబోయే సిలిండర్ల సంఖ్య ఏడాదికి ఎనిమిదిగా నిర్ధారించారు. మొత్తంగా ప్రభుత్వం భరించాల్సిన సబ్సిడీ నెలకు రూ.71.27 కోట్లు, ఏడాదికి రూ.855.2 కోట్లుగా తేలింది. రాష్ట్ర ప్రభుత్వం 'మహాలక్ష్మి' పథకంలో భాగంగా రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకానికి ఈ నెల 27న జీవో విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఇందులో ఉజ్వల కనెక్షన్ వినియోగదారులకు రూ.38.57 కోట్లు, సాధారణ గ్యాస్ కనెక్షన్ దారులకు రూ.816.65 కోట్లు అవుతుందని అంచనా వేశారు. రాష్ట్రంలో 11.58 లక్షల మంది ఉజ్వల గ్యాస్ కనెక్షన్ దారులు ఉన్నా.. సబ్సిడీ సిలిండర్ కోసం 5.89 లక్షల మంది మాత్రమే అప్లై చేసుకున్నారు. అయితే, ఉజ్వల గ్యాస్ కనెక్షన్ పై కేంద్రం ప్రతి సిలిండర్ కు రూ.340 సబ్సిడి ఇస్తుండడంతో వీటిపై రాష్ట్ర ప్రభుత్వం రూ.155 చొప్పున రాయితీ ఇస్తే సరిపోతుంది. కాగా, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మూడేళ్ల గ్యాస్ వాడకం లెక్కలు తీయగా.. కొందరు అతి తక్కువ గ్యాస్ వినియోగిస్తుంటే మరికొందరు అసలు గ్యాస్ వాడడం లేదని తేలింది. గత మూడేళ్లలో సిలిండర్ ను ఒక్కసారి కూడా తీసుకోని వినియోగదారుల సంఖ్య 1,10,706గా ఉంది. వీరిలో సాధారణ కనెక్షన్ దారులు 92,633 మంది కాగా, ఉజ్వల గ్యాస్ కనెక్షన్ ఉన్న వారు 18,073 మందిగా ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని ప్రకటించిన నేపథ్యంలో సాధారణ ప్రజలతో పాటు ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు ఉన్న వారిని కూడా మహాలక్ష్మి పథకం కిందకు తీసుకువస్తున్నారు. అయితే, పథకం లబ్దిదారులు గ్యాస్ సిలిండర్ తీసుకున్నప్పుడు పూర్తి ధర చెల్లించాల్సిందేనని పౌర సరఫరాల శాఖ స్పష్టం చేసింది. ఆ తర్వాత రూ.500 అదనంగా చెల్లించిన ధరను ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా రీయింబర్స్ చేయనున్నట్లు తెలుస్తోంది. ఇందులో కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం చెల్లిస్తోన్న రూ.40 రాయితీని కూడా పరిగణనలోకి తీసుకోనున్నట్లు



సమాచారం. హైదరాబాద్ లో సిలిండర్ ధర రూ.955 ఉంటే.. వినియోగదారుడు చెల్లించాల్సిన రూ.500, కేంద్ర రాయితీ రూ.40 పోనూ మిగతా రూ.415ని రాష్ట్ర ప్రభుత్వం రాయితీగా బ్యాంక్ ఖాతాలో జమ చేస్తుందని తెలుస్తోంది.

## పరకాలలో ఫారెస్ట్ అధికారి జాడ ఎక్కడ...?

- పరకాలలో అడ్డగోలుగా అక్రమ కర్ర దందా
- పరకాలలో కనుచూపు మేరకు కనబడని ఫారెస్ట్ అధికారి
- అనుమతులు నై నై యదేచ్ఛంగా చెట్లను నరికివేత
- మామూళ్ల మత్తులో అధికారులు



**పరకాల ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్) :** పరకాలలో ఫారెస్ట్ అధికారి జాడే కరువైంది . పరకాలలో యదేచ్ఛంగా ఎలాంటి అనుమతులు లేకుండా టెండర్ల ప్రక్రియ లేకుండా పాత బడా బాబుల అండదండల తో ఫారెస్ట్ అధికారులను మామూలు మత్తులోదించి పరకాల ఫారెస్ట్ స్టేషన్ పరిధిలో అక్రమ కర్ర దందా యదేచ్ఛంగా కొనసాగుతున్నది. పూర్తి వివరాల్లోకి వెళితే పరకాల మండలం మలకపేట హనుమాన్ ద్వారం నుండి వెంకటేశ్వర్ల పల్లికి గ్రామం వరకు వెళ్లే డబుల్ రోడ్డు పనుల నిమిత్తం రోడ్డుకు ఇరువైపులు ఉన్న పెద్ద చెట్లు ఎలాంటి అనుమతులు లేకుండా ఎలాంటి టెండర్ ప్రక్రియ లేకుండా గుట్టు చప్పుడు కాకుండా పాత గ్రామాల బడా లీడర్లు మరియు ఫారెస్ట్ అధికారుల అండదండలతో చెట్లను నరికి వేయడం ప్రబుద్ధులు జేబులు నింపుకోవడం అధికారులకు మామూలు ముట్ట చెప్పడం సాదాసీదాగా యదేచ్ఛంగా కొనసాగుతున్నది. అసలు పరకాలలో ఫారెస్ట్ అధికారి కనుచూపు మేరకు కూడా కనపడకపోవడానికి గల కారణాలయమిటో తెలియ రావడం లేదు. టింబర్ డిపోలలో సైతం మామూళ్లకు అలవాటు పడి దొంగ కర్ర దందాకు ఫారెస్ట్ అధికారి తెర లేపుతున్నారు అని పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి అధికారి ఉంటే ఎంత లేకుంటే ఎంత. రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి గండి పెడుతూ తన సొంత జేబు నింపుకుంటూ దగా కోరు దళారులకు అండగా నిలుస్తూ ప్రభుత్వ గల్లా పెట్టే ఖాళీ చేస్తున్న పరకాల ఫారెస్ట్ అధికారిపై జిల్లా అధికార యంత్రం చట్టరీత్యా చర్యలు తీసుకొని నిబంధనలకు విరుద్ధంగా కర్ర దందా నిర్వహిస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పలువురు వాపోతున్నారు.. ... ఫారెస్ట్ అధికారి బాగోతం పై మరో కథనంలో వేచి చూద్దాం. ..?

## శ్రీ శ్రీ సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

### నల్గొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి



**నల్గొండ బ్యూరో, ఫిబ్రవరి 29(నినాదం న్యూస్):** శ్రీ శ్రీ సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందని నల్గొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. శ్రీశ్రీశ్రీ సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ 285 జయంతి ఉత్సవాలలో భాగంగా గురువారం నల్గొండ పట్టణంలోని క్లాక్ టవర్ వద్ద నిర్వహించిన సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సంత్ సేవాలాల్ మహారాజ్ ఆశయ సాధనకు కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. సంత్ సేవాలాల్ మహారాజ్ సామాజిక సంఘసేవకర్త మాత్రమే కాకుండా ఆధ్యాత్మిక గురువు అని అన్నారు.ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బ గోని రమేష్ ,ఆల్ ఆల్ ఇండియా బంజారా సేవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రనాయక్ జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ , అధ్యక్షులు అడిషనల్ ఎస్పీ రాములు నాయక్ , ఎంపీపీ జెడ్పిటిసి లక్ష్మయ్య వార్డు కౌన్సిలర్ ప్రదీప్ నాయక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శంకర్ నాయక్ బంజారా ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షులు జగన్ సింగ్ గిరిజన ఉద్యోగ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి నాయక్, ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సక్కు నాయక్, బంజారా సేవా సంఘం రాష్ట్ర నాయకులు ప్రేమా నాయక్, జనరల్ సెక్రెటరీ బిక్కు నాయక్, జిల్లా లీగల్ అడ్వైజర్ నాగార్జున నాయక్, కార్మిక సంఘం అధ్యక్షులు నగేష్, జిల్లా పరిశ్రమల మేనేజర్ కోటేశ్వరరావు, డిసిహెచ్ఎస్ మాతృ నాయక్, జిల్లా అధికారులు ఈ ఈ శ్రీనివాస్ నాయక్, సిపిఓ మాన్య నాయక్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి గృహ నిర్మాణ శాఖ పీడీ, ఇన్చార్జి డిటిడబ్ల్యు రాజ్ కుమార్ అధ్యక్షత వహించారు.

## ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్, హొమ్ గార్డ్‌కు అభినందనలు

- కానిస్టేబుల్ జయపాల్ హొమ్, గార్డ్ సంపత్
- వారిని అభినందించి, నగదు రివార్డు అందజేసిన
- కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి



**కరీంనగర్, ఫిబ్రవరి 29(నినాదం న్యూస్):** వీణవంక మండలం బేతిగల్ గ్రామానికి చెందిన కుర్ర సురేష్ ఇంట్లో గొడవపడి పురుగుల మందు తాగాడు. అక్కడ ఉన్నారు గమనించి 100 డయిల్ కు సమాచారం ఇవ్వగా బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ జయపాల్ హొంగార్డు కిందన సంపత్ లు సమాచారం అందిన వెంటనే స్పందించి సంఘటనా స్థలానికి చేరుకునే సరికే అపస్మారక స్థితిలో ఉన్న సురేష్ ను, కానిస్టేబుల్ జైపాల్ బాధితుడిని భుజాన వేసుకుని సుమారు రెండు కిలోమీటర్ల మేర పొలాల గట్ల మీద గ్రామంలోకి పరిగెడుతూ తీసుకొచ్చి త్వరితగతిన అతడిని జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రి తరలించగా అతడు ప్రాణాలను కాపాడగలిగారు. వ్యక్తి ప్రాణాలు కాపాడటంలో త్వరితగతిన స్పందించి పరిస్థితులకు అనుకూలంగా వ్యవహరించి ఒక వ్యక్తికి ప్రాణాలు కాపాడుటకు కృషి చేసిన కానిస్టేబుల్ జైపాల్ ను హొంగార్డు సంపత్ లను కరీంనగర్ పోలీస్ కమీషనర్ అభిషేక్ మహంతి ప్రత్యేకంగా అభినందించారు. గురువారం నాడు కమిషనరేట్ కేంద్రంలోని కమిషనర్ పోలీస్ కార్యాలయంలో వారికి నగదు రివార్డు అందజేశారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి.రాజు పాల్గొన్నారు.

## పారిశ్రామికవేత్తలు సంపద సృష్టికర్తలు

# పెట్టుబడులను ఆహ్వానిస్తున్నాం

### రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన విధానాలతో ఉంది - సింగపూర్ కౌన్సిల్ జనరల్ ఎడ్గర్ పాంగ్ బృందంతో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



**ఖమ్మం ఫిబ్రవరి 29(నినాదం న్యూస్) :** పారిశ్రామికవేత్తలు సంపద సృష్టికర్తలు రాష్ట్రంలో సింగపూర్ నుంచి పెట్టుబడులను ఆహ్వానిస్తున్నాం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. గురువారం ఆయన కౌన్సిల్ జనరల్ ఆఫ్ రిపబ్లిక్ ఆఫ్ సింగపూర్ ఎడ్గర్ పాంగ్ బృందంతో సచివాలయంలో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులను ఆహ్వానించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ గా ఉన్నదని స్పష్టం చేశారు. ఇక్కడ అన్ని వర్గాల వారు ఆస్వాదించే భౌగోళిక వాతావరణం ఉంటుందని, సర్వత్ర స్నేహపూర్వక వాతావరణం ఉంటుందని.. మౌలిక సదుపాయాలు అద్భుతంగా ఉన్నాయని సింగపూర్ బృందానికి వివరించారు. ఇక్కడ పెట్టుబడులకు సలహాలు సూచనలు ఇవ్వండి... ఆహ్వానించే విషయం లో రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టమైన విధానాలు ఉన్నాయన్నారు. ఔటర్ రింగ్ రోడ్ (%ూ==%) నిర్మాణంతో హైదరాబాద్ లో పెట్టుబడుల భూమ్ ఏర్పడిందన్నారు. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలని కలిపేలా తాజాగా రీజినల్ రింగ్ రోడ్ (%===%) నిర్మాణం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి క్లస్టర్ జోన్ల వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఫార్మా, %ఐజుఃఖూజు%, ఐటీ క్లస్టర్లు ఏర్పాటు చేసి అభివృద్ధిని ప్రోత్సహిస్తున్నామన్నారు. హైదరాబాద్ పట్టణంలోని పురాతన మూసీ నదిని పునర్-జీవింప చేసే చర్యలు ప్రారంభించామన్నారు. మూసి రివర్ ఫ్రంట్ బోర్డు ద్వారా మంచినీటితో మూసిని నింపి.. థేమ్స్ నదిలా మారుస్తామన్నారు. మూసీ నది పరివాహక ప్రాంతం అంతటిని కమర్షియల్, చిల్డ్రన్ పార్క్, మాల్స్ నిర్మాణం చేసి ఆర్థిక కార్యకలాపాలు వేగవంతం చేసే ఆలోచనలో ఉన్నామన్నారు. ఇటీవల జపాన్ కు చెందిన జై కా వారు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిగా ఉన్నట్టు చర్చించిన విషయాన్ని సింగపూర్ బృందంతో డిప్యూటీ సీఎం పంచుకున్నారు. వ్యవసాయ ఆధారిత రంగంలో తెలంగాణ బలోపేతంగా ఉందన్న విషయాన్ని వారికి వివరించారు. మీరు పెట్టుబడులు పెట్టేందుకు అవసరమైన భూమి, తెర వనరులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. తెలంగాణ %+ూణూ% బాగా పెరిగింది అన్న విషయాన్ని వివరించారు. ఐటీ, ఫార్మా రంగంలో రాష్ట్ర ప్రభుత్వం ముందుచూపుతో ఉంది. సింగపూర్ కు చెందిన కొన్ని కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిగా ఉన్నాయని ఎడ్గర్ పాంగ్ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కు వివరించారు. అర్బన్ ప్లానింగ్ విషయంలో తమకు మంచి పట్టు ఉందని వివరించారు. సింగపూర్ కు చెందిన అతిపెద్ద డీబీఎస్ బ్యాంక్ హైదరాబాదులో ఉన్నట్టు తెలిపారు. ఐటీ పార్కులో సింగపూర్ ఆఫీసులు ఉన్న విషయాన్ని వివరించారు. హైదరాబాద్ శరవేగంగా అభివృద్ధి చెందుతోంది, రెండు రోజులకు ఒకసారి సింగపూర్ ఎయిర్ లైన్స్ ప్రయాణికులతో హైదరాబాద్ రాకపోకలు సాగిస్తోంది, ఎయిర్ ఇండియా సైతం పెద్ద సంఖ్యలో సింగపూర్ కు ఎయిర్ లైన్ సేవలు అందిస్తున్న వివరాన్ని వివరించారు. హైదరాబాద్ బయోటెక్ హబ్ గా స్థిరపడుతుందని పాంగ్ వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులకు ప్రత్యేకంగా సహకారం తీసుకుంటామని పాంగ్ తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ సిఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## 90శాతం వడ్డీ మాఫీ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేస్కోవాలి

### మేయర్ యాదగిరి సునీల్ రావు



**కరీంనగర్, ఫిబ్రవరి 29(నినాదం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జీ వో నెం. 101 ద్వారా 2022-2023 ఆర్థిక సంవత్సరం ఆస్తి పన్నుల బకాయిల పై 90శాతం వడ్డీ మాఫీ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేస్కోవాలని నగర మేయర్ యాదగిరి సునీల్ రావు పిలుపు నిచ్చారు. కరీంనగర్ నగరపాలక సంస్థ కు ప్రభుత్వం ఇచ్చిన జీవో ఆదేశాల నేపథ్యంలో గురువారం రోజు నగర మేయర్ యాదగిరి సునీల్ రావు ప్రకటనలో ప్రజలకు వెల్లడించారు. ఈ సందర్భంగా మేయర్ యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ,నగర ప్రజల పై ఆస్తిపన్నులకు సంబంధించిన వడ్డీ భారం పడకుండా ఓటిఎస్ వన్ టైం స్కీం కింద గొప్ప అవకాశాన్ని ప్రజల ముందుకు తెచ్చిందన్నారు. 2022-2023 ఆర్థిక సంవత్సరం లో నివాస నివాసేతర ఆస్తుల పన్నుల పెండింగ్ బకాయిల పై 90 శాతం వడ్డీని మాఫీ చేస్తూ, కేవలం 10 శాతం వడ్డిని చెల్లించే అవకాశం కల్పించిందని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం లో వడ్డీతో ఎవరైనా చెల్లించిన పక్షంలో మీరు చెల్లించిన 90 శాతం వడ్డి రాయితీని తరవాత సంవత్సరం చెల్లించాల్సిన ఆస్తి పన్నులో సర్దుబాటు కూడ చేయడం జరుగుతుందని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం 2020-2021 లో కూడ ప్రభుత్వం 90% వడ్డీ మాఫీ అవకాశాన్ని చాలా మంది ప్రజలు వినియోగించుకొని ఎలాంటి భారం పడకుండ లబ్ధిపొందడం జరిగింద న్నారు. నగర ప్రజలు నివాసము మరియు నివాసేతర ఆస్తుల పెండింగ్ బకాయిల ప్రభుత్వం కల్పించిన 90 వడ్డీ మాఫీ అవకాశాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేస్కోని... మీ యొక్క పన్నుల భారం తగ్గించుకొవడమే కాకుండా నగరపాలక సంస్థ లో చేపట్టిన అన్ని అభివృద్ధి పనులకు సహకరించా ల్సిందిగా విజ్ఞప్తి చేశారు. నగర ప్రజలు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకొని మీ యొక్క ఆస్తి పన్నులు చెల్లించాలని కోరారు. ఇలాంటి అవకశాల ద్వారా మీ యొక్క పన్నుల భారం చాలా వరకు తగ్గుతుందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని తప్పకుండ వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థి ఆత్మహత్య కాదు ప్రభుత్వ హత్యనె టీజీవీపీ



**బోథ్, ఫిబ్రవరి 29(నినాదం న్యూస్) :** ఉమ్మడి అదిలాబాద్ జిల్లా అధ్యక్షులు రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రెటరీ కొట్టూరి ప్రవీణ్ కుమార్ గురువారం బోథ్ నియోజకవర్గం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు ఇంటర్మీడియట్ పరీక్షల నేపథ్యంలో ప్రభుత్వ నిబంధనల వలన విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతూ ఉందని తెలంగాణ విద్యార్థి పరిషత్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు మరియు రాష్ట్ర ఆర్గనైజ్ సెక్రెటరీ కొట్టురి ప్రవీణ్ కుమార్ అన్నారు. విద్యార్థులు మనోవేదనకు గురై ఆత్మహత్యలు చేసుకుంటున్నారు తాజాగా జైనథ్ మండలంలోని విద్యార్థి శివకుమార్ ఆత్మహత్య కాదని ముమ్మాటికి ప్రభుత్వ అత్యానని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు అలా చూసుకుంటే పరీక్షాలలో ఒక నిమిషం లేటుగా క్యూస్షన్ పేపర్లు వస్తాయి దానికి ఎవరు ఆత్మ ఆత్మహత్య చేసుకుంటారని ఆయన అన్నారు విద్యార్థి కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్ సన్నీత్ . జస్వంత్ ఆదిత్య. గణేష్ వినిల్ కృష్ణ కార్తీక్. అశ్విత్ పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న హర్షిత ఎగ్జిబిట్



**సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్):** సదాశివపేట పట్టణంలోని గురు నగర్ కాలనీలో గల శ్రీ రైజింగ్ కిడ్స్ పాఠశాలలో రెండు రోజులుగా విద్యార్థులు సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు వివిధ రకాల సైన్స్ ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. ఇందులో నాలుగవ తరగతి చదువుతున్న హర్షిత ప్రదర్శించిన ఎగ్జిబిట్ ఆకట్టుకుంది. ఈ సందర్భంగాపాఠశాల కరస్పాండెంట్ హైమావతి మాట్లాడుతూ సైన్స్ అంటే చీకటి నుండి వెలుగులోకి నడిపించే ఒక యంత్రమని, జాతీయ సైన్స్ 'దినోత్సవాన్ని 'శ్రీ రైజింగ్ కిడ్స్ పాఠశాల యాజమాన్యం, సిబ్బంది మరియు బాలబాలికలు భౌతికశాస్త్ర పరిశోధనలను మలుపు తిప్పిన దృగ్విషయం "రామన్ ఎఫెక్ట్"ను కనుగొన్న భారతీయ శాస్త్రవేత్త "సివి రామన్ ' జ్ఞాపకార్థంగా అంగరంగా వైభవంగా జరుపుకున్నామన్నారు. ఈ వైభవంలో పాఠశాల విద్యార్థులు "థర్మల్ పవర్ స్టేషన్"ను ఏర్పాటు చేసి విద్యుత్ తయారీని చూపించారని.తెలిపారు. అంతేకాకుండా చరవాణి ఉపయోగాలు, అతిగా వాడితే వాటి అనర్థాలు, కమ్యూనిటీ సహాయసహకారాలు, మనం మరిచిపోయిన సంస్కృతి - సంప్రదాయాలను, ప్రకృతిని పాడుచేస్తే కలిగే నష్టాలను, వైద్య శిభిరాలను ఏర్పాటుచేసి రక్తపోటు (బీపీ )ను, షుగర్ టెస్ట్, బ్లడ్ గ్రూపులను ఏవిధంగా - చేస్తారో చిన్నారి విద్యార్థులు కండ్లకు కట్టినట్టుగా చూపించారని కొనియాడారు. కాశ్మీరు నుండి కన్యాకుమారిదాకా మన వేషధారణ వివరాలు చూపించారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు స్వాతి, విద్యార్థులు పాల్గొన్నారు.

# కాలగర్భంలోకి కాకతీయుల శివాలయం

### ఆదరణ లేక శిథిలమవుతున్న ఆలయం - ఒకే చోట శైవత్వం, వైష్ణత్వం కలిగిన మహాలయం - గడిపల్లిలో వెలుగులోకి ఐదవ శతాబ్దం నాటి పురాతన ఆలయం



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 29 నినాదం న్యూస్ :** ఆదరణ లేక కాకతీయుల కాలం నాటి శివాలయం కాలగర్భంలో కలిసిపోతున్నది. క్రమంగా ఆలయం శిథిల వ్యవస్థకు చేరుకుంటుంది. ఐదవ శతాబ్దం లో కాకతీయులు నిర్మించిన ఈ ఆలయం ఎంతో మహిమాత్మనియమైనదని ఇక్కడి ప్రజలు చెబుతున్నారు. ఒకే చోట శైవత్వం, వైష్ణత్వం కలిగిన ఎంతో విశిష్టత కలిగినది ఈ ఆలయం. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రం గడిపల్లి శివారులో కాకతీయుల కాలంలో ఈ ఆలయం నిర్మితమైంది చారిత్రకారులు చెప్తున్నారు. రాతి కట్టడంతో వెలిసిన ఆలయానికి తూర్పు వైపు ద్వారం ఉన్నది. ఆలయం బయట శివ లింగాన్ని, మంది విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆలయంలో లక్ష్మి నారాయణుడు, సూర్య భగవానుడు, రాముని విగ్రహాలు, ద్వారానికి ఎదురుగా హన్మతున్ని విగ్రహం కొలువై ఉన్నాయి. ఇంత అద్భుతమైన రాతి స్తంభాలతో నిర్మించిన కళా సంపద రక్షణకు నోచుకోవడం లేదు. పాలకుల నిర్లక్ష్యం అధికారుల అలసత్వం మూలంగానే ఈ ఆలయం ధూపదీప నైవేద్యానికి దూరమైందని ప్రజలు అనుకుంటున్నారు. ఈ అరుదైన ఆలయాన్ని అభివృద్ధి చేసి నిత్యం పూజలు అందుకునే విధంగా ధూపదీప నైవేద్యం కల్పించాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

**చారిత్రక కట్టడాన్ని అభివృద్ధి చేయాలి...** తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత ప్రభుత్వం చారిత్రక కట్టడాలను రక్షించాలని నిర్ణయం చేసింది. రామప్ప ఆలయం చుట్టు 10కిలోమీటర్ల పరిధిలో ఉన్న కాకతీయులు కట్టిన ఆలయాలు అభివృద్ధి చేయాలని ప్రొటెక్షన్ మాన్యుమెంట్స్ జాబితాలో చేర్చారు. కానీ పది కిలోమీటర్ల అవతల ఉన్న ఇలాంటి ఆలయాలకు ఆ జాబితాలో చోటు లేదు. దీంతో మండల కేంద్రంలోని గడిపల్లి లో ఉన్న ఈ ఆలయానికి గుర్తింపు దక్కలేదు. గత పాలకులు కూడా పట్టించుకోకపోవడం ఈ ఆలయం కాలగర్భంలో కలిసిపోయే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టిం చుకొని అరుదైన ఆలయాన్ని చారిత్రక కట్టడాల రక్షణ జాబితాలో చేర్చి అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**శివరాత్రి వేడుకలకు సిద్ధం చేయాలి...** మార్చి నెలలో 8వ తేదీన శివరాత్రి వేడుకలు జరగనున్నాయి. ఈ క్రమంలో ఇక్కడ చుట్టుపక్కల ఉన్న భక్తులు ఈ ఆలయాన్ని అభివృద్ధి చేయాలని ఈ శివరాత్రికి వేడుకలు జరిగేలా చూడాలని కోరుతున్నారు భక్తులకు కనీస వసతులు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రభ్వుత్వం దృష్టి సారించి జిల్లాలో శైవం, శైష్టవత్వం ఒకే చోట ఉన్న ఏకైక ఆలయాన్ని అభివృది చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
స్ట్రెస్డ్ అసెట్ రికవరీ బ్రాంచ్
2వ అంతస్తు, టీఎస్ఆర్టీసీ బిల్డింగ్ కమ్యూటర్స్ ఎమినిటీ సెంటర్ పైన, కోఠి, హైదరాబాద్-500095.
సవరణ
ఇందుమూలముగా సాధారణ ప్రజలకు తెలియజేయడమేమనగా శ్రీ సముద్రాల శ్రీనివాస్‌కు సంబంధించి తేదీ 23.02.2024 నాటి ఇ-వేలం కార్ అమ్మకం నోటీసును ఈ వార్తాపత్రికలో అనగా 24.02.2024 రోజున ప్రచురించడమైనది. ఇ-వేలం తేది: 02.03.2024 మరియు ధరావత్తు దాఖలుకు ఆఖరి తేది: 01.03.2024కు బదులుగా ఇ-వేలం తేది 04.03.2024 మరియు ధరావత్తు దాఖలుకు ఆఖరి తేది 02.03.2024గా చదువుకొనగలరు. ఇ-వేలం నోటీసు యొక్క ఇతర నిబంధనలు & షరతులు యథాతథముగా ఉండును.
తేది: 29.02.2024, ప్రదేశం: హైదరాబాద్ సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

CHANGE OF NAME
In my Service records my daughter name was mentioned SANGAM SAI SANHITHA (Old Name), H.No.1-11-10, Weavers Colony, Jangaon Dist - 506 167, T.S., have changed my daughter name as SANHITHA SANGAM (New Name) D/o. DAMODHAR KUMAR SANGAM, Ex-Serviceman, ID No.TS-10-6903476, for all purposes.

NOTICE
IN THE COURT OF THE HON'BLE IV ADDL.SENIOR CIVIL JUDGE RANGA REDDY DISTRICT : AT : L.B. NAGAR
E.P. No. 72 OF 2021
IN
O.S. No. 119 OF 2013
BETWEEN :-
M/s. Bhavishya Nidhi Chit Fund (Pvt) Ltd., Rep.by its Foreman Sri. G. Jagadish ...Decree-Holder
AND
Sri. G. V. Laxminarayana & 3 Others ...Judgment-Debtors
To,
G. Vijaya Bharath Reddy S/o. G. Krishna Reddy
Aged Major, Occ : Business
R/o. Flat No. 301, H. No. 11-13-1099, Sai Enclave Road No. 1, Green Hills Colony, Kothapet, Hyd.
Please take notice that, the Decree-Holder in the above filed said EP against the Judgement-Debtor No.2 for the relief of Proclamation of Sale of EP Schedule property i.e., Flat No. T2 in III Floor of Maruthi Nilayam, Plinth area of 950 Sft including common area and car parking along with undivided share of land admeasuring 29 Sq.Yards of 24.24 Sq.Mts out of total 440 Sq.Yards or 367.84 Sq.Mts constructed on Plot No. 34 and 35 in Survey No. 132 & 133 Block No.1, situated at Sringeri Colony, Mohan Nagar, Kothapet Village, Uppal Mandal, L.B. Nagar Municipality Under GHMC (L.B.Nagar Circle) Ranga Reddy District, and the same is posted to 15-04-2024 for your appearance before the above said Hon'ble court.
Hence, you are hereby wanted to appear before the above said Hon'ble court on 15-04-2024 at 10.30. A.M. either in person or through your advocate, failing which, the matter will be heard and determined ex-party
// BY ORDER OF THE COURT //
ANANTHA ANJANEYULU (Advocate)
Chamber of Lawyers' Collective
Plot No. 70, D.No. 3-11-413/2/NR, Above Karnataka Bank, 2nd Floor, Near Kamineni Hospital 'x' Road, L.B. Nagar, Hyd-74. Cell : 9848264759.

IN THE COURT OF THE HON'BLE II ADDL. JUNIOR CIVIL JUDGE CUM II METROPOLITAN MAGISTRATE; MEDCHAL MALKAJGIRI DISTRICT; AT MALKAJGIRI
O S No.111 OF 2024
Between:
1. Mrs. Pisipati Suseela, W/o Pisipati Hemachander, Aged 56 years, Occ: House Wife, R/o 1-250, Lakshmi Srinivasa Arcade, Bhavani Nagar, Near H D F C Bank, Malkajgiri, Ranga Reddy, Telangana State - 500 047.
2. Smt. Jammalamadaka Swetha Venkatanaga, D/o Late Pisipati Hemachander, W/o Sri Jammalamadaka Raghavaram Maruthi, Aged 38 years, Occ: Pvt. Service, Sri Seshkamal Arcade, R/o Flat No.301, H. No.1-6-169, Lakshmi Narasimha Swamy Temple Road, Phanigiri Colony, Chaitanyapuri, VTC: Saroor Nagar, P O: P & T Colony, K V Ranga Reddy, Telangana State. Pin Code 500 060.
3. Mr. Pisipati Santosh Ravi, S/o Late Pisipati Hemachander, Aged 36 years, Occ: Pvt. Employee, R/o 1-250, Lakshmi Srinivasa Arcade, Bhavani Nagar, Near H D F C Bank, Malkajgiri, Ranga Reddy, Telangana State - 500 047. ... PLAINTIFFS
A N D
1. The Tahsildar/ Mandal Revenue Officer, Malkajgiri Mandal, Medchal Malkajgiri District.
2. All Concerned ... DEFENDANTS
Whereas the above named plaintiffs filed the above suit to Late Pisipati Hemachander and the above suit is posted to 06.03.2024 for your appearance at 10.30 AM for objections/claims. If no objections are received on the said date the matter wil be decided on merits.
//BY ORDER OF THE COURT//
Sri K V L NARASIMHA RAO, & B L S R Rajeswari, ADVOCATES, H. NO.1-6-169, FLAT NO.G-2, SRI SESH KAMAL ARCADE, PHANIGIRI COLONY, CHAITANYA PURI, DILSUKH NAGAR, HYDERABAD - 500 060. 9703190595

## ప్రారంభమైన ద్వితీయ ఇంటర్ పరీక్షలు



**ఇల్లందు,ఫిబ్రవరి 29(నినాదం న్యూస్):**ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర వార్షిక పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఇల్లందులో 4 పరీక్ష కేంద్రాలలో పరీక్షలు నిర్వహించనున్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు.పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే పరీక్షా కేంద్రాల్లోకి పంపారు.

# కుడితిలో పడ్డ ఎలుకలా బిఆర్ఎస్ !

సంపాదకీయం

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ తెలుగు రాష్ట్రాలలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతు న్నాయి. పొత్తులు పొడుస్తున్నాయి. పొత్తులు లేనిదే ముందుకు కదలలేని పరిస్థితి ఉందన్నది స్పష్టం. అయితే ఇరు రాష్ట్రాల్లో కాంగ్రెస్ కేవలం లెఫ్ట్ పార్టీలతోనే వెళుతోంది. ఎపిలో కేవలం టిడిపి, జనసేన పొత్తులు మాత్రమే ఖరారు అయ్యాయి. బిజెపి పొత్తుల కోసం ఈ రెండు పార్టీలు ఎదురు చూస్తున్నాయి. అయితే బిజెపి చేరితే లెఫ్ట్ పార్టీలు దూరంగా ఉండనున్నాయి. దీంతో అవి అనివార్యంగా కాంగ్రెస్‌తో కలసి వెళతాయి. అలాగే కాంగ్రెస్ కూడా ఎవరో ఒకరు తోడుగా ఉండాలనే కోరుకుంటోంది. మొత్తంగా ఎపిలో వైసిపి ఒంటరి పోరుకు సిద్దం అయ్యింది. మొత్తంగా సమయం దగ్గర పడడంతో పరిణామాలు ఎలా ఉండ బోతున్నాయన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇటు తెలంగాణ, అటు ఆంధ్రప్రదేశ్‌లో కూడా భిన్నమైన పరిస్థితి ఏర్పడింది. ఇకపోతే తెలంగాణలో కాలంమారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో బిఆర్ఎస్ పార్టీ ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొంటోంది. ఈ పరిస్థితులలో లోక్‌సభకు ఎన్నికలు జరగనుండడంతో బీఆర్ఎస్ ఇరకాటంలో పడింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయి నెలలు గడవకముందే ఈ ఎన్నికలు రావడం, రాష్ట్రంలో కాంగ్రెస్, కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండడంతో ఈ రెండు పార్టీలను ఢీకొని నిలదొక్కుకోవడం బీఆర్ఎస్‌కు అంత సులువు కాదు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రభావం చూపలేని పరిస్థితి ఎదురైతే ఆ తర్వాత పార్టీ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుంది. ఇప్పటికే క్షేత్రస్థాయిలో మున్సిపాలటీటలు అన్నీ కాంగ్రెస్ ఖాతాలో పడుతున్నాయి. టపటపా వికెట్లు రాలుతున్నాయి. బిఆర్ఎస్ పట్ల నేతల్లో విశ్వాసం సన్నగిల్లుతోంది. ఒక్కొక్కరే అధికార పార్టీలోకి జంప్ అవుతున్నారు. దీంతో బీఆర్ఎస్ నాయకులు ఆందోళన చెందుతున్నారు. లోక్‌సభ ఎన్నికల నాటికి బీఆర్ఎస్ తరఫున గెలిచిన ఎంఎల్ఏలలో ఎంతమంది మిగులుతారో తెలియని పరిస్థితి ఉంది. మరోవైపు లోక్‌సభ ఎన్నికల్లో మోడీదే హవా అంటూ..బిఆర్ఎస్‌ను దెబ్బతీసేందుకు బిజెపి కూడా పావులు కదుపుతోంది. తెలంగాణలో ప్రతిపక్షపాత్ర పోషించాలని భారతీయ జనతా పార్టీ చూస్తోంది. దీనినుంచి బయటపడడానికి ఎన్డీఎలో చేరాలన్న ప్రతిపాదనలు బిఆర్ఎస్ ముందున్నాయని అంటున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీతో పొత్తు పెట్టుకోవడం ద్వారా కేంద్రంలో అధికారం పంచుకోవాలన్న ఆలోచన కూడా వీరికి ఉంది. అందుకే ఈ మధ్య బిజెపి, బిఆర్ఎస్ పొత్తులపై విపరీతంగా వార్తలు వస్తున్నాయి. అధికారంలో ఉన్నంత వరకు మజ్లిస్ పార్టీతో దోస్తానా ఉంది. ఇప్పుడు మజ్లిస్ పార్టీ కూడా మెల్లగా కాంగ్రెస్‌కు దగ్గరవుతోంది. ప్రస్తుత పరిస్థితులలో అటు కాంగ్రెస్, ఇటు బీజేపీని ఎదుర్కొని నిలదొక్కుకుంటూ పార్టీని బతికించుకోవడం ముఖ్యమని అందుకు ఎన్‌డిఎలో చేరడం ద్వారా ఎంపి సీట్లు గెల్చుకోవాలని కొందరు అభిప్రాయపడుతున్నారు. అప్పుడు మళ్లీ కేంద్రంలో అధికారం లో ఉండవచ్చన్నది కూడా వాదనగా ఉంది. ఒంటరిగా పోటీ చేయడం ద్వారా..లోక్‌సభ ఎన్నికల్లో ప్రతికూల ఫలితాలు వస్తే దాని ప్రభావం పార్టీ మనుగడపై పడుతుంది. అదే జరిగితే పార్టీ నుంచి వలసలను అపలేమని మరికొందరు భయపడుతున్నారు. లోక్‌సభ ఎన్నికల గండాన్ని ఎదుర్కోవడం ఇప్పుడు బిఆర్ఎస్ ముందున్న అతి పెద్ద సవాల్‌గా చూడాలి. పార్టీ మనుగడ కోసం విధిలేని పరిస్థితులలో బిజెపితో పొత్తు గురించి ఆలోచిస్తున్నామని పార్టీ నేతలు కొందరు చెప్పుకొచ్చారు. ఇప్పటికైతే విశ్రాంతి తీసుకుంటున్న కేసీఆర్‌కు ఇప్పుడు పార్టీని నిలబెట్టుకోవడం కత్తి మీద సామే అవుతుంది. శాసనసభ సమావేశాల్లో పాల్గొనకుండా ఎంతకాలం ఉండగలరన్నది కూడా ముఖ్యమే. ఏది ఏమైనా బీఆర్ఎస్ నాయకులకు భవిష్యత్తు అగమ్య గోచరంగా కనిపిస్తున్నది. ఈ కారణంగా బీజేపీతో పొత్తు పెట్టుకుంటే... అని ఆలోచన చేస్తున్నారు. మరోవైపు సిఎం రేవంత్ సవాళ్లువిసురుతున్నారు. అవినీతి కేసులు కూడా తరుముకుని వస్తున్నాయి. కాళేశ్వరం గుదిబండగా మారనుంది. ఎంపిలు, ఎమ్మెల్యేలు కూడా జారుకుంటే పార్టీని కాపాడుకోవడం వల్లకాదు. లోక్‌సభ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ లేచి నిలబడలేదని, దానిని దెబ్బతీస్తే విపక్షంలో తామే ఉంటామని బిజెపి కూడా ఆలోచిస్తోంది. బీజేపీ రాష్ట్ర నాయకులు కూడా బీఆర్ఎస్‌తో పొత్తుకు సుముఖంగా లేరు. మోడీ చరిష్మాతో పోతే కనీసం పది ఎంపి సీట్లు గెలుస్తామన్న ధీమాలో స్థానిక బిజెపి నేతలు ఉన్నారు. కాంగ్రెస్ కూడా కమ్యూనిస్టులతో కలసి పోరాడడం ఖాయంగా ఉంది. మజ్లిస్ కలసివస్తే ఆలోచిస్తామన్న ధోరణిలో ఉన్నారు. ప్రధాని నరేంద్ర మోదీని గద్దె దించడంకోసమే జాతీయ రాజకీయాలలోకి వెళుతున్నానని ప్రకటించిన కేసీఆర్... తెలంగాణ రాష్ట్ర సమితిని భారత రాష్ట్ర సమితిగా మార్చారు. ఢిల్లీలో బీఆర్ఎస్ కార్యాలయాన్ని అట్టహాసంగా ప్రారంభించి కొంతమంది ప్రతిపక్ష నాయకులను ఆహ్వానించారు. ఇక మోడీని ఢీకొట్టేది కెసిఆర్ మాత్రమే అని ప్రచారం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయారు. కాంగ్రెస్ సారథ్యంలో ఇండియా కూటమి ఇప్పుడు మోడీకి వ్యతిరేకంగా అవతరించింది. అందులో కూడా కెసిఆర్‌కు ఛాన్స్ లేదు. ఈ క్రమంలో బిజెపితోనే బలవంతపు సంసారం చేయాలి. అదికూడా బిజెపి ఒప్పుకుంటేనే. లేకుంటే ఒంటరి పోరు తప్పదు. ఈ పోరులో బిఆర్ఎస్ గెలవడం అంత సులభం కాకపోవచ్చు. అలాగే తెలంగాణ ప్రజల తిరస్కరణకు గురైన కేసీఆర్ ఇకపై జాతీయ రాజకీయాల గురించి ఆలోచించే అవకాశం లేకుండా రేవంత్ కూడా మెల్లగా అడుగులు వేస్తూ కెసిఆర్ ప్రభుత్వ కాలంలో జరిగిన అవినీతి చిట్టాలను విప్పుతున్నారు. విపరీతమైన అధికార దుర్వినయోగం జరిగిందని, అవన్నీ బట్టబయలు కానున్నాయని అంటున్నారు. ఈ క్రమంలో కేంద్రం అండ ఉండాలని కెసిఆర్ భావిస్తున్నారు,. అయితే పొత్తులు ఎలా ఉంటాయన్నది ముున్ముందు తేలనుంది.

### లోక సభ ఎన్నికల్లో

# రాజకీయ పార్టీలు బి'సి'లకు టికెట్లు ఇవ్వాలి

**( నినాదంగానే మిగిలిన బి'సి ల రాజ్యాధికారం)**

**దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలైనప్పటికి జనాభాలో 50శాతం వున్న బి 'సి లకు రాజ్యాధికారంలో వాటా ఇవ్వక పోవడం వల్ల బి 'సి లకు సామాజిక ఆర్థిక రాజకీయ 'పంపిణీ న్యాయం అందని ద్రాక్షే అయింది. ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంలో ప్రభుత్వాలు పాలకులు బి' సి లకు స్వల్పకాలిక జనాకర్షణ పథకాలు ప్రకటించి ఉచితాల ఊహా లోకంలో ముంచెత్తి మాయా మాటల హామీల గుప్పిట్లో పెట్టుకోవడం సాంప్రదాయమైంది . పథకాల కు ఆశించిన మేరకు నిధులు కేటాయించక ఆశల పల్లకి లోకి తోచి అయోమయ విషవలయంలోకి నెట్టి వేసే సంస్కృతి రాజ్యమేలుతుంది.**




సంతుష్టీకరణ జిమిక్కులని ప్రదర్శించి మభ్యపెట్టే వాగ్దానాలతో ఓటు బ్యాంకుగా వాడుకునే సంస్కృతి నెలకొన్నది.రాజకీయ పార్టీలు ఎన్నికలప్పుడే బి 'సి జపం చేస్తూ సార్వత్రిక ఎన్నికల్లో చట్ట సభల్లో పోటీ చేయడానికి టిక్కెట్లు కేటాయింపులో బి'సిల పట్ల వివక్ష పాటించడం వల్ల ఎం 'బి 'సి లు కులవృత్తి దారులు చట్ట సభల్లో ప్రవేశించలేనిస్థితి నెలకొన్నది. ఎన్నికల సమయంలో పాలక పార్టీలు ప్రతిపక్ష పార్టీలు బి'సి సాధికారితపై ఇచ్చిన మాటలు నీటి మూటలైనాయి. సార్వత్రిక ఎన్నికల్లో లోకసభ అభ్యర్థులుగా బి'సిలకు టికెట్లు నిరాకరించడం పాలక పార్టీ ప్రతి పక్ష పార్టీల రాజకీయ విధానమైంది.గెలుపు గుర్రాల పేరున జాతీయ' ప్రాంతీయ 'ఉప ప్రాంతీయ పార్టీలు ధనస్వాములకు 'స్కాం వీరులకు 'మాఫియా డాన్ లకు 'రియల్ వ్యాపారులకు పెట్టుబడి దారులకు వ్యాపార వాణిజ్య వేత్తలకు'బీ కార్పొరేట్ వేత్తలకు 'నేరచరితులకు టికెట్ల కెటాయింపులో పోటీ పడటం వల్ల రాజకీయ రంగం వాణిజ్య పరమై అవినీతి మయమైంది .రాజకీయాల్లో బి 'సి లు అంటరాని వారుగ పరిగణించే ధోరణలు ప్రభలడం పట్ల సామాజిక ఆర్థికవేత్తలు వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాను.ఎన్నికల్లో విజయం సాధించటానికి ధన ప్రభావం అగ్రవర్ణ కుల ప్రభావం గీటురాయికావడంగమనార్హం.దేశ జనాభాలో10 శాతాని కంటె తక్కువ వున్న అగ్రకులాల వారు చట్టసభల్లో ప్రవేశించి రాజ్యాధికారం చెలాయిస్తున్నారు. జనాభాలో అల్ప సంఖ్యాక జనాభా వున్న వారు రాజ్యాధికారాన్ని చెలాయిస్తూ పాలకులుగ చెలామణి అవుతున్నారు .అధిక జనాభా కలిగిన బహుజనులు రాజ్యాధికారానికి దూరంగా వున్న విచిత్ర స్థితి దాపురించింది ఈ స్థితి సామాజికఆర్థికఅసమానతలకు దారితీసింది. జనాభాలో దాదాపు 56 శాతం వున్న బి 'సిలు రాజ్యాధికారానికి దూరంగా ఉన్నారు.కనీస వసతులు లేక దారిద్ర్య రేఖ కింద జీవిస్తున్నారు విధ్య' వైద్య సౌకర్యాలు 'అవస్థాపన సౌకర్యాలు అందుబాటులో లేక 'పేదరికం' నిరుద్యోగం నిరక్షరాస్యత' అల్ప పౌష్ఠికాహారం' అనారోగ్యం సమస్యల్లో కొట్టు మిట్టాడుతున్నారు.

**ప్రజాస్వామ్యం సమాన వాటా**

ప్రజాస్వామ్య దేశంలో అన్ని కులాల వారికి వారి జనాభా నిష్పత్తి ప్రకారం ప్రజాస్వామిక ప్రాతినిధ్య వాటా కల్పించాలి. దేశంలో స్వేచ్ఛా' సమానత్వం' సౌభ్రాతృత్వం 'సమాన అవకాశాలు అందరికీ కలిపించినప్పుడే సామాజిక న్యాయం 'సామాజిక సమానత్వం' సమైక్యత సమగ్రత 'ఆర్థిక సమానత్వం సౌభ్రాతృత్వం ప్రగతి పురోగతి సాధ్యమై అభివృద్ధి జరుగుతుందని సామాజిక ఆర్థిక వేత్తలు అభిప్రాయ పడ్డారు .లికేంద్ర ప్రభుత్వ గణాంకాలు ' 'బి' సి ల ప్రాతినిధ్యంలి దేశంలో బి'సి లకు రాజ్యాంగబద్ధమైన హక్కులు' రాజకీయ హక్కులు భద్రత' రక్షణ కల్పించాలి. కేంద్ర ప్రభుత్వం ఇటీవల సేకరించిన గణాంకాల ప్రకారం 75 ఏళ్ల స్వాతంత్ర భారత్ లో రాజకీయ రంగములో బి'సి ల ప్రాతినిధ్యం14 శాతం దాట లేదని వెల్లడించింది.కేంద్రమంత్రి వర్గంలోరాష్ట్ర మంత్రివర్గంలో లోక సభ రాజ్యసభరాష్ట్ర అసెంబ్లీలో కౌన్సిల్ ల్లో బి' సి ల ప్రాతినిధ్యం పై జరిగిన సర్వేలో ఆసక్తి కరమైన అంశాలు వెళ్ళడైనాయి. దేశ జనాభాలో 56 శాతం వున్న బి'సి లకు రాజకీయ రంగంలో ప్రాతినిధ్యం 14 శాతం మించక పోవటం వల్ల బి' సిల సంక్షేమం అభివృధి ఆశించిన మేరకు జరుగలేదు. 75 యేళ్ల ప్రజాస్వామ్య గణతంత్ర భారత్ లో రాజ్యాంగ లక్ష్యాలైన సామాజిక 'ఆర్థిక రాజకీయ' పంపిణీ న్యాయం బి 'సిలకు జరుగలేదు. ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్స్ ఆశించిన ఫలితాలు ఇవ్వలేదు అన్ని రంగాల్లో బి 'సి లకు అన్యాయం జరిగడం శోచనీయం.లిబి 'సి'లు అన్నిరంగాల్లో నిర్లక్ష్యంలి రాజ్యాంగంలో చట్ట సభలకు ఎసీ' ఎస్టీ లకు సీట్ల రిజర్వేషన్స్ ప్రవేశ పెట్టి దేశ జనాభాలో 56 శాతం వున్న బి'సి లకు చట్టసభల్లో సీట్లు రిజర్వేషన్స్ ప్రవేశ పెట్టక అణిచివేశారు.దేశంలో ఉద్యోగ రంగములో బి 'సి ల వాటా 9 శాతం పారిశ్రామిక రంగములో బి 'సి ల వాటా 1 శాతం మాత్రమే వుంది. ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల్లో బి 'సి ల వాటా 5 శాతం దాటలేదు.

పీడిత కులాల సంక్షేమం

ప్రపంచంలో అనేక దేశాల ప్రభుత్వాలు పీడిత 'తాడిత 'దళిత ఉపేక్షిత 'వర్గాలను సామాజిక' ఆర్థిక రాజకీయ 'వైద్య :విద్య రంగాలలో సమగ్ర వికాసం కోసం కృషి చేస్తూ వుంటే మన దేశంలో పీడిత కులాలను అణిచివేయాలని చూడడం రాజ్యాధికారానికి దూరంగా ఉంచడం వల్ల రాజ్యాంగ లక్ష్యాలైన అందరికీ విధ్య అందరికీ వైద్యం అందరికీ ఉపాధి అనేది అందని ద్రాక్షగా మారింది.లిబి'సి సాధికారిత అధ్యయన కమిటీలి కేంద్ర ప్రభుత్వం 75 ఏళ్ల స్వాతంత్ర కాలములో దేశ జనాభాలో 56 శాతం వున్న బి' సి ల సామాజిక ఆర్థిక రాజకీయ. విధ్య వైద్య రంగాలలో శాస్త్ర సాంకేతిక వ్యాపార వాణిజ్య ఉద్యోగ రంగాల్లో సాధించిన ప్రగతి పురోగతి మీద అన్ని రంగాలలో బి 'సి లు ఎదుర్కొంటున్న సమస్యల మీద బి 'సిల అభివృధి సంక్షేమం కొరకు అమలైన చట్టాల పలితాల పట్ల సామాజిక వేత్తలు ఆర్థిక వేత్తలు పాలనావేత్తలు న్యాయ నిపుణులతో అధ్యయన కమిటీ వేసి బి 'సి ల సాధికారిత .పట్ల సమగ్ర అధ్యయనం చేయాలి .బి 'సి ల జనాభా గణన కులాల వారిగా జనాభా గణన చేసి కులాల వారిగా పథకాలు రూపొందించాలి. బి 'సి లకు సబ్ ప్లాన్ అమలు చెయ్యాలి .బీ' సీ ల జనాభా నిష్పత్తి ప్రకారం బడ్జెట్లో నిధులు కేటాయించాలి. లోకసభ' రాజ్య సభ 'రాష్ట్ర అసెంబ్లీలో 'కౌన్సిల్ ల్లో బి' సి లకు సీట్లు రిజర్వ్.చేస్తూ పార్లమెంట్లో బిల్లు ప్రవేశ పెట్టాలి.75 ఏళ్లలో చట్టసభల్లోకి ప్రవేశించని కులాలకు(ఎం' బి సీ'కులాలకు)రాజకీయ ప్రాతినిధ్యం కలిపించాలి. జనాభాలో బి.సి ల వాటా ఎంతో రాజ్యాధికారంలో అంతే వాటా ఇవ్వాలి. బి 'సి లకురాజ్యాంగం ప్రాధమిక హక్కులు' రాజకీయ హక్కులు ఎన్నిక విధానం'రిజర్వేషన్స్' కేంద్ర 'రాష్ట్ర ప్రభుత్వాల ఏర్పాటు కేంద్ర రాష్ట్ర' ఉమ్మడి జాబితా' స్థానిక సంస్థల పరిపాలన విధానాల మీద నిపుణులచేత శిక్షణా తరగతులు నిర్వహించి రాజ్యాంగం పట్ల అవగాహన చైతన్యం కలిగించాలి. కేంద్ర ప్రభుత్వం జనాభాలో 56 శాతం వున్న బి'సి' లకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు ప్రవేశ పెట్టాలి .56 శాతం జనాభా వున్న బి 'సి:లకు చట్ట సభల్లో ప్రాతినిధ్యం కల్పించే. రిజర్వేషన్స్ ప్రవేశ పెట్టటానికి రాజ్యాంగాన్ని సవరించాలి. పార్లమెంట్లో బీ' సీ బిల్లు ప్రవేశ పెట్టి బి సి ల రాజ్యాధికార సాధనకు ఉపక్రమించాలి. బి సి ల అభివృద్దే దేశాభివృద్ధి దిశగా ప్రభుత్వం కార్యాచరణతో సంక్షేమ భారత్ నిర్మాణానికి సమాయాత్తం కావాలని ఆశిద్దాం.

**-నేదునూరి కనకయ్య**
**అధ్యక్షులు**
**తెలంగాణ ఎకనమిక్ ఫోరం**
**కరీంనగర్**
**9440245771**

### కింగ్ చార్లెస్ 3 నుండి

# నైట్‌హుడ్ అందుకోనున్న మొదటి "భారతీ"యుడు

**భారతి మిట్టల్ బ్రిటన్ ప్రభుత్వ గౌరవ నైట్‌హుడ్ పురస్కారం అందుకోనున్న సందర్భంగా భారతీ ఎంటర్‌ప్రైజెస్ వ్యవస్థాపకుడు చైర్‌పర్సన్ అయిన సునీల్ భారతి మిట్టల్‌కు యునైటెడ్ కింగ్‌డమ్‌లోని కింగ్ చార్లెస్ 3 గౌరవ నైట్‌హుడ్‌ను ప్రదానం చేయనుంది. భారతదేశం యునైటెడ్ కింగ్డమ్ మధ్య వ్యాపార సంబంధాలను బలోపేతం చేయడంలో ఆయన చేసిన కృషికి గుర్తింపుగా ఇది లభించింది. చార్లెస్ 3నుండి నైట్ హుడ్ అందుకోనున్న మొదటి భారతీయుడు మిట్టల్. అతనికి నైట్ కమాండర్ ఆఫ్ ది మోస్ట్ ఎక్సలెంట్ ఆర్డర్ ఆఫ్ ద బ్రిటిష్ ఎంపైర్ ( కె బి ఇ) అవార్డు లభించింది.**



కె బి ఇ విదేశీ పౌరులకు గౌరవ హోదాలో ఇవ్వబడుతుంది. యు.కె జాతీయులకు ప్రదానం చేయబడిన నైట్‌హుడ్ వారికి సర్ లేదా డామ్ అనే బిరుదును ఇస్తుంది. యుకె కాని జాతీయులుకు గౌరవంతో ప్రదానం చేస్తారు. సర్ లేదా డామ్ వంటి బిరుదులను ఉపయోగించకుండా వారి పేరు తర్వాత కె బి ఇ జోడిస్తారు. గతంలో గౌరవ ఈ అవార్డ్ గ్రహీతలలో రతన్ టాటా (2009), రవిశంకర్ (2001) మరియు జంషెడ్ ఇరానీ (1997) ఉన్నారు. ఈ ప్రకటన వెలువడిన వెంటనే ఆయన "యు.కె మరియు భారతదేశం చారిత్రక సంబంధాలను కలిగి ఉన్నాయి. అవి ఇప్పుడు పెరిగిన సహకారంతో కొత్త శకంలోకి ప్రవేశిస్తున్నాయి. మా రెండు గొప్ప దేశాల మధ్య ఆర్థిక మరియు ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడానికి నేను కట్టుబడి ఉన్నాను."అని అన్నారు.ఉపగ్రహాల రంగంలో యు.కె ప్రభుత్వంతో సహా భారతదేశం యు.కె స్పేస్‌లో భారతి ఎంటర్‌ప్రైజెస్ పనిని ఈ గౌరవం గుర్తిస్తుంది. సునీల్ భారతి మిట్టల్ వన్‌వెబ్ (ఇప్పుడు యూటెల్‌శాట్) పునరుద్ధరణకు నాయకత్వం వహించారు. ప్రపంచవ్యాప్తంగా శాటిలైట్ బ్రాడ్‌బ్యాండ్ సేవలను అందించడానికి యుకె ప్రభుత్వం మరియు ఇతర వ్యూహాత్మక పెట్టుబడిదారులతో ఒక కన్సార్టియంను నడిపించారని కంపెనీ ప్రకటన పేర్కొంది. సునీల్ మిట్టల్ ఇండియా- యూకే సీఈఓ ఫోరమ్‌లో సభ్యుడిగా ఉన్నారు. అలాగే ఆయనకు న్యూ క్యాస్టిల్ యూనివర్సిటీ నుంచి డాక్టర్ ఆఫ్ సివిల్ లా, యూనివర్సిటీ ఆఫ్ లీడ్స్ నుంచి డాక్టర్ ఆఫ్ లా గౌరవ డాక్టరేట్లు వచ్చాయి. అతను భారతదేశం యొక్క జి20 ప్రెసిడెన్సీ సమయంలో ఆఫ్రికన్ ఎకనామిక్ ఇంటిగ్రేషన్‌పై బి20 ఇండియా యాక్షన్ కౌన్సిల్‌కు అధ్యక్షుడిగా పనిచేశాడు. అతను అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్ యూనియన్ యునెస్కో బ్రాడ్‌బ్యాండ్ కమిషన్ ఫర్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్‌లో కమీషనర్‌గా కూడా పనిచేస్తున్నాడు.

**సునీల్ భారతి మిట్టల్ :**

సునీల్ భారతి మిట్టల్ అంటే కొంతమందికి మాత్రమే తెలుస్తుంది. కానీ ఎయిర్టెల్ మిట్టల్ అంటే అందరికీ తెలుస్తుంది. ఎయిర్టెల్ కంపెనీని స్థాపించింది ఈయనే. సునీల్ భారతి మిట్టల్ భారతీయ బిలియనీర్ వ్యాపారవేత్త. భారతి ఎయిర్‌టెల్ భారతదేశపు అతిపెద్ద టెలికాం కంపెనీలలో ఒకటి. సునీల్ భారతీ మిట్టల్ 23 అక్టోబర్ 1957 న సత్పాల్ మరియు లలితా మిట్టల్ దంపతులకు రెండవ కుమారుడిగా పంజాబ్ లోని లుతియానాలో అగర్వాల్ కుటుంబంలో జన్మించారు. మిట్టల్ విద్యాభ్యాసం ముస్సోరీలోని వైన్‌బర్గ్ అలెన్ స్కూల్ మరియు గ్వాలియర్‌లోని సింధియా స్కూల్‌లో జరిగింది. 1976లో చండీగఢ్‌లోని పంజాబ్ యూనివర్సిటీ నుండి బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్‌తో పట్టభద్రుడయ్యాడు. సునీల్ తన మొదటి వ్యాపారాన్ని ఏప్రిల్ 1976లో స్థానిక సైకిల్ తయారీదారుల కోసం క్రాంక్ షాఫ్ట్‌లను తయారు చేసే వ్యాపారాన్ని తన తండ్రి నుండి తీసుకున్న 20,000 రూపాయల మూలధన పెట్టుబడితో ప్రారంభించాడు. 1980లో భారతి ఓవర్సీస్ ట్రేడింగ్ కంపెనీ పేరుతో ఒక ఇంపోర్ట్ ఎంటర్‌ప్రైజ్‌ను ప్రారంభించాడు. 1981లో పంజాబ్‌లోని ఎగుమతి కంపెనీల నుండి దిగుమతి లైసెన్స్‌లను కొనుగోలు చేశాడు. జపాన్ నుండి వేలకొద్దీ సుజుకి మోటార్స్ యొక్క పోర్టబుల్ ఎలక్ట్రిక్-పవర్ జనరేటర్లను దిగుమతి చేసుకున్నాడు. పాత ఫ్యాషన్ అయిన స్థూలమైన రోటరీ ఫోన్‌ల స్థానంలో పుష్-బటన్ ఫోన్‌లను పూర్తిస్థాయిలో అసెంబ్లింగ్ చేయడం 1984లో ప్రారంభించాడు. 1990 ప్రారంభంలో ఫ్యాక్స్ మెషీన్లు, కార్డ్‌లెస్ ఫోన్‌లు మరియు ఇతర టెలికాం గేర్‌లను తయారు చేసే వ్యాపారం చేసేవారు. మొబైల్ టెలికాం వ్యాపారాన్ని ఒక ప్రధాన వృద్ధి ప్రాంతంగా గుర్తించిన మొదటి భారతీయ పారిశ్రామికవేత్తలలో ఆయన ఒకరు. అతని ప్రణాళికలు చివరకు 1994లో ప్రభుత్వంచే ఆమోదించబడ్డాయి. అతను 1995లో ఢిల్లీలో సేవలను ప్రారంభించాడు, 1997లో ఎయిర్‌టెల్ బ్రాండ్ పేరుతో సెల్యులార్ సేవలను అందించడానికి భారతి సెల్యులార్ లిమిటెడ్ ఏర్పడింది. కొన్ని సంవత్సరాలలో భారతి సంస్థగా మారింది. 2 మిలియన్ల మొబైల్ సబ్‌స్క్రైబర్ మార్క్‌ను దాటిన తొలి టెలికాం కంపెనీగా అవతరించింది.

**ఆయన దాతృత్వం :**

భారతీ ఫౌండేషన్ ద్వారా భారతదేశంలోని గ్రామాలలో పాఠశాలలను స్థాపించింది. సమాజంలోని ఆర్థికంగా బలహీన వర్గాల నుండి అర్హులైన యువతకు విద్యను అందించడానికి ప్రపంచ స్థాయి విశ్వవిద్యాలయం 2017లో, సత్య భారతి యూనివర్శిటీని స్థాపించడానికి భారతి కుటుంబం వారి సంపదలో 10% (సుమారు రూ. 70 బిలియన్లు) దాతృత్వం చేశారు.

**పద్మభూషణ్ అవార్డు గ్రహీత :**

సునీల్ మిట్టల్ ప్రస్తుతం ఇండియా-యూకే సీఈఓ ఫోరమ్ సభ్యులుగా ఉన్నారు. గతంలో యూనివర్సిటీ ఆఫ్ లీడ్స్, న్యూకాసిల్ యూనివర్సిటీ నుంచి హానరరీ డాక్టర్ ఆఫ్ సివిల్ లా అవార్డులను అందుకున్నారు. అంతేకాదు, కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ సలహాదారుల బృందంలో సభ్యుడిగానూ ఉన్నారు. అలాగే, లండన్ బిజినెస్ స్కూల్ (ఎల్‌బీఎస్) గవర్నింగ్ బాడీకి సేవలందించారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్‌లో భారత సలహా బృందం సభ్యులుగానూ పనిచేశారు. 15 జూన్ 2016న, అతను ఇంటర్నేషనల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఛైర్మన్‌గా ఎన్నికయ్యాడు. 2007లో భారతదేశం యొక్క మూడవ అత్యున్నత పౌర పురస్కారమైన పద్మభూషణ్ లభించింది.

**-జనక మోహన రావు దుంగ**
**అధ్యాపకుడు**
**శ్రీకాకుళం**
**ఆంధ్రప్రదేశ్**
**8247045230**

### ఎన్నికల హామీల అమలు సాధ్య సాధ్యాల గురించి తెలుసుకునే హక్కు

# ఓటర్లకు వుంది సి'ఈ'సీ స్పష్టీకరణ హర్షణీయం

సార్వత్రిక ఎన్నికల్లో 'అసెంబ్లీ 'లోకసభ సభ్యులుగా పోటీ చేసే అభ్యర్థులు' రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో ఓటర్లకు ఇచ్చిన హామీలు వాగ్దానాలు మేనిఫెస్టోలో పేర్కొన్న అంశాలను నిర్ణీత కాల వ్యవధిలో అమలుచేసే సాధ్యా సాధ్యాల గురించి తెలుసుకునే హక్కు ఓటర్లకు వుందని ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమీషనర్ (సి'ఈ'సీ) రాజీవ్ కుమార్ పేర్కోవడం ప్రగతి శీల ప్రజాస్వామ్య స్ఫూర్తికి ఊతంగా నిలువడం హర్షణీయం అని తెలంగాణ ఎకానామిక్ ఫోరం' సామాజిక ఆర్థిక అధ్యయన వేదిక రాష్ట్ర అధ్యక్షులు నేదునూరి కనకయ్య అన్నారు.నేడు తెలంగాణ ఎకనామిక్ ఫోరం రాష్ట్ర కార్యాలయంలో హైదరాబాద్లో "రాజకీయ పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోలు బిఅమలుబి పౌరసమాజం పాత్ర" "అనే అంశంపై జరిగిన సమావేశానికి అధ్యక్షత వహించిన తెలంగాణ ఎకానమిక్ ఫోరం 'సామాజిక ఆర్థిక అధ్యయన వేదిక రాష్ట్ర అధ్యక్షులు నేదునూరి కనకయ్య మాట్లాడుతూ రాజకీయ పార్టీల హామీల సాధ్యా సాద్యాలను తెలుసుకునే హక్కు ఓటర్లకు వుందని. దీని వల్ల పాలనలో ప్రజా భాగస్వామ్యం పెరిగి పాలకుల్లో పారదర్శనికత జవాబుదారీతనం పెరిగి అభివృద్ధి ఫలాలు ప్రజలకు చేరువ అవుతాయి' చట్ట సభ సభ్యుల్లో బాధ్యతాయుత ప్రజాస్వామ్య వ్యవస్థ పరిడవిల్లి సామాజిక ఆర్థిక పంపిణీ న్యాయం సిద్ధిస్తుందని అభివర్ణించారు .రాజకీయ పార్టీలకు ఎన్నికల మేనిఫెస్టోల్లో హామీలు ఇచ్చే హక్కు ఉంటుందని 'ఆ హామీలు నిజమైనవేనా ఎన్నికల మేనిఫెస్టోల్లో ప్రతిపాదించిన పథకాలు కార్యక్రమాల అమలుకు కావలసిన నిధులు ఎలా సమకూర్చుతారు వంటి విషయాలు తెలుసుకునే హక్కు ఓటర్లకు ఉంటుందని కేంద్ర ఎన్నికల కమిషనర్ స్పష్టం చేయడం రాజ్యాంగ లక్ష్యాల సాధనకు ఉపకరించే గొప్ప సంస్కరణ అని నేదునూరి కనకయ్య సోదాహరణంగా వివరించారు.తెలంగాణ ఎకానమిక్ ఫోరం ముఖ్య సలహాదారులు డాక్టర్ మురళి' డాక్టర్' దశ్రతం మాట్లాడుతూ చట్ట సభకు ఎన్నికైన అభ్యర్థి అధికార దుర్వినియోగానికి అవినీతికి పాల్పడితే ఎన్నుకున్న నియోజక వర్గ "ఓటర్లు కౌన్సిల్ గా" ఏర్పడి ప్రజాభిప్రాయం ద్వారా పదవీచ్యుతున్ని చేసే "రీకాల్ చేసే విధానాన్ని" చట్ట రూపంలో అమలుచేయడానికి ప్రజా ప్రాతినిధ్య చట్టానికి సవరణచెయ్యాలని అన్నారు.తెలంగాణ ఎకానమిక్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ సి హెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల హామీలు నెరవేర్చడానికి నిధుల సేకరణ అప్పులు పన్నుల వసూలుకు అవలంబించే ఋణ విధానం పన్నుల విధానం 'రెవెన్యూ విధానాలను గురించి ఆర్థిక వ్యవస్థలో వృద్ధి 'అభివృద్ధి ఉత్పత్తి 'ఉత్పాదకత 'పొధుపు పెట్టుబడులపై కలిగేప్రభావం రాజకీయ పార్టీలు ఓటర్లకు వివరించాలి అన్నారు.తెలంగాణ జనసత్తా అధ్యక్షులు ముధుగంటి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూసి.ఇ.సి నేరచరితులుఎన్నికల సంఘం పరిధిలోకి చేర్చి చట్టప్రకారంనేర ఛరితుల అభ్యర్థిత్వాన్ని రద్దు చేసే సమగ్రమైనఎన్నికలసంస్కరణలు న్యాయ సంస్కరణలు చేపట్టే అధికారం సి.ఇ.సి కి దాఖలు పరచాలి.చట్టసభలకు ఉత్తమ ప్రజా ప్రతినిదులు ఎన్నిక కావటానికి న్యాయ 'పాలన సంస్కరణలు ప్రభుత్వం చేపట్టాలి .ఆధునిక డిజిటల్ సాంకేతిక తతో అభ్యర్థుల ఎంపిక ప్రతి రాజకీయ పార్టీ ఎన్నికలకు 6 నెలల ముందు ఆధునిక డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఉత్తమ అభ్యర్థుల గుర్తింపు ఎంపిక కొరకు నియోజక వర్గ ఓటర్ల అభిప్రాయాలను సేకరించాలి. ఓటర్ల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలి. నియోజక వర్గంలో ఓటర్ల ప్రథమ ప్రాధాన్యం పొందిన అభ్యర్థికి టికెట్లు ఇచ్చే విధానాన్ని అమలు చేస్తే టికెట్ కొరకు డబ్బులు ఇచ్చి కొనుక్కునే సంస్కృతికి తెరబడుతుంది. మేధావులు రాజ్యాంగం పట్ల చట్టాల పట్ల అవగాహన వున్న రాజనీతి వేత్తలు చట్ట సభలకు ఎన్నికై. మెరుగైన సమాజ ఆవిర్భావానికి దోహదపడే అవకాశాలు ఏర్పడతాయి.ప్రజా విశ్వాసం వున్న ఉత్తమ వ్యక్తులు ప్రజాప్రతినిధులుగా ఎన్నికైతె రాజ్యాంగ లక్ష్యాలు ఉద్దేశాలు నెరవేరి సమాజ సమగ్ర అభివృద్ధి సాధ్య మవుతుందన్నారు.ఈ విధానం ద్వారా ఎన్నికల్లో ధన ప్రవాహాన్ని రాజకీయాలలో ధనికులు ప్రాబల్యాన్ని కార్పొరేట్ సంస్థల అధినేతల ప్రవేశాన్ని అడ్డుకోగలమని అన్నారు . .సామాజిక ఆర్థిక అధ్యయన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ' ఏ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సి.ఇ.సి ఎన్నికలు ప్రశాంతగా నిర్వహించాలి.ఓటర్లు సరైన నాయకుడిని ఎన్నుకునే అవకాశం ఉండేలా ఎన్నికల సంఘం వెబ్‌సైట్లలో అన్ని అంశాలను పొందుపరచాలి. ఓటరు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ప్రశాంత వాతావరణంలో ఓటు వేసే పరిస్థితులు సి .ఇ.సి కల్పించాలి .అప్పుడే ఓటరు సరైన నాయకుడిని ఎన్నుకునే అవకాశం ఉంటుందని అన్నారు.ఎ'ఐ'పి 'ఎస్' సి.ఏర్పాటు చేయాలి తీర్మానంకేంద్ర' రాష్ట్ర 'ప్రభుత్వాలు ఉద్యోగుల నియామకం కోసం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్' స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్స్ నిర్వహించిన అర్హత పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన అభ్యర్థులకు ఉద్యోగాల్లో నియమించిన విధంగా ప్రభుత్వం "అల్ ఇండియా పొలిటికల్ సర్వీస్ కమిషన్" ఏర్పాటు చేసి పరీక్షల్లో అర్హత పొందిన అభ్యర్థులు మాత్రమే సార్వత్రిక ఎన్నికల్లో చట్ట సభలకు జరిగే ఎన్నికల్లో పోటీ చేసే విధంగా విధి విధానాలు రూపొందించాలని తీర్మానిస్తూ సమావేశం కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. మేధావులుయువత రాజకీయాలలో క్రియాశీలక పాత్ర పోషించి.. సమర్థులను చట్ట సభలకు సభ్యులుగా ఎన్నుకునే స్పృహ ఓటర్లలో కలుగాలని సమావేశం విజ్ఞప్తి చేసింది.ఈ సమావేశంలో తెలంగాణ ఎకనామిక్ ఫోరం ' సామాజిక ఆర్థిక అధ్యయన వేదిక సభ్యులు మహేందర్ మహేష్ శ్రీధర్ బాలకృష్ణ సుధాకర్ టివి స్వామి తదితరులు పాల్గొన్నారు.

**-నేదునూరి కనకయ్య**
**అధ్యక్షులు**
**తెలంగాణ ఎకనామిక్ ఫోరం**
**సామాజిక ఆర్థిక అధ్యయన వేదిక**
**కరీంనగర్9440245771**

# ఇదేమిా సీట్ల పంపిణీ వ్యవహారం

## ఇక నా అవసరం నీకు ఉండకపోచ్చు జనసేనానికి ముద్రగడ ఘాటు లేఖ

**కాకినాడ,ఫిబ్రవరి29(నినాదం న్యూస్):** టిడిపితో జనసేన సీట్ల ఒప్పందంపై ముద్రగడ పెదవివిరిచారు. ఇంతకన్నా దారుణం ఉండదన్నారు. పూర్తిగా లొంగిపోయినట్లుగా ఉందంటూ.. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై మాజీ మంత్రి ముద్రగడ మరో లేఖాస్త్రం సంధించారు. ఇన్ని రోజులు గ్యాప్ ఇచ్చిన ఆయన ఇప్పుడు మరోసారి విమర్శలు అందుకు న్నారు. ఇన్ని రోజులు జనసేనలో ముద్రగడ పద్మనాభం జాయిన్ అవుతారని అంతా అనుకున్నారు. కానీ పవన్ కల్యాణ్ వెళ్లి ఆహ్వానించకపోవడంతో ముద్రగడ బాగా హర్ట్ అయినట్టు ఆ లేఖ చూస్తే అర్థమవుతోంది. దీనికి తోడు తాడేపల్లి గూడెం సభలో పవన్ మాట్లాడుతూ.. తనతో వచ్చే వాళ్లంతా పోరాడే వాళ్లు అయి ఉండాలే కానీ సలహాలు ఇచ్చే వాళ్లు వద్దే వద్దని తెగేసి చెప్పేశారు. ఇది కూడా ముద్రగడను బాగా కెలికేసిందని తెలుస్తోంది. ఇంతకీ పవన్‌కు ముద్రగడ రాసిన లేఖలో ఏముందంటే... '2019 ఎన్నికల ముందు కవాతు సందర్భంగా కిర్లంపూడి వస్తానని కబురు వంచారు. అయోధ్య వెళ్ళొచ్చిన తరువాత కిర్లంపూడి వస్తానని మరోకసారి కబురు పంపించారు. ఎటువంటి కోరికలు లేకుండా మీతో కలుస్తానని చెప్పడం జరిగింది. అన్ని వర్గాలకు న్యాయం జరగడం కోసం పార్టీని ముందుకు తీసుకువెళ్ళడానికి నా వంతు కృషి చేయాలని, ఎటువంటి ఫలితం ఆశించని సేవ మీతో చేయించాలని అనుకున్నాను. మన ఇద్దరి కలయిక అనగానే యావత్ జాతి చాలా బలంగా కోరుకున్నారు. వారి అందరి కోరికతో నా గతం, నా బాధలు, అవమానాలు, కోరికలు అన్ని మరచి మీతో ప్రయాణం చేయడానికి సిద్ధపడ్డానండి. రాష్ట్రంలో ఒక కొత్త రాజకీయ ఒరవడి తీసుకురావాలని చాలా బలంగా ప్రయత్నం చేద్దామని ఆశించాను. మీరు కూడా ఇదే ఆలోచనతో ఉన్నారని నమ్మానండీ... కానీ దురదృష్టవశాత్తు మీరు నాకు ఆ అవకాశం ఇవ్వలేదండీ. చంద్రబాబు జైలులో ఉన్నప్పుడు మొత్తం టి.డి.పి కేడర్ బయటకు రావడానికి భయపడిపోయింది.

# విలువలతో కూడిన విద్యను అభ్యసించినప్పుడే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు





## ఎమ్మెల్యే కేపీ వివేకానంద

**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్)** విలువలతో కూడిన విద్యను అభ్యసించినప్పుడే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు అని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానందు తెలిపారు. సూరారం డివిజన్ ఎంజేఎస్ గార్డెన్ లో సుభాష్ నగర్ "వివేకానంద విద్యా మందిర్" హై స్కూల్ 27వ వార్షికోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు విద్యను కష్టంగా కాకుండా ఇష్టంగా చదివినట్లయితే ఉత్తమ ఫలితాలు సాధించ వచ్చున్నారు. పాఠశాల ఉపాధ్యాయులు విద్యా ర్థులకు విలువలతో కూడిన విద్యను నేర్పించి నట్లయితే విద్యార్థులతోపాటు పాఠశాలకు మంచి పేరు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జి.సురేష్ రెడ్డి, సూరారం డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# పైప్‌లైన్ పనులను పర్యవేక్షించిన డిప్యూటీ మేయర్



**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్):** నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ 28వ, 30వ డివిజన్ పరిధిలో రూ10 లక్షల వ్యయంతో హెచ్ఎండబ్ల్యూఎస్, మెగా ఓఆర్ఆర్ ఫేస్ -2 వారు నూతనంగా చెపడుతున్న పనులను డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ పైప్ లైన్ పనులను నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరగా పూర్తి చేయాలనీ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. గత కొద్ది రోజులుగా 28వ, 30వ డివిజన్‌లో ప్రజలకు మంజీరా నీటిసమస్య మెయిన్ లైన్ జామ్ అవడం వల్ల నూతనంగా పైప్ లైన్ పనులు చేపడుతున్నామన్నారు. దీనివల్ల ప్రజలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది అని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎండబ్ల్యూఎస్ లైన్ మెన్ లు సమరసింహారెడ్డి, మేకల బాలకృష్ణ, మునిసిపల్ ఇంజనీర్ రవి, కాంట్రాక్టర్, తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా నంద్యా నాయక్ కుమారుడు వివాహం



**మహేశ్వరం, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్):** కల్వకుర్తి నియోజకవర్గం కడ్తాల్ మండలం గ్రామపంచాయతీ మైసిగండి తండా చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జటావత్ నంద్యా నాయక్ కుమారుడు వివాహం బన్సీలాల్ వివాహం వేడుకలు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గం కడ్తాల్ మండలం మైసిగండి గ్రామపంచాయతీ పరిధిలోని ప్రధాన రహదారి పై గల ఎస్ పి ఫంక్షన్ హాల్ లో అంగరంగ వైభవంగా వివాహం నిర్వహించారు. వివాహ వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరైన భగవాన్ ఫౌండేషన్ చైర్మన్ దూదు చౌహాన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జటావత్ అమర్ సింగ్ నాయక్, కడ్తాల్ మండల అధ్యక్షులు జటావత్ సర్యా నాయక్, శ్రీను నాయక్, కేతవత్ బాబూలాల్ నాయక్, భీచ్చు నాయక్, శంకర్ నాయక్, తెలంగాణ స్టేట్ జర్నలిస్టు సింగ్, పార్టీ సీనియర్ నాయకులు ఈ వేడుకల్లో పలువురు రాజకీయ ప్రముఖులు పాల్గొని వారి బంధువులు కుటుంబ సభ్యులు మిత్రులతో హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు బంధువులు స్నేహితులు పెద్దలు నాయకులు తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా కొంపల్లి మున్సిపల్ చైర్మన్ యాదవ్ జన్మదిన వేడుకలు

## శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపాలిటీ చైర్మన్ సన్నా శ్రీశైలం యాదవ్ జన్మదిన వేడుకలు కుటుంబ సభ్యులు, ఆత్మీయులు, అభిమానులు, బంధుమిత్రులు, పార్టీ శ్రేణుల మధ్య ఘనంగా నిర్వహించారు. సన్న శ్రీశైలం యాదవ్ జన్మదిన వేడుకలకు ఎమ్మెల్యే కేపీ వివేకానంద ముఖ్యఅతిథిగా పాల్గొని శాలువా కప్పి పుష్ప గుచ్ఛం అందించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలి యజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీశైలం యాదవ్ ప్రజా సేవలో ఉంటూ మరెన్నో ఉన్నత పదవులు పొందుతూ ఇటువంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

# సాయి కృష్ణ పార్కు స్థలాన్ని కాపాడండి

## కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన కార్పొరేటర్ చిట్ల దివాకర్.



**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్):** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ సాయి కృష్ణ పార్కు స్థలాన్ని కబ్జాదారుల నుండి కాపాడాలని స్థానిక ప్రజలతో కలిసి స్థానిక కార్పొరేట్ చెట్ల దివాకర్ కమిషనర్ను కలిసి వినతి పత్రం అందజేశారు. గత 4 సంవత్సరాలుగా లక్షల రూపాయలు ఖర్చుచేస్తూ ఎన్నో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ కాపాడు కొంటున్న పార్క్ ను ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేట్ వ్యక్తుల చేతిలోకి వెళ్లకుండా కాపాడలిసిన భాధ్యత అందరిదీ అని కార్పొరేటర్ పేర్కొన్నారు. ఇలాంటి విషయాలలో పార్టీలకు అతీతంగా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఎంతో ఉంది అని వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ చిట్ల దివాకర్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులూ కోలన్ గోపాల్ రెడ్డి, నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబశివ రెడ్డి, స్థానిక కాలనీ వాసులు పాల్గొని అక్కడనుండి సాయికృష్ణ కాలనీ పార్క్ వద్ద జరిగిన ధర్నాలో పాల్గొన్నారు.

# అల్వాల్‌లో శ్రీమత్ భాగవత కథా సప్తాహం



**అల్వాల్, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్):** : అల్వాల్ పట్టణంలో టెంపుల్ అల్వాల్ లో గల ప్రసిద్ధ క్షేత్రం శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో గురువారం ఎనిమిది రోజులపాటు జరుగు శ్రీమత్ గీతా జ్ఞాన యజ్ఞము, శ్రీమత్ భాగవత కథ సప్తహంకు అంకురార్పణ చేశారు. ఈనెల 29 నుండి మార్చ్ 7 వరకు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఏకాదశితో మొదలై 7 మార్చ్‌న రుక్మిణి కళ్యాణంతో పరిపూర్ణమైతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. స్థానిక అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి, సహస్ర పురుష సూక్త యుక్త శ్రీ మద్భగవద్గీత జ్ఞాన యజ్ఞంలో పాల్గొని పూజలు చేశారు. ఈ మహా క్రతువు లోక కళ్యాణం కోసం జరుపుతున్నట్లు శ్రీబాలాజీ వెంకటేశ్వర స్వామి దేవాలయము భగవద్గీత భక్త సమాజం, అల్వాల్ బ్రాహ్మణ సంఘము, అల్వాల్ వైశ్య సంఘం, అల్వాల్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్, రామాంజనేయ ట్రస్టు అల్వాల్ భాగస్వామ్యంతో నిర్వహిస్తున్నామని నిర్వాహకులు స్పష్టం చేశారు. ఈమహాక్రతువులో శాస్త్రుల రఘురాం శర్మ, పెద్ది రమేష్, ప్రవీణ్, బ్రహ్మచారి, పద్మాచారి, శ్రీనివాస్, లింగారెడ్డి, రాంబాబు, నాయకులు మల్లేష్ గౌడ్, విఎన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

# నూతన దంపతులను ఆశీర్వదించిన కొలను శ్రీనివాస్ రెడ్డి



**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్):** నిజాంపేట్ వాసులు దోసకంటి శ్రీను కుమారుడి వివాహ మహోత్సవంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి హాజరై నవ దంపతులను ఆశీర్వదించడం జరిగింది. కార్యక్రమంలో ఎం.శ్రీనివాస్, సురేష్, రాజు, జంగయ్య, కుమార్ మహేష్,నరేష్,సురేష్,రమేష్,సంతు,గోపాల్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి విద్యార్థులకు మోటివేషన్ కార్యక్రమం

## ప్రముఖ మోటివేషన్ స్పీకర్ వేణు కళ్యాణ్




**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్) :** కుత్బుల్లాపూర్ మండల రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్మెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థుల మోటివేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ మోటివేషన్ కార్యక్రమానికి ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ వేణు కళ్యాణ్ ముఖ్యఅతిథిగా హాజరైనారు. వేణు కళ్యాణ్ మాట్లాడుతూ చదువు పట్ల గౌరవం పెంచుకుంటే, శ్రద్ధ దానంతట అదే వస్తుందన్నారు. తద్వారా ఎలాంటి పరీక్షలనైనా చాలా తేలికగా ఎదుర్కోవచ్చు అన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు, చింతల మహేష్ కుమార్ మాట్లాడుతూ, పిల్లలు తమపై తమకు విశ్వాసాన్ని పెంపొందించుకోవడం ద్వారా ఏదైనా సాధించగలరని అన్నారు. అనంతరం కార్యదర్శి రవికుమార్, కోశాధికారి గోవర్ధన్ రెడ్డిలు విద్యార్థులకు పరీక్షల ఒత్తిడి తగ్గించుకోవడానికి కావలసిన కొన్ని విలువైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాల చెందిన 2000 కు పైగా విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయులు, వివిధ పాఠశాలల కరెస్పాండెంట్లు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేను కలిసిన సేవా సంఘం కార్యవర్గ సభ్యులు



**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్):** కుత్బుల్లాపూర్ నియోజక వర్గ నాయి బ్రాహ్మణుల ఎన్నికలలో గెలుపొందిన ఓం మణికంఠ నాయి సేవ సంక్షేమ సంఘం అధ్యక్షులు వెంకటేశ్వర్లు నాయి, వారి కార్యవర్గ సభ్యులతో కలిసి గురువారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద ను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతనంగా ఎన్నుకోబడిన వారందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఒకరికొకరు సహకరించుకుంటూ నాయి బ్రాహ్మణ సంక్షేమాన్ని అభివృద్ధి పరచుకోవాలని సూచించారు. నాయి బ్రాహ్మణుల సంక్షేమానికి తన సహాయ సహకారాలు అందిస్తానని, ఎటువంటి సమస్యలున్న తన దృష్టికి తీసుకురావాలని వాటి పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుంటానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వీఎస్ఆర్ వెంకటేష్, జి. రవీందర్, యాదగిరి, అశోక్, మధు, నరసింహ, బాలేశ్వర్, కోటి, రమేష్, శివ, తదితరులు పాల్గొన్నారు.

# స్ప్రింగ్ విల్లీ కాలనీలో వార్షికోత్సవ వేడుకలకు మేయర్‌కు ఆహ్వానం



**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్):** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ స్ప్రింగ్ విల్లా కాలనీలో శ్రీ వెంకటేశ్వర సీత రామ లక్ష్మణ ఆంజనేయ శివనందీశ్వర గణపతి సుబ్రహ్మ ణ్య సాయినాథ దేవాలయ ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవ వేడుకలకు హాజరుకావాలని మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డి ని, సీనియర్ నాయకులు కోలన్ సునీల్‌రెడ్డితో మర్యాద పూర్వ కంగా కలిసిన స్ప్రింగ్ విల్లే కాలనీ వాసులు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ కాలనీ ప్రెసిడెంట్ మారుతి సాగర్,స్ప్రింగ్ విల్లే కాలనీ అసోసియేషన్ సభ్యులు,ఇతర ముఖ్యులు పాల్గొన్నారు.

# పద్మశాలీల సంక్షేమానికి పెద్ద పీట

## పద్మశాలి సంఘం భవనం ప్రారంభోత్సవంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి




**సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్ ):** అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని పద్మశాలి కులస్తుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని, సంక్షేమ పథకాలలో అభివృద్ధి కార్యక్రమాల్లో వారికి సముచిత స్థానం కల్పిస్తున్నామని అమీన్పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అన్నారు. అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని బీరంగూడ లో నూతనంగా నిర్మించిన పద్మశాలి సంఘం భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని పద్మశాలీల అభివృద్ధికి స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఎల్లప్పుడు అండగా నిలుస్తున్నారని తెలిపారు. చేనేత రంగానికి ఊపిరిలూదిన గొప్ప నాయకుడు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహా గౌడ్, కౌన్సిలర్ల కల్పన ఉపేందర్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు తలారి రాములు, యునుస్, బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు శేఖర్, రమేష్ గౌడ్, మకం మల్లేష్ ,పద్మశాలి సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేని కలిసిన అథ్లెటిక్ అసోసియేషన్ సభ్యులు



**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్):** నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత నెలలో గచ్చిబౌలిలో నిర్వహించిన తెలంగాణ ఉమెన్స్ ఛాంపియన్షిప్, తెలంగాణ మెన్స్ ఛాంపియన్షిప్, ఓవరాల్ ఛాంపియన్షిప్, మార్చ్ ఫస్ట్ పోటీల్లో తెలంగాణ మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ క్రీడాకారులు విజయం సాధించిన సందర్భంగా గురువారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద ను వారి నివాసంలో అసోసియేషన్ లైఫ్ అధ్యక్షుడు మర్రి లక్ష్మా రెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుత యాంత్రిక జీవితంలో మన ఆరోగ్యం ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపేందుకు అథ్లెటిక్ క్రీడా ఒక జీవిత భాగంగా మారిందని ప్రతి ఒక్కరూ ఈ క్రీడలను నేర్చుకునేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ ప్రభు కుమార్, ట్రెజరర్ డి.లక్ష్మి రామస్వామి, సునీల్, శ్రీలక్ష్మి, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# టివిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో తాతయ్య, అమ్మమ్మల దినోత్సవ వేడుకలు







**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్):** టి.వి.ఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మేనేజింగ్ డైరెక్టర్ టి. వంశీకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో పివిఆర్ మోడల్ హై స్కూల్ అపురూప కాలనీ, సత్యవాణి విద్యానికేతన్ ఎస్సార్ నాయక్ నగర్, బచ్పన్ ఒలంపియాడ్ చింతల్ , బచ్పన్ ప్లే స్కూల్ సూరారం, టివిఆర్ గీతాంజలి హై స్కూల్ పద్మా నగర్ ఫేస్ 2లో తాతయ్య అమ్మమ్మ నానమ్మల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పివిఆర్ విద్యాసంస్థలలో ఏర్పాటుచేసిన ఈవేడుకలకు హాజరైన అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యలకు ఆట, పాటలలో చురుకుగా పాల్గొని ఆనందంగా గడిపారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తాతయ్య, నానమ్మ, అమ్మమ్మలు వారి అభిప్రాయాలను సూచనలను స్వీకరించి వారిని ఘనంగా సత్కరించారు.

నర్సరీ, ఎల్‌కెజి చిన్నారుల ఆట పాటలను బుడిబుడి అడుగులు వేస్తూ ప్రపంచ దేశాల వేషధారణ, పాతకాలము నాటి సినీ యాక్టర్ల అనుకరణ వంటి కార్యక్ర మాలు అమ్మమ్మ తాతయ్యలను ఎంతగానో మురిపించాయి. కార్యక్రమంలో ప్రతి పాఠశాలకు ప్రశంసలు గ్రాండ్ పేరెంట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రాండ్ పేరెంట్స్ కి టి వి ఆర్ విద్యాసంస్థల చైర్మన్ టి. కోటిరెడ్డి, అకాడమిక్ డైరెక్టర్స్ డా. సూర రవిచంద్రా రెడ్డి, దీప్తి రెడ్డిలు గ్రాండ్ పేరెంట్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు.

# గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న పున్నారెడ్డి



**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్):** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం సూరారం 129 డివిజన్ సూరా రం కాలనీలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ మహి ళా అధ్యక్షురాలు ఆర్.లక్ష్మీ నూతన గృహప్రవేశ కార్యక్రమంలో టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు సొంటిరెడ్డి పున్నారెడ్డి హాజరైనారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రహమతుల్లా కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు మండవ శివకుమార్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

# మంత్రి తుమ్మలను కలిసిన మెడికల్ కాలేజీ నిర్మాణ సంస్థ ప్రతినిధులు

**ఖమ్మం, ఫిబ్రవరి29 (నినాదం న్యూస్)** గురువారం ఖమ్మం మెడికల్ కాలేజీ నిర్మాణ సంస్థ ప్రతినిధులు ద్రుమతారు కన్సల్టెన్సీ వారు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుని కలిసి, ఖమ్మం జిల్లాలో చేపట్టే మెడికల్ కాలేజీ శాశ్వత భవన నిర్మాణాల గురించి వివరించారు. మంత్రి మాట్లాడుతూ, ఇప్పటికే మెడికల్ కళాశాలలో మొదటి విద్యా సంవత్సరం ఆరంభించబడినందున, ఈ నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలని, అదే విధంగా భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారు. ప్రస్తుతం మెడికల్ కళాశాల నిర్వహణకు పాత కలెక్టరేట్ భవనాన్ని వాడుతున్నరని, కొత్త భవన నిర్మాణానికి 5 ఎకరాల స్థలం అందుబాటులో



ఉన్నదని మెడికల్ కళాశాల భవనం వసతి గృహం, ప్రిన్సిపాల్ క్వార్టర్స్ నిర్మాణాలు చేపట్టుచున్నామని సంస్థ ప్రతినిధులు తెలుపగా, జిల్లా కలెక్టర్, ఖమ్మంని సంప్రదించి, భవిష్యత్తు అవసరాలకు సరిపడ నిర్మాణాలు అనగా రెసిడెంట్ డాక్టర్స్ భోధన సిబ్బంది వసతి గృహాలు, మెడికల్ కాలేజీ అనుబంధ భవన నిర్మాణాలు, వీటన్నింటినీ పరిగాణలోనికి తీసుకొని అందుబాటులో ఉన్న స్థల వైశాల్యమును బట్టి పుర ప్రముఖుల అభిప్రాయాలను సేకరించి నిర్ణయం తీసుకొని ఆధునిక హంగులతో నిర్మాణం జరగాలని, రాష్ట్రంలోని ఒక ప్రముఖ వైద్య కళాశాలగా ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాలను రూపొందించాలని నిర్మాణ సంస్థని ఆదేశించడం జరిగింది.

## నేడు కారేపల్లిలో ప్రకటించనున్న ఎమ్మెల్యే

### మండలంలోని సిసి రోడ్లను ఎమ్మెల్యే రాందాస్ నాయక్ చే ప్రారంభోత్సవం



**కారేపల్లి, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్):** నేడు కారేపల్లి మండలంలో వైరా నియోజకవర్గ శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ పర్యటించనున్నారు.ఎమ్మెల్యే మండల పర్యటనలో భాగంగా ఉదయం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని, అనంతరం భాగ్యనగర్ తండా, విశ్వనాథపల్లి గ్రామంలో సిసి రోడ్ల ప్రారంభోత్సవం ఎమ్మెల్యే చేతుల మీదుగా ఉంటుందని మండల అధికారులు ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొనాలని తెలియజేశారు..

## జిల్లాలో నెల రోజులపాటు 30, 30(ఎ) పోలీసు యాక్ట్

### జిల్లా యస్పి చెన్నూరి రూపేష్



**సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్ ):** జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని నెల రోజుల పాటు (మార్చి 1వ తేది నుండి 31 వరకు) జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీసు యాక్ట్-1861 అమలులో ఉంటుందని జిల్లా యస్పి చెన్నూరి రూపేష్ ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేనిది సంగారెడ్డి జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని, శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రజా ధనానికి నష్టం కల్గించే, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టకూడదన్నారు. జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఈ విషయంలో పోలీసు వారికి సహకరించవలసిందిగా సూ చించారు.అనుమతి లేకుండా పై చర్యలకు పాల్పడితే సంబం ధిత వ్యక్తులపై చట్టరిత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## స్కూటీపై గంజాయి తరలిస్తు పట్టుబడిన మహిళ అరెస్టు

### 28కిలోల గంజాయి స్వాధీనం



**బోథ్, ఫిబ్రవరి 29(నినాదం న్యూస్):** ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం లోని మానకపూర్ గ్రామం వద్ద స్కూటీ పై గంజాయి తరలిస్తు ఒ మహిళ పోలీసులకు పట్టు బడింది. ఎస్సై సయ్యద్ ఇబ్రహీం, సర్కిల్ ఇన్స్పెక్టర్ భీమేష్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి.మోహిని సంతోష్ థాకరే అను మహి ళ ఒరిస్సా నుంచి మహారాష్ట్ర లోని వాసిం జిల్లాకు గంజాయ స్మగ్లింగ్ చేస్తుందని అన్నారు. గతంలో గంజాయి పండించే చేనుల్లో కూలీ గా వెళ్తూ గంజాయి స్మగ్లర్ గా మారిన మోహిని సుమారుగా 600కి మీ గంజాయి తరలించేదని పోలీస్ విచారణ లో తెలిపారు అన్నారు. నిందుతురాలి పై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే

### వెంకట్రాం కుమారుడి వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మదన్ లాల్





**కారేపల్లి, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్):** కారేపల్లి మండల పరిధిలోని వెంకట్యా తండా గ్రామపంచాయతీలో ఉన్న భల్లునగర్ తండా గ్రామానికి చెందిన టిఆర్ఎస్ పార్టీ నాయకుడు, వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్లాల్ అనుచరుడు బానోత్ వెంకట్రామ్ కుమారుడు వివాహానికి మాజీ ఎమ్మెల్యే హాజరై నూతన వధూవరులైన తరుణ్, లహరిక దంపతులను ఆశీర్వదించారు.అనంతరం కారేపల్లి సినిమా హాల్ సెంటర్లో కార్యకర్తలతో మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ ఎప్పటికీ తోడు ఉంటుందని భరోసా కల్పించారు. వైరా మాజీ ఎమ్మెల్యే మదన్ లాల్ వెంట జడ్పిటిసి వాంకుడోత్ జగన్ నాయక్,బెల్ కంపెనీ మేనేజర్ గూగులోత్ రవి నాయక్, భూక్యా చందు నాయక్, బిఆర్ఎస్ నాయకులు గుగులోత్ భగవాన్ లాల్, బొబ్బల బుజ్జిబాబు, మాజీ ఉపసర్పంచ్ గుగులోత్ శ్రీను,గుగులోత్ శివ నాయక్,గ్రామ శాఖ అధ్యక్షుడు బానోత్ భాస్కర్ నాయక్,బానోత్ రమేష్ ,ప్రధాన కార్యదర్శి జర్పల జగన్, పొడుగు హరీష్, నాగరాజు తదితరులు ఉన్నారు..

# కోర్టు కేసుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

### అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



**ఖమ్మం, ఫిబ్రవరి29 (నినాదం న్యూస్)** కోర్టు కేసుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ అన్నారు. గురువారం నూతన కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో అధికారులతో పెండింగ్ కోర్టు కేసులపై అదనపు కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ, కోర్టు కేసుల సత్వర పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. వివిధ శాఖలకు సంబంధించి టైం బాండ్ కేసులు, డైరెక్షన్స్, ధిక్కార, రిట్ పిటిషన్స్ ఉన్నట్లు ఆయన తెలిపారు. రిట్ పిటిషన్లపై సరైన కౌంటర్లు ఫైల్ చేయాలన్నారు. ఆదేశాలకు అను గుణంగా చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. టైం బాండ్ కేసులపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, డైరెక్షన్ మేరకు చర్యలు తీసుకోవాలని అన్నారు. కేసుల పరిష్కారం పై వారం వారం సమీక్ష చేయనున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో డిపివో హరికిషన్, డిఇఓ సోమశేఖరశర్మ, మత్స్య శాఖ ఏడి ఆంజనేయ స్వామి, నగరపాలక సంస్థ సహాయ కమీష నర్ సంపత్, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటి రక్తదానం చేసిన శ్రీనివాస్



**ఆళ్లపల్లి ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్):** అత్యవసర పరిస్థితుల్లో ఓ మహిళకు ఆళ్ళపల్లి పోలీస్ స్టేషన్ లోని ఓ కానిస్టేబుల్ గురువారం తన రక్తాన్ని దానం చేసి మానవత్వాన్ని చాటి చెప్పారు. దానికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఆళ్ళపల్లి మండలం నవతెలంగాణ రిపోర్టర్ మహమ్మద్ ఫయీమ్ బంధువుకి ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో రక్త పరీక్షలు నిర్వహించగా హెమోగ్లోబిన్ తక్కువగా ఉందని, ఆపరేషన్ నిమిత్తం "ఓ" పాజిటివ్ బ్లడ్ కావాలని వైద్యులు తెలిపారు. దాంతో రిపోర్టర్ వాట్సాప్ మాధ్యమంగా విషయం తెలపడంతో ఆళ్ళపల్లి పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహించే వై.శ్రీనివాసరావు అనే కానిస్టేబుల్ స్పందించి, స్వీయ ఖర్చులతో ఖమ్మం బ్లడ్ బ్యాంక్ దగ్గరకు వచ్చి తన "ఓ" పాజిటివ్ రక్తాన్ని దానం చేశారు. రక్తదానం అనంతరం కానిస్టేబుల్ మాట్లాడుతూ.. ఈరోజు నా పుట్టిన రోజని, ఈరోజున నాకు తెలియకుండా ఎంతో మంది ఆపదలో ఉంటారని, కనీసం నాకు తెలిసిన వారినైనా నా పుట్టిన రోజున ఆపదలో ఉంటే ఆదుకోవాలనే మంచి ఆలోచనతో రక్తదానం చేశానని చెప్పారు. కానిస్టేబుల్ చేసిన మంచి పనికి ఆళ్ళపల్లి పోలీస్ స్టేషన్ ఎస్సై ఈ.రతీష్ తో పాటు తోటి పోలీసులు, పలువురు మండల ప్రజలు హర్షం వ్యక్తం చేసి, తన జన్మదినం రోజున ఆపదలో ఉన్న ఓ మహిళకు రక్తదానం చేసిన నేపథ్యంలో తనకు జన్మదిన శుభాకాంక్షలు వాట్సాప్ మాధ్యమంగా తెలుపుతూ అభినందనలు తెలిపారు.

# వధూవరులను ఆశీర్వదించిన నేతలు, ప్రముఖులు

### భల్లు నగర్ లో జరిగిన వివాహ వేడుకల్లో పాల్గొన్న నాయకులు





**కారేపల్లి, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్):** మండల పరిధిలోని భల్లునగర్ తండా గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకుడు బానోత్ వెంకట్రామ్, రాధ దంపతుల ఏకైక కుమారుడి వివా వేడుకలకు మండల ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, ప్రముఖులు హాజరై నూతన వధూవరులైన తరుణ్, లహరిక దంపతులను ఆశీర్వదించారు.నూతన దంపతులను ఆశీర్వదించిన వారిలో మండల ఎంపీపీ మాలోతు శకుంతల కిషోర్, జడ్పిటిసి వాంకుడోత్ జగన్ నాయక్, హైదరాబాద్ బెల్ కంపెనీ మేనేజర్ గూగులోత్ రవి నాయక్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల మోహన్ కృష్ణ, నాయకులు ఇమ్మడి తిరుపతిరావు, మల్లెల నాగేశ్వరరావు, మేదరి వీర ప్రతాప్ (టోనీ), వాంకుడోత్ గోపాల్ నాయక్, సురేందర్ మనియార్, అజ్మర వీరన్న, అడప పుల్లారావు, శ్రీను నాయక్, రవి తదితరులు పాల్గొన్నారు.

# ఇండస్ట్రియల్ ల్యాండ్‌లో అక్రమంగా నడుపుతున్న షోరూంలు సీజ్

### లీగల్ టీమ్ ద్వార లీగల్ నోటీసులు జారీచేస్తాం: పటాన్చెరు జోనల్ కమీషనర్ అనురాధ






**సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్ ):** పరిశ్రమల స్థలాల్లో వ్యాపార సంస్థలు ఏర్పాటు చేసి షోరూములు నడుపుతున్న వ్యాపార సముదాయాన్ని సిజ్ చేశారు. ఇండస్ట్రియల్ ల్యాండ్ లో అక్రమంగా షోరూములు ఏర్పాటు చేస్తే లీగల్ నోటీసులు జారీ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని టీఎస్ఐఐసి జోనల్ మేనేజర్ అనురాధ హెచ్చరించారు. గురువారం పరిశ్రమల స్థానంలో నిర్మిస్తున్న నిర్మాణాలను అడ్డుకున్నారు. గతంలో చేసిన నిర్మాణాలన్నింటికీ సీల్ వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పారిశ్రామికవాడలో ఎన్నో సబ్సిడీలతో పరిశ్రమలకు అనుమతులు ఇస్తామన్నారు. అలాంటి అవకాశాలను దుర్వినియోగం చేస్తూ వ్యాపార సంస్థ నిర్మాణం చేపడితే చట్టవ్యతిరేకమైన పని అన్నారు. పరిశ్రమలకు ఇచ్చిన అనుమతితో పరిశ్రమలు మాత్రమే నిర్మాణం చేయాలన్నారు.

అలా కాకుండా వ్యాపార సంస్థలు నిర్మాణం చేయొద్దన్నారు. పారిశ్రామికవాడలో అలాంటి వాటిని గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రామచంద్రపురం జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న పారిశ్రామిక వాడలో జరిగిన ఐదు నిర్మాణాలను పరిశ్రమకోసం కాకుండా కమర్షియల్ బిజినెస్ కోసం వాడుతున్న ఐదు షోరూం లను గుర్తించి వాటిని సీజ్ చేశామన్నారు. టీఎస్ఐఐసీ లీగల్ సెల్ నుంచి విచారణ చేసి లీగల్ నోటీసులు జారీ చేస్తామన్నారు.

# బీఆర్ఎస్‌కు వరుస షాక్‌లు

- 59వ డివిజన్ కార్పొరేటర్ కాంగ్రెస్‌లోకి...
- మంత్రి పొంగులేటి సమక్షంలో చేరిన లలితా రాణి



**ఖమ్మం,ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్):** ఖమ్మంలో బీఆర్ఎస్ పార్టీకి వరుస షాక్‌లు తగులుతూ వస్తున్నాయి. తాజాగా ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 59వ డివిజన్ కార్పొరేటర్ బట్టపోతుల లలితా రాణి మంత్రి పొంగులేటి, సమక్షంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. దానవాయి గూడెం పర్యటన సందర్భంగా బుధవారం రాత్రి జరిగిన ఓ కార్యక్రమంలో కార్పొరేటర్‌తోపాటు మరో వంద కుటుంబాలు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరాయి. వీరికి మంత్రి పొంగులేటి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారందరికీ సముచిత స్థానం కల్పిస్తామని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి హామీ ఇచ్చారు.

# ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం

### ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి చంద్రిక రెడ్డి..



**ఇల్లందు,ఫిబ్రవరి29(నినాదం న్యూస్):** ఇల్లందు సబ్ జైలులో శిక్ష అనుభవిస్తున్న ఆర్థిక స్తోమత లేని ఖైదీలకు ఫ్రీ లీగల్ ఎయిర్ క్లినిక్ ద్వారా న్యాయవాదిని నియమించి ఉచితంగా న్యాయ సహాయం అందిస్తామని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కీర్తి చంద్రిక రెడ్డి అన్నారు.గురువారం ఆమె సబ్ జైలుని సందర్శించారు.ఈ సందర్భంగా ఖైదీల సమస్యలు,మెనూ ప్రకారం సదుపాయాలన్నీ అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు.సబ్ జైల్ సూపర్డెంట్ చంద్రశేఖర్,హెడ్ వార్డెన్ రాజు,సిబ్బంది శోభన్,శాంతి,స్వరూప్,లీగల్ ఎయిడ్ న్యాయవాదులు ఉమామహేశ్వరరావు,కీర్తి కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

# లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

- చిన్న పిల్లలను కిడ్నాప్ చేస్తున్నారనే అనుమానంతో అమాయక ప్రజలను కొట్టొద్దు.
- సోషల్ మీడియాలో వచ్చే పుకార్లు, ఫార్వార్డ్ మెసేజ్ పట్ల జాగ్రత్త వహించాలి.
- చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు.




**సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్ ):** ఈ నెల 9 వ తేది వరకు జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని చాలా కాలంగా పెండింగ్ లో ఉన్న, రాజీ పడదగిన క్రిమినల్, సివిల్ కేసులతో పాటు, భూ తగాదా, రోడ్డు ప్రమాద, వివాహ, కుటుంబ తగాదాలతో పాటు ట్రాఫిక్ కేసులకు సంబంధించి డ్రంకెన్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్, లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ వంటి వివిధ రకాల కేసులలో ఇరువర్గాలు రాజీ కుదుర్చుకోవలన్నారు. వివాదాలు అనేవి పెంచుకోవాలనుకుంటే జీవితకాలం కొనసాగుతాయని, రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవడమే ఉత్తమ మార్గమని ఎస్పి సూచించారు.గురువారం సంగారెడ్డి జిల్లా కొండాపూర్ పోలీసు స్టేషన్ లొ నిర్వహించిన ప్రజా అవగాహన కార్యక్రమంలో జిల్లా ప్రజలను ఉద్దేశించి ఎస్పీ చెన్నూరి రూపేష్ మాట్లాడారు. సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల నిర్మూలన, ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో గురువారం కొండాపూర్ పోలీసు స్టేషన్ లొ మండల ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. గత కొన్ని రోజులుగా చిన్న పిల్లలను కిడ్నాప్ చేస్తున్నారని సోషల్ మీడియాలో కొన్ని వదంతులు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొంతమంది అమాయక ప్రజలను కొడుతు, ఇబ్బందులకు గురిచేసి వారిని మానసికంగా, శారీకంగా హింసించడం జరుగుతుందన్నారు. మన జిల్లాలో కొండాపూర్ మండలంలో మ్యూజియం సందర్శనకు వచ్చిన యాత్రికులను కొంతమంది స్థానికులు వారి కిడ్నాపర్స్ అని కొట్టడం జరిగిందన్నారు. ఎవరైన చిన్న పిల్లలను కిడ్నాప్ చేస్తున్నారనే అనుమానం వచ్చినట్లైతే, అట్టి వ్యక్తులను పట్టుకొని 100 డైల్ కానీ, సమీప పోలీసు స్టేషన్ కు గాని సమాచారం అందించాలని సూచించారు. కానీ కిడ్నాప్ చేస్తున్నారనే అనుమానంతో అమాయక ప్రజలను కొట్టి, ఇబ్బందులకు గురిచేసి, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే అట్టి వ్యక్తులపై చట్ట రిత్య కఠిన చర్యలుంటాయని తెలియజేశారు. కిడ్నాప్ వంటి వదంతులను నమ్మొద్దని, కిడ్నాప్స్ జరుగుతున్నది నిజమే అయితే పోలీసు శాఖ తరపున జిల్లా ప్రజలను అప్రమత్తం చేయడం జరుగుతుందని సూచించారు. జిల్లా ప్రజలు యువత సంబంధం లేని గోడవలలో తలదూర్చి అనవసర ఇబ్బందులు కొని తెచ్చుకోవద్దని, నూతన కానిస్టేబుల్ నియామకంలో చాలా వరకు యువత చిన్న, చిన్న గోడవలతో ఉద్యోగానికి దూరమయ్యారని అన్నారు. జిల్లా ప్రజలందరూ రోడ్డు నియమాలు పాటించాలని, పాదచారులు రోడ్డు క్రాస్ చెయ్యడానికై నిర్దేశించిన జీబ్రా క్రాసింగ్ వద్ద మాత్రమే రోడ్డు దాటలని సూచించారు. ఎవరైనా మైనర్లు వాహనం నడుపుతూ పట్టుబడితే వారి తల్లిదండ్రులపై చార్యలుంటాయన్నారు.

డబ్బులు ఫ్రీ గా వస్తాయని చెప్పగానే ఆశపడి అట్టి సైబర్ నెరగాళ్లకు ఓటీపీ , పాస్వర్డ్ చెప్పడం. ఆన్లైన్ లలో అపరిచితులతో పరిచయాలకు దూరంగా వుండాలని, సూచించారు. ఆన్లైన్ మోసాల గురించి అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలన్నారు. అనవసర లింక్ లు ఓపెన్ చేసి కష్టాలు కొని తెచ్చుకోవద్దన్నారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైనట్లైతే వెంటనే 1930 నెంబర్ కు ఫిర్యాదు చేయాలన్నారు. ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు ప్రజాప్రతినిధులు వ్యాపారవేత్తలు వివిధ కుల సంఘాల నాయకులు ముందుకు రావాలని సూచించారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడంలో సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి డియస్పి సత్యయ్య గౌడ్, కొండాపూర్ సి.ఐ. చంద్రయ్య, కొండాపూర్ ఎస్ఐ. హరి శంకర్, సిబ్బంది, పాల్గొన్నారు.



# పదవ తరగతి వార్షిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం ఉదాసీనత వహిస్తే కఠిన చర్యలు
- జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్

**వనపర్తి జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్)**
పదో తరగతి వార్షిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడంలో చీఫ్ సుపరిండెంట్ లు ప్రధాన బాధ్యత వహించాలని, ఉదాసీనతకు వీల్లేదని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా సంబంధిత అధికారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు గురువారం కలెక్టరేట్ ప్రజావాణి హాల్లో జిల్లా విద్యా శాఖ ద్వారా చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంట్ అధికారులు, ఎం.ఈ.ఒ లతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు మార్చి 18వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి వార్షిక పరీక్షల ఏర్పాట్లు, అధికారుల బాధ్యతలపై కలెక్టర్ దిశానిర్దేశం చేశారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణలో చీఫ్ సుపరిండేంట్ లు ఎలాంటి అలసత్వం కానీ ఉదాసీనతకు తావు లేకుండా



పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 35 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగింది. వాటిల్లో మొత్తం 6906 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు. స్ట్రాంగ్ రూమ్ నుంచి పరీక్షకేంద్రాలకు ప్రశ్నా పత్రాలు తరలించడం, వాటిని పరీక్షా కేంద్రంలో లెక్క ప్రకారం తీసుకోవడం, తిరిగి సమాధాన పత్రాలను పోస్టు ద్వారా పంపే వరకు చీఫ్ సూపరింటెండెంట్లు పూర్తి బాధ్యత వహించాలన్నారు. చీఫ్ సూపరింటెండెంట్లు సీసీ కెమెరాల పర్యవేక్షణలో మాత్రమే ప్రశ్నాపత్రాలను తెరవాలని చెప్పారు. సంబంధిత కేంద్రాలకు చెందిన ప్రశ్నాపత్రాల కోడ్ ను జాగ్రత్తగా సరి చూసుకోవాలన్నారు. అధికారులు తప్పనిసరిగా పరీక్షల షెడ్యూలు, మార్గదర్శకాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు కనీస మౌళిక సదుపాయాలు బెంచీలు, తాగునీరు, మరుగుదొడ్లు సక్రమంగా ఏర్పాటు చేయాలని సూచించారు. రెండు రోజుల ముందే పరీక్షా కేంద్రాలను శుభ్రం చేసుకోవాలనీ ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లో కాపీయింగ్ జరగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలి. కాపీయింగ్ ను ప్రోత్సహించ వద్దని అలాంటివి తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహణ జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. విద్యార్థులకు అకాస్మాత్తుగా ఏదైనా జరిగినా, లేదా ఏదైనా అత్యవసరం ఉన్నా వెంటనే పై అధికారులకు తెలియజేయాలన్నారు. సెంటర్లలోకి ఎట్టిపరిస్థితుల్లో సెల్ ఫోన్ అనుమతి లేదని చెప్పారు. ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు ఫీజులతో సంబంధం లేకుండా విద్యార్థికి హాల్ టికెట్ జారీ చేసేవిధంగా బాధ్యతలు తీసుకోవాలని ఎంఈఒ లను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఈవో గోవిందరాజులు, ఎసిజి గణేష్, పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్ మెంటల్ అధికారులు, ఎంఈవోలు, తదితరులు పాల్గొన్నారు.

## తాడిచెట్టుపై నుండి జారిపడ్డ గీతా కార్మికుడు మృతి



**పరకాల, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్)**
నడికూడ మండలం రాయపర్తి గ్రామానికి చెందిన మార్క ఉమేష్ (48) గౌడ కుల వృత్తినే నమ్ముకుని కుటుంబ సభ్యులతో జీవన సాగిస్తున్న నేపథ్యంలో ఈనెల 27 తేదీ మంగళవారం వృత్తిరీత్యా కల్లు గీస్తున్న సమయంలో ప్రమాదవశాస్తు మోకు జారి కింద పడగా తీవ్ర గాయాలు కావడంతో తోటి గీతా కార్మికులు హుటాహుటిన పరకాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వారు పరిస్థితి విషమంగా ఉందంటూ ఉన్నత వైద్య పరీక్షల నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించగా తేదీ 28 గురువారం బాధితుడు ఉమేష్ గౌడ్ చికిత్స పొందుతూ మరణించినట్లు ఎంజీఎం వైద్య సిబ్బంది తెలిపినట్లు రాయపర్తి గీతా కార్మిక సంఘం అధ్యక్షులు మార్క తిరుపతిగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా కల్లు గీతా వృత్తినే నమ్ముకుని కుటుంబాన్ని పోషించుకునే పెద్ద దిక్కు ఉమేష్ తాడిచెట్టు పైనుంచి పడి మరణించడం చాలా బాధాకరమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉమేష్ గౌడ్ కుటుంబానికి 10 లక్షల ఎక్స్గ్రేషియా అందజేసి వారి కుటుంబానికి భరోసా ఇస్తూ తగిన న్యాయం చేయాలని కోరారు.

## ప్రజలకు స్వచ్ఛమైన మంచినీటిని అందించాలి

- భూపాలపల్లి జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా
- గాంధీనగర్ మిషన్ భగీరథ వాటర్ గ్రిడ్ పరిశీలన



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్)**
ప్రజలకు వేసవిలో స్వచ్ఛమైన మంచినీటిని అందించాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. గురువారం గణపురం మండలంలోని గాంధీనగర్ లో మిషన్ భగీరథ వాటర్ గ్రిడ్ ద్వారా త్రాగునీటి శుద్ధికరణ, పైప్ లైన్ ద్వారా నీటి సరఫరా విధానాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. త్రాగునీటి పంపిణీలో క్లోరిన్ శాతం ఎంత ఉందో హౌస్ హోల్డ్ వారిగా క్లోరిన్ టెస్ట్ పరిశీలించి ,సూచనలు చేశారు. మిషన్ భగీరథ త్రాగునీరు గురించి గ్రామస్తులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- పరీక్షా కేంద్రాలలోకి సెల్ ఫోన్లు అనుమతి లేదు..
- విద్యార్థులు పరీక్షా కేంద్రానికి సమయానికే చేరుకోవాలి...
- జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావు..

**కోదాడ, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్)**
కోదాడ పట్టణంలోని కెఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల లో జరుగుతున్న ఇంటర్ పరీక్షలు తీరును సూర్యాపేట జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావు గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. పరిశీలించారు. కేంద్రాల వద్ద పరీక్షలు సజావుగా జరిగేందుకు అధికారులు తీసుకున్న చర్యలు, పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు, విద్యార్థుల హాజరు వివరాలు పరీక్ష కేంద్రం చీఫ్ సూపర్డెంట్ పి. జోష్ను అడిగితెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ పరీక్ష గదులను పరిశీలించి ,పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు కేంద్రంలో కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులు ఇబ్బంది పడకుండా తగిన మౌలిక సౌకర్యాలు ఉండేలా చూసుకోవాలని




అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... కోదాడలో ఇంటర్మీడియట్ పరీక్షలలో భాగంగా గురువారం ఇంటర్ రెండవ సంవత్సరం కోదాడలో మొత్తం 1911 విద్యార్థులు గాను1837 హాజరయ్యారని, 74 మంది గైర్హా హజరయ్యారని తెలిపారు.కలెక్టర్ వెంట తాసిల్దార్ సాయి గౌడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ టీం అధికారి ఎమ్మార్వో రవికుమార్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## పీసీసీ మెంబర్ చల్లూరి మధుకు ఎంపి టికెట్ కేటాయించాలి

- ప్రజా సంఘాల నాయకులు పీక కిరణ్



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్)**
భూపాలపల్లి జిల్లా కేంద్రములో పీక కిరణ్ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోర్టు లో ప్రముఖ న్యాయవాది గా పని చేస్తూ కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదాల్లో పనిచేసి పిసిసి మెంబర్ ఎదిగి ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి రావడానికి అహర్నిశలు కృషి చేసి స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావును అత్యధిక మెజారిటీతో గెలిపించారు. ఇంతవరకు నేతకాని సామాజిక వర్గానికి కాంగ్రెస్ పార్టీ ఎంపి టికెట్ ఇవ్వలేదు ఇలాంటి నికార్సయిన నిజాయితీ, నిబద్ధత కలిగిన చల్లూరి మధుకు వరంగల్ పార్లమెంట్ టికెట్ ఇవ్వాలని ప్రజా సంఘాల నాయకులు పీక కిరణ్ ప్రభుత్వాన్ని కోరారు.దీంతో కాంగ్రెస్ పార్టీ మరింత అభివృద్ధి చెంది ప్రజలు ప్రజా పాలన ను గౌరవవిస్తారన్నారు పీక కిరణ్ పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు అక్కల బాపు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## దైవచింతనతో మానసిక ప్రశాంతత..

- ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి
- శ్రీ అభయాంజనేయ స్వామి కృపతో ప్రజలందరూ బాగుండాలి
- మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్

**కోదాడ, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్)**
దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుంది అని కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. గురువారం మోతే మండలం హుస్సేన్ బాద్ గ్రామంలో శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి అని అయన అన్నారు. శ్రీఅభయాంజనేయ స్వామి కృపతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆయన అన్నారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో



వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం హనుమాన్ యూత్ సభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు శీలం సైదులు, ఎంపిటిసి ఉషా సంజీవ రెడ్డి, టిఆర్ఎస్ నాయకులు సుధాకర్, దేవుల, లచ్చయ్య, లింగయ్య, బైరపంగు సుధాకర్, ఆల్దాస్ వెంకన్న, హనుమాన్ యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి

- ఐటి శాఖ మంత్రి కి వినతి పత్రం సమర్పించిన ఎంపీటీసీ మంచినీళ్ల దుర్గయ్య

**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్)**



మహాదేవపూర్ మండలంలోని అన్నారం ఎంపీటీసీ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలు సమస్యల పట్ల బుధవారం నాడు సచివాలయంలో ఐటీ శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు అనంతరం ఎంపీటీసీ మంచినీళ్ల దుర్గయ్య మాట్లాడుతూ అన్నారం పరిధిలో మద్దులపల్లి క్రాస్ నుండి కుంట్ల వరకు బిటి రోడ్డు మంజూరు చేయాలని కోరారు గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పలుగుల కుంట్లానికి సంబంధించిన రైతులు రెండు సంవత్సరాల క్రితం సాగునీటి కోసం 35 డీడీలు తీయగా ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదని తక్షణమే త్రీఫేస్ కరెంటు మంజూరు చేయించాలని అలాగే అన్నారం పెద్ద చెరువు మత్తడి తూము మరియు కాల్వ మరమ్మత్తుల కోసం ఇరిగేషన్ అధికారులు 23 లక్షల 73 వేయిల వ్యయం ఖర్చు వస్తుందని అంచనా వేశారని పెద్ద చెరువు కాలువ ద్వారా అన్నారం పరిధిలోని వందల ఎకరాలకు సాగునీరు అందుతుందని నిలిచిపోయిన నిధులని మంజూరు చేయించాలనీ అన్నారంలో 33/ 11 కెవి గల సబ్ స్టేషన్ ఏర్పాటు చేయించాలని వారు మంత్రిని కోరగా సానుకూలంగా స్పందించినట్లు దుర్గయ్య ఓ ప్రకటనలో తెలిపారు వారి వెంట మహాదేవపూర్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు లేతకరి రాజబాబు పలుగుల గ్రామ శాఖ అధ్యక్షులు మానేం మహేష్ పలుగుల గ్రామ శాఖ ఎస్సీ సెల్ అధ్యక్షులు శంకర్ కాంగ్రెస్ నాయకులు సురేందర్లు ఉన్నారు.

## పరకాల రెవెన్యూ డివిజన్ అధికారిగా కే. నారాయణ

**పరకాల, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్)**
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రెవిన్యూ సంస్థలో బదిలీల్లో భాగంగా పరకాల రెవిన్యూ డివిజన్ అధికారి శ్రీనివాస్



బదిలీపై వెళ్లగా రాష్ట్ర అధికారుల ఉత్తర్వుల మేరకు వారి స్థానంలో కే నారాయణ గురువారం పరకాల రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో రెవెన్యూ డివిజన్ అధికారిగా బాధ్యతలు చేపట్టడం జరిగింది. నూతన బాధ్యతలు చేపట్టిన ఆర్డిఓ నారాయణను పరకాల తహసిల్దార్ భాస్కర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆర్డిఓ నారాయణ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## తపాలా శాఖ ద్వారా ప్రధానమంత్రి సూర్యగర్ ముఫ్త్ బిజిలి యోజన ఎంపిక

**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్)**



ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజలీ యోజన లబ్దిదారుల ఎంపిక బాధ్యతను కేంద్ర ప్రభుత్వం తపాలా శాఖకు అప్పగించిందని మంథని సబ్ డివిజన్ తపాలా శాఖ అధికారి అజారుద్దీన్ సయ్యద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ స్కీముతో దేశవ్యాప్తంగా ఇళ్లకు సోలార్ రూఫ్ ప్లాంట్లను 40% వరకు సబ్సిడీతో నిర్మించి ఇచ్చి నెలకు 300 యూనిట్ల వరకు ఉచితంగా సౌర విద్యు త్తును అందించడమే ఈ పథక ఉద్దేశమన్నారు. రోజురోజుకు పెరి గిపోతున్న కాలుష్యాన్ని తగ్గించడానికి సహజ వనరులను కాపాడడంపై దృష్టి సారించిందన్నారు. ఈ పథకం ద్వారా దేశంలో కోటి 1. ఇండ్ల పైకప్పులపై సోలార్ ప్లేట్లను అమర్చుతారన్నారు. దీంతో సౌర విద్యుత్తు వినియోగం మరింతగా విస్తరించి సామాన్య ప్రజలపై కరెంటు ఛార్జీల భారం తగ్గుతుందన్నారు. ఈ పథకం వల్ల ప్రభుత్వానికి ఏడాదికి రూ.75,000 కోట్ల విద్యుత్ ఖర్చు ఆదా అవుతుంది. తపాలా శాఖ సిబ్బంది సహకారంతో ఈ పథక లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభమయిందన్నారు. ప్రజలు ప్రస్తుత తమ విద్యుత్తు బిల్లు, చరవాణి నెంబర్ తదితర వివరాలను తపాలా సిబ్బందికి అందిస్తే ఆ వివరాలను ఆన్లైన్లో నమోదు చేస్తారు.

## చిన్నారెడ్డిని సన్మానించిన ఓబిసి జిల్లా అధ్యక్షులు కోట్ల రవి

**వనపర్తి జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్)**
రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి గురువారం హైదరాబాదులోని ప్రజావాణి హాల్లో బాధ్యతలు స్వీకరించిన అనంతరం వనపర్తి జిల్లా ఓబీసీ జిల్లా అధ్యక్షులు కోట్ల రవి తన మిత్రబృందంతో ప్లానింగ్ బోర్డ్ చైర్మన్ చిన్నారెడ్డిని పూల బొకే అందించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాజకీయ చరిత్రలో ఎంతో అనుభవం సామ్యుడు ఏఐసిసి కార్యదర్శి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డికి బోర్డు వైస్ చైర్మన్ పదవి ఇవ్వడంతో సోనియా రాహుల్ ప్రియాంక రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి మంత్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డికి ఆయన పార్టీకి చేసిన సేవలు గుర్తింపు ఉద్యమంలో



ఎంతో ఉదాహరణతో పనిచేసి పార్టీ మనుగడ కోసం చేసిన సేవలను గుర్తించి పదవి రావడం ఎంతో సంతోషమని అసెంబ్లీ టికెట్ ను వదులుకొని పార్టీ కోసం పార్టీ సిద్ధాంతాల కోసం కట్టుబడి పని చేస్తున్న చిన్నారెడ్డికి ఇచ్చిన పదవికి వన్నెతెస్తారని వనపర్తి జిల్లా ఓబీసీ కాంగ్రెస్ పక్షాన ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## లఖ్పతి దీదీ పథకంపై ట్రైనింగ్...



**కోదాడ, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్)**
అనంతగిరి మండలం కేంద్రంలో బుధవారం లఖ్ పతి దీదీ పథకం ట్రైనింగ్ ఏర్పాటు చేశారు. ఈ ట్రైనింగ్ ప్రోగ్రాం గురించి ఏ డి డి డిఆర్ డి ఓ సురేష్ దిశా నిర్దేశం చేసారు. ఆర్థికంగా వెనుకబడిన మహిళలను ముందుకు తీసుకురావడానికి ప్రభుత్వం లఖ్పతి దీదీ పథకాన్ని ప్రారంభించిందని తెలిపారు. ఈ పథకం కింద మహిళా స్వయం సహాయక బృందాలకు ఎల్ఈడీ బల్బుల తయారీ నుంచి ప్లంబింగ్, డ్రోన్ రిపేరింగ్ వరకు సాంకేతిక పనులు నేర్పిస్తున్నారు. ఆర్థిక అవగాహనను పెంపొందించడానికి వర్క్ షాప్ లు కూడా నిర్వహిస్తున్నట్టుగా తెలిపారు. గ్రామంలోని స్వయం సహాయక మహిళా బృందాలకు ఈ విషయాలపై క్లుప్తంగా వివరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాన్ ఫామ్ డిపిఎం ఆంజనేయులు,మండల ఏపిఎం లక్ష్మి,టిఓటి ఏపియం లు,సీసీలు,వివోఏలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- చిమిర్యాలలో సిసి రోడ్డు ప్రారంభం
- కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి

**కోదాడ, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్)**
గ్రామాల అభివృద్దే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి అన్నారు. కోదాడ మండలం చిమిర్యాల 4 వ వార్డు పరిధిలో ఉపాధి హామీ పథకం క్రింద మంజూరైన రూ.10 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన సిసి రోడ్డు ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వ ఆయాములో గ్రామీణ ప్రాంతాలు ఎక్కడ అభివృద్ధి చెందలేదని, కేవలం ప్రజలను మభ్యపెట్టి పాలన కొనసాగించారని విమర్శించారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రతిపల్లెను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి తీరుతామని ఆమె అన్నారు. అవినీతి లేని పాలన అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మల్లెల రాణి బ్రహ్మయ్య, జడ్పిటిసి మందలపు శేషు కృష్ణకుమారి, ఎంపీడీవో రామచంద్ర రావు ,ఎంపీటీసీ కలకొండ సౌజన్య బాలకృష్ణ, కాంగ్రెస్ మండల అధ్యక్షులు తుమాటి వరప్రసాద్ రెడ్డి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవూరి వెంకటాచారి,పిఎసిఎస్ చైర్మన్ రఘుపతి, కోదాడ పార్టీ పట్టణ అధ్యక్షులు వంగవీటి రామారావు, మాజీ పిఎసిఎస్ చైర్మన్ కొత్త గురువయ్య, దామరచర్ల వీరప్రసాద్, మాజీ సర్పంచ్ కొండా శైలజ, కొండాపూర్ణ అలసకాని రవి ,కొత్త బ్రహ్మయ్య , గద్దె నరేందర్, తదితరులు పాల్గొన్నారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**వరంగల్ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్)**
హైదరాబాద్ జిల్లాలోని జూబ్లీహిల్స్ జేఆర్సీ కన్వెన్షన్ లో గురువారం తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, సాంకేతిక విజ్ఞానాల శాఖ మంత్రి దామోదర రాజనరసింహ కుమార్తె త్రిష – మణికంఠ ల వివాహ మహోత్సవంలో పాలకుర్తి నియోజకవర్గ%శీ% సహచర శాసనసభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి తో కలిసి వర్ధన్నపేట శాసనసభ్యులు,మాజి ఐపిఎస్ అధికారి కె ఆర్ నాగరాజు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జ్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్ రావు, వర్ధన్నపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి, చంద్రమౌళి, రుద్వేగ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ యునైటెడ్ పాస్టర్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నిక




**నిజామాబాద్ ప్రతినిధి, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్)**
నిజామాబాద్ తెలంగాణ యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు బిషప్ ఎం.జాన్సన్ ఎలక్షన్ కమిటీ నిర్వాహకులు తెలిపారు. గురువారం నగరంలోని ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రెవరెండ్ వి. జెకర్యా ఆనంద్ మాట్లాడుతూ.. జిల్లా అధ్యక్షుడిగా రెవరెండ్ జెకర్యా ఆనంద్, ప్రధాన కార్యదర్శిగా రెవరెండ్ సిహెచ్ డేనియల్, కోశాధికారిగా రెవరెండ్ సిహెచ్ జాన్ బన్యన్, కార్యనిర్వాహణ అధ్యక్షుడిగా శామ్యూల్, ఉపాధ్యక్షులు అమోస్, హనోక్, మాణిక్యాల శ్రీనివాస్, విన్సెంట్, జానా రమేష్, ఆనంద్ పాల్, అసోసియేట్ అధ్యక్షులు ఎలీషా, ఇశ్రాయేల్, ఉప కార్యదర్శిలు పాస్టర్ సువార్త రాజు, సుధీర్, పబ్లిక్ సిటీ సెక్రటరీగా రవీందర్, కరుణాకర్, రవి ఆనంద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ దినకర్, రాజు, ఉమెన్స్ సెక్రటరీ సిస్టర్ రిచల్ సజిని, సిస్టర్ షారోన్ రాణి లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

## జీరో బిల్లులు రానివారు అధైర్యపడొద్దు

- విద్యుత్ ఏఈ, మురళీకృష్ణ



**చింతపల్లి, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్)**
ఫిబ్రవరి మాసానికి జీరో బిల్లులు రాని విద్యుత్ వినియోగదారులు అధైర్య పడాల్సిన పనిలేదని మండల విద్యుత్ అధికారి మురళీకృష్ణ తెలిపారు. ఇటీవల జరిగిన ప్రజా పాలన కార్యక్రమంలో విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ వినియోగం పట్ల సరైన సమాచారం అందించిన వారికి మాత్రమే రానున్న మాసానికి 200 యూనిట్ల గాను బిల్లు వస్తుందని ఆయన తెలిపారు. అయితే 200 యూనిట్ల లోపు విద్యుత్తును వినియోగించిన వినియోగదారులు గృహజ్యోతి పథకాన్ని వర్తింప చేయాలని కోరుతూ తమ ఆధార్ కార్డు, విద్యుత్ బిల్లు, రేషన్ కార్డులతో పాటు ఒక దరఖాస్తును ఎంపిడిఓ కార్యాలయంలో అందజేయాలని ఆయన సూచించారు.గృహజ్యోతి పథకం కింద ఏర్పాటైన ఒక పోర్టల్ లో వినియోగ దారుల ధరఖాస్తులను ఫీడ్ చేయడం జరుగుతుందని ఆయన అన్నారు.గృహజ్యోతి పథకం కింద ఉన్న పోర్టల్ నుంచి తమ శాఖకు సమాచారం అందిన వెంటనే, అర్హులైన వినియోగదారులకు గృహలక్ష్మి పథకాన్ని వర్తింప చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. అందుకని వినియోగదారులు అధైర్య పడాల్సిన అవసరం లేదని ఆయన తెలిపారు. జీరో బిల్లులు రాని ప్రతి ఒక్క వినియోగదారుడు తమ వివరాలను అందించి ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## లాదెళ్ల గ్రామంలో వృద్ధులకు ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం




**పరకాల, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్)**
ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, హనుమకొండ మొబైల్ మెడికేర్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం దామెర మండలంలోని లాదెళ్ల గ్రామంలోని గ్రామీణ ఆరోగ్య కేంద్రం లో వృద్ధులకు ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం60 సంవత్సరాలు పైబడిన వయోవృద్దలకు ఉచిత సంచార వాహన వైద్య సేవల ఆరోగ్య శిబిరం హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పి. విజయచందర్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి ల ఆదేశానుసారం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా పాలకవర్గం మాట్లాడుతూ 60 సంవత్సరాలు పైబడిన వయో వృద్ధులకు హనుమకొండ రెడ్ క్రాస్ సంచార వైద్యశాల సేవలు ద్వారా బిపి. షుగర్ రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించటం జరిగిందని తెలిపారు. ఈ ఆరోగ్య శిబిరంలో రెడ్ క్రాస్ డాక్టర్లు డా . జె. కిషన్ రావు, డా. టి. మదన్ మోహన్ రావు, రెడ్ క్రాస్ సిబ్బంది : గుల్లెపెల్లి శివకుమార్, శ్రీకాంత్, గంగాధర్, అనిల్, సుమంత్, కేశోజు రమేష్, పోశాలు, గ్రామస్తులు మరియు వృద్దులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సమ్మర్ యాక్షన్ ప్లాన్ రూపొందించాలి

- గ్రామాలలో త్రాగునీటి వనరులను తక్షణమే పునరుద్ధరించాలి
- నీరు వృధా కాకుండా తగు చర్యలు తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్)**
జిల్లాలో త్రాగునీటి కొరత రాకుండా సమ్మర్ యాక్షన్ ప్లాన్ రూపొందించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా అధికారుల భవన సముదాయంలోని కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా పంచాయతీ, మున్సిపల్ అధికారులు, నీటిపారుదల ఇంజనీరింగ్, మిషన్ భగీరథ అధికారులతో సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై కలెక్టర్ ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. మిషన్ భగీరథ అధికారులతో ప్రస్తుత నీటి నిల్వలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో త్రాగునీటి కొరత రాకుండా సమ్మర్ యాక్షన్ ప్లాన్ రూపొందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని బోర్ల పనితీరుపై నివేదికలు ఇవ్వాలని, మరమ్మత్తులకు చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాలలోని త్రాగునీటి వనరులను తక్షణమే పునరుద్ధరించాలన్నారు. ప్రైవేటు బావులను గుర్తించాలని త్రాగునీటికి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. అధికారులు నీరు వృధా కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నీటి వనరులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. పైపులైన్లు పర్యవేక్షించాలని, లీకేజీలను గుర్తించి నీరు వృదాకాకుండా సత్వరమే మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ డేవిడ్, జడ్పి సిఈఓ రమాదేవి, సిపిఓ సుబ్బారావు, ఇరిగేషన్ ఈఈ



సమ్మిరెడ్డి, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి

- జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

**జయశంకర్ భూపాలపల్లి, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్)**
విధుల నిర్వహణలో ఎంతో బిజీగా ఉండే జిల్లా కలెక్టర్ ఉపాధ్యాయుడిగా మారారు. విద్యార్థులకు పాఠాలు బోధించి సమస్యలను నివృత్తి చేసి పరిక్షలంటే బయపడొద్దని, బాగా వ్రాయాలని విద్యార్థిలకు మనో ధైర్యాన్ని నింపారు. వివరాలలోకి వెళితే గురువారం ఘన్ పూర్ మండల కేంద్రంలోని కస్తూర్భా గాంధీ పాఠశాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. హాస్టల్ మౌలిక సౌకర్యాలను పాఠశాల ప్రిన్సిపాల్ ను అడిగి తెలుసుకున్నారు. 10 వ తరగతి విద్యార్థినిలకు భౌతిక శాస్త్రం, గణితం, ఇంగ్లీషు సబ్జెక్టులలో పాఠాలను బోధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయా సబ్జెక్టులపై ప్రశ్నలు వేసి వారి మేధోశక్తిని పరిశీలించారు. త్వరలో జరుగనున్న 10 వ తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించి మన జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. సబ్జెక్టులల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు



పరిక్షలంటే బయ పడొద్దని వత్తిడిని జయించాలని చెప్పారు. పరీక్షల సమయంలో ఆరోగ్య పరిరక్షణ కూడా చాలా ముఖ్యమని తగు జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ సూచించారు. విద్య మాత్రమే మనిషిని ఉన్నతస్థాయికి చేర్చగలదని, అందరూ బాగా చదివి ఉన్నత స్థాయికి చేరాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కస్తూర్భా గాంధీ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

## స్నూకర్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేత



**కోదాడ, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్)**
కోదాడ పట్టణంలో స్నూకర్ టోర్నమెంట్ గురువారం నిర్వహించారు. ఈ టోర్నమెంట్ లో గెలిచిన విజేతలకు బహుమతులను స్నూకర్ పార్లర్ నిర్వాహకులు అబ్దుల్ మాలిక్ చేతుల మీదుగా అందజేశారు. టోర్నమెంట్లో మొదటి బహుమతి మ్యాగీ గోపి, రెండవ బహుమతి చింతల సీతారామరాజు గెలుపొందారు. మంచి క్రీడలను ప్రోత్సహిస్తూ మొదటి బహుమతి అందజేసిన దొరకుంట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చౌడ హనుమంతరావు, రెండవ బహుమతి అందజేసిన దొరకుంట గద్దే నరేందర్ కు స్నూకర్ క్రీడాకారులు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నరేష్ నాయుడు, రచ్చ సుందర్ ,చిన్న గోపయ్య ,జావిద్, డిఆర్ రెడీమేడ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రయివేట్ డిగ్రీ కళాశాలల సమస్యలపై మంత్రికి విన్నపం..

- సమస్యలు పరిష్కరించడానికి తనవంతు కృషి చేస్తానని మంత్రి హామీ

**కోదాడ, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్)**
ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో ఉన్న డిగ్రీ , పీజీ కళాశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధి కళాశాలల యాజమాన్య సంఘం సభ్యులు గింజల రమణారెడ్డి, టి. శ్రీనివాసరెడ్డి , కెపిబివి కుమార్ లు గురువారం రాష్ట్ర పౌరసరఫరాలు , నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ని కలిసి విజ్ఞప్తి చేశారు. గడచిన పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో ప్రయివేట్ కళాశాలలకు ఫీజ్ రియంబర్స్ మెంట్ సకాలంలో అందకపోవడంతో యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాలలో నిరుద్యోగులు నడుపుతున్న పలు కళాశాలలు ఆర్థిక ఇబ్బందులతో సిబ్బందికి వేతనాలు ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు . ఉమ్మడి జిల్లా



వ్యాప్తంగా పలు కళాశాలలు మూతబడ్డాయన్నారు . కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకోని ప్రయివేట్ విద్యాసంస్థలను ఆదుకోవాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు . దీనికి సానుకూలంగా స్పందించిన మంత్రి ఉత్తమ్ ప్రయివేట్ విద్యాసంస్థల సమస్యలు పరిష్కరించడానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారని వారు తెలిపారు.

## కేంద్ర మంత్రి గడ్కరీకి ఘన స్వాగతం

- స్వాగతం పలికిన ఎంపి, కలెక్టర్, సీ.పీ



**నిజామాబాద్ ప్రతినిధి, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్)**
నిజామాబాద్ పర్యటనకు విచ్చేసిన కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా మంత్రి గురువారం మధ్యాహ్నం నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (న్యూ కలెక్టరేట్)కు చేరుకున్నారు. హెలిప్యాడ్ వద్ద నిజామాబాద్ పార్లమెంటు సభ్యులు ధర్మపురి అరవింద్, జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, డీఎఫ్ఓ వికాస్ మీనా, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి బొకేలు అందించి సాదర స్వాగతం పలికారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ ప్రత్యేక కాన్వాయ్ లో కేంద్ర మంత్రి పాత కలెక్టరేట్ మైదానంలో జరిగే సభలో పాల్గొనేందుకు బయలుదేరి వెళ్లారు.

## కోదాడ పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాంగ్రెస్‌లో చేరిక

- బుడిగం నరేష్ కు పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే పద్మావతి



**కోదాడ, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్)**
కోదాడ పిఎసిఎస్ వైస్ చైర్మన్ బుడిగం నరేష్ తన అనుచర వర్గంతో గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పద్మావతి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గతంలో బీఆర్ఎస్ పార్టీలో ఉన్న ఆయన ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఎమ్మెల్యే పద్మావతి బుడిగం నరేష్ కు పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని బుడిగం నరేష్ ను కోరారు. కాగా నరేష్ వెంట పదహారో వార్డుకు చెందిన కార్యకర్తలు నజీర్ సాయి లక్ష్మీనారాయణ ఉమా మహేష్, ఆనంద్ శివ రఘు గోపి శ్రీకాంత్ శ్రీధర్ మున్న తదితరులు నరేష్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వంగవీటి రామారావు పిఎసిఎస్ చైర్మన్ ఓరుగంటి శ్రీనివాస్ రెడ్డి, పలువురు కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆస్తిపన్ను వడ్డీపై 90శాతం రాయితీ

- మునిసిపల్ కమీషనర్ ఎమ్‌డి యూసఫ్

**మిర్యాలగూడ, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్)**
ఆస్తిపన్ను వడ్డీపై 90శాతం రాయితిని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మిర్యాలగూడ మునిసిపల్ కమీషనర్ ఎండి. యూసుఫ్ కోరారు. గురువారం విలేఖరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్, మునిసిపాలిటీలలో ఆస్తిపన్ను చెల్లించేందుకు 90శాతం వడ్డీ రాయితీ ఇస్తూ ఈ నెల 27న జిఓ ఆర్టీ నెంబర్ 101ను మునిసిపల్ పరిపాలన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం. దానాకిశోర్ జారీ చేశారని ఆయన తెలిపారు. మిర్యాలగూడలో 2022-23 ఆర్ధిక సంవత్సరం వరకు సుమారు 16 కోట్ల రూపాయలు బకాయిలున్నారని అందులో 8.20 కోట్ల రూపాయలు వడ్డీ అని అయితే జారీ అయిన జిఓ వల్ల మునిసిపాలిటీకి రూ82లక్షలు మాత్రమే వస్తాయని, మిగిత రూ. 7.4కోట్ల రూపాయల మేర పన్నుదారులకు లబ్ది చేకూరుతుందని ఆయన అన్నారు. ఆస్తి పన్ను వసూలు ప్రత్యేక కార్యక్రమాన్ని ముమ్మరం చేస్తున్నామని ఆయన అన్నారు. ప్రస్తుతం ఆరుగురు బిల్ కలెక్టర్లు ఆరు బిల్లింగ్ మిషన్లతో వసూలు చేస్తున్నారని, మరో బిల్లింగ్ మిషన్లు వస్తున్నాయని వార్డు ఆఫీసర్లతో వసూలు కార్యక్రమం వేగవంతం చేస్తామని ఆయన అన్నారు. ఆయన వెంట



రెవిన్యూ ఆఫీసర్ డి. కళ్యాణి, అకౌంటెంట్ ఎం. కళ్యాణి, రెవిన్యూ ఇన్స్పెక్టర్ రాకేష్ లున్నారు.

# బీజేపీ విజయ సంకల్పయాత్రను విజయవంతం చేయండి

- ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాదాసు రాజు

**వరంగల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్)**
గ్రేటర్ వరంగల్ మున్సిపాలిటీ కార్పొరేషన్ పరిధిలో ని వరంగల్ 37వ డివిజన్ ఖిలా వరంగల్ లోని వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ జంక్షన్ లో నేడు జరిగే విజయ సంకల్ప సభను విజయవంతం చేయాలని ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాదాసు రాజు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు పార్లమెంట్ ఎలక్షన్ లో భారతీయ జనతా పార్టీ గెలుపే ధ్యేయంగా (ఫిర్ ఏక్ బార్ మోడీ సర్కార్) మరోసారి ప్రధానిగా నరేంద్ర మోడీ నే గెలిపిద్దాం అనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్రంలో కేంద్ర మంత్రి, రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి సంకల్పించిన విజయ సంకల్ప యాత్ర కాకతీయ భద్రకాళి క్లస్టర్ 25 న భద్రాచలంలో ప్రారంభమై నేడు సాయంత్రం 6 గంటలకు వరంగల్ జిల్లా లో ప్రవేశించ నుందని, తెలంగాణ బిజెపి విజయ సంకల్పయాత్ర ముఖ్య అతిథులుగా ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి పాల్గొంటారు.ఆర్ టి ఓ జంక్షన్ భారీ ర్యాలీగా బయలుదేరి స్వాగతం పలుకుతూ మహంకాళి టెంపుల్, బొమ్మల గుడి, శాఖరాశి కుంట,ఇసుక అడ్డా, శివనగర్, హెడ్ పోస్ట్ ఆఫీస్ జంక్షన్ లో సాయంత్రం 7 గం. లకు జరిగే బహిరంగ సభ కార్యక్రమాన్ని బిజెపి కుటుంబ సభ్యులు కార్యకర్తలు వరంగల్ జిల్లా ప్రజలందరినీ భాగస్తులను చేసి దిగ్విజయం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు ముత్తినేని శ్రీనివాస్, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు జిలకర వీరస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లిగంటి నర్సింగ్గం, ఆంజనేయులు, భాస్కర రావు, తదితరులు పాల్గొన్నారు.



# నేర విచారణ మరింత సమర్ధవంతంగా ఉండాలి

- జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్
- రోడ్డు ప్రమాదాల నివారణ పై అన్ని స్థాయిల అధికారులు మరింత దృష్టి సారించాలి
- గంజాయి రవాణా, విక్రయాల మూలాలు, కీలక వ్యక్తులపై పటిష్ట నిఘా ఉంచాలి

**జగిత్యాల, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్)**
నేర విచారణ మరింత సమర్థవంతంగా చేయడంతో పాటు కేసులను సత్వరం పరిష్కరించే విధంగా పోలీస్ అధికారులంతా సమర్ధవంతంగా పని చేయాలని జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఐపిఎస్ సూచించారు.గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నేర విచారణ మరింత సమర్ధవంతంగా, అన్ని స్థాయిలలో అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తూ ముందుకు సాగాలని అన్నారు.పోలీసు స్టేషన్లలో నమోదయ్యే ప్రతీ కేసు వివరాలను ఆన్లైన్లో ఎప్పటికప్పుడు పొందుపరచాలని తెలిపారు దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. డీఎస్పీ లు, సి.ఐ లు తమ పరిధిలో ఉండే పోలీస్ స్టేషన్ లలో నమోదైన వివిధ రకాల కేసులు స్థితిగతులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ



సంబంధిత ఎస్.ఐలకు కేసుల దర్యాప్తుకు సంభందించి సూచనలు ఇవ్వాలని సూచించారు. పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి న్యాయధికారులతో సమన్వయం పాటిస్తూ భాదితులకు న్యాయం చేకూరేలా పనిచేయాలని కోరారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రతి రోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ లు, వాహన తనిఖీలు నిర్వహించాలని,బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే ప్రాంతాల పై నిఘా ఉంచాలని వారి పై కేస్ లు నమోదు చేయాలని అన్నారు. బ్లాక్ స్పాట్స్(రోడ్డు ప్రమాదాల ప్రమాదాలు అధికముగా జరుగు ప్రదేశాలు) గుర్తించి పంచాయతీ రాజ్, ఆర్, బి ప్రభుత్వ శాఖల సమన్వయంతో ప్రమాదాల నివరణ పై దృష్టి సారించాలని అన్నారు. రాష్ట్ర, జిల్లాల సరిహద్దుల నుండి వచ్చే గంజాయి, సరఫరా చేసే వ్యక్తులను గుర్తించి వారిపై కేసులు నమోదు చేసి రవాణా ను పకడ్బందీగా నియంత్రించాలన్నారు. జిల్లాలో గంజాయి,మత్తు పదార్థాలు పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకు జిల్లా పోలీస్ యంత్రంగం ప్రత్యేక ప్రణాళికలను ఏర్పాటు చేసుకొని మండలాల్లో, గ్రామాల్లో నిత్యం తనిఖీలు నిర్వహిస్తు ముందుకు సాగుతుంది అన్నారు. వివిధ జిల్లాల నుండి జిల్లాకు వచ్చే గంజాయి మూలలను,కీలక వ్యక్తులను గుర్తించి వారి పై కఠిన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో,కలశాలలో గంజాయ ,మత్తు పధార్థాలకు అలవాటు పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. గంజాయి, మరే ఇతర మత్తు పదార్థాలు అమ్ముతున్నట్లు రవాణా చేస్తున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీస్ స్టేషన్ కి లేదా డయల్100 కు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ప్రాసిక్యూషన్ లో భాగంగా కోర్టు వారు జారిచేసిన నాన్ బెయిలబుల్ వారెంట్లను నిందితులపై లేదా తప్పించుకుని తిరుగుతున్న నేరస్తులపై అమలుపరచడానికి అధికారులు అందరూ కృషి చేయాలని సూచించారు. నాన్ బెయిలబుల్ వారెంట్లను త్వరగా ఎగ్జిక్యూట్ చేయడం వల్ల కేసు విచారణ విజయవంతంగా పూర్తి అయి సకాలంలో బాధితులకు న్యాయం జరుగుటకు ఆస్కారం వుంటుంది అన్నారు.లోక్ అదాలత్ దృష్ట్యా పోలీస్ అధికారులు రాజీ పడ దగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి రాజీ పడేటట్లు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ భీమ్ రావు, డీఎస్పీలు రఘు చందర్,ఉమామహేశ్వర రావు,రంగా రెడ్డి, ఐటి కోర్ ఇన్స్పెక్టర్ లు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు,నాగేశ్వర రావు, రఫీక్ ఖాన్, మరియు సి.ఐ లు, ఎస్.ఐ లు, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

## రెండో రోజు ఇంటర్ పరీక్షలకు 174 మంది గైర్హాజరు

- 97.13 శాతం మంది విద్యార్థుల హాజరు



**జగిత్యాల, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్)**
ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలలో భాగంగా గురువారం 97.13 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 7049 మందికి గాను 6875 మంది పరీక్షలు హాజరయ్యారని, 174 మంది ఆబ్సెంట్ అయ్యారని తెలిపారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంలో ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్న అరవింద్ నగర్ లోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్ ఉన్నారు.

## ‘దళిత బంధు’ రెండో విడత ఆపింది అప్పటి బీఆర్ఎస్ సర్కారే..

- దళితులపై కపట ప్రేమ చూపిస్తుంది ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి
- రెండో విడత దళిత బంధు ఇచ్చేది కాంగ్రెస్ పార్టీనే..
- కాంగ్రెస్ నాయకులను విమర్శిస్తే సహించేది లేదు
- మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు

జమ్మికుంట, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్)
హుజురాబాద్ నియోజకవర్గ పరిధిలో “దళిత బంధు” రెండో విడత నిధులను ఆపింది అప్పటి బీ ఆర్ ఎస్ సర్కార్, అప్పటి ఎమ్మెల్సీ, ప్రస్తుత ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. గురువారం జమ్మికుంట పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాతకాల అనిల్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ “దళిత బందు” సాధన కమిటీ పేరుతో కొంతమంది నాయకుల ప్రకటనల వల్ల దళిత ప్రజలు అయోమయానికి గురవుతున్నారని అసలు దళిత బంధు రెండో విడత వస్తుందో లేదో అని ఆందోళన చెంది ఆత్మహత్య ప్రయత్నం చేసుకుంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంను బదనం చేయడమే లక్ష్యంగా కొంతమంది కుట్రలు పన్ని దళితులను ఆగం చేస్తున్నారని ఒకే ఒక ఎజెండాగా పెట్టుకొని దళిత బందు సాధన సమితి




పేరుతో వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారు దానివల్ల మా దళితులకు నష్టమే తప్ప లాభం లేదని వారు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం నిండు అసెంబ్లీలో దళిత బంధు రెండో విడత నిధులు కచ్చితంగా లబ్ధిదారులకు అందజేస్తామని అసెంబ్లీ సాక్షిగా చెప్పారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఒకసారి మాట ఇచ్చిందంటే కాంగ్రెస్ పార్టీ మాట తప్పదని దళిత బంధు ఇచ్చేది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భ ట్టి, జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్, నియోజకవర్గ ఇన్చార్జ్. ప్రణవ్ బాబు, టిపిసిసి నెంబర్. పత్తి కిష్టారెడ్డి, నాయకత్వంలో రెండో విడత “దళిత బంధు” ఇస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాతకాల అనిల్, దొడ్డే నవీన్, శ్రీకాంత్, అశోక్, అనిల్, సురేష్, రమేష్, దిలీప్, సాగర్, సాయికిరణ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## విగ్రహా ప్రతిష్ట వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే



**జగిత్యాల, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్)**
జగిత్యాల రూరల్ మండలం గుల్ల పేట గ్రామంలో లోకమాత పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంతా సురేష్ లు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే ను, చైర్ పర్సన్ ను గ్రామ ప్రజా ప్రతినిదులు, నాయకులు శాలువాతో సత్కరించి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సురేందర్ రెడ్డి,మాజీ సర్పంచ్ తిరుపతి,సీనియర్ నాయకులు రాజిరెడ్డి, గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

## జాతీయ సైన్స్ దినోత్సవ పాటల పోటీలలో అల్ఫోర్స్ విద్యార్థికి బహుమతి

**కరీంనగర్, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్)**
విద్యార్థులకు సైన్స్ పట్ల చక్కటి అవగాహనతోపాటు వాటికి సంభందించిన విషయాలలో పట్టు సాధించటానికై ప్రోత్సాహం అందించాలని తద్వారా సమాజంలో తగిన గుర్తింపు వస్తుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా వి. నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్లో పాఠశాలకు చెందని విద్యార్థి రాష్ట్రస్థాయి సైన్స్ ఉత్సవాలలో బహుమతి సాధించిన సందర్భంగా నిర్వహించిన అభినందన సభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సైన్స్‌ని విషయాలను సమగ్రంగా విశ్లేషించి సాధన చేసినట్లైతే పట్టు సాధించవచ్చని సామాజిక అవగహన పెరుగుతుందని చెప్పారు. సైన్స్ చాలా విస్తృతమైన అంశమని అందులోని విషయాల ద్వారా సమాజానికి పలు సమస్యలకు పరిష్కారంతోపాటు సృజనాత్మ కతను పెరుగుతుందని చెప్పారు. మన దేశంలోని ప్రముఖ శాస్త్రవేత అయిన సివి రామన్, జెసిబోస్, ఆర్యబట్ తదితర శాస్త్రవేత్తల నుండి ప్రేరణ తీసుకొని ముందుకు సాగాలని చెప్పారు.ప్రభుత్వం వారు విద్యార్థుల్లో సైన్స్ పట్ల మక్కువ పెంచడానికై సైన్స్‌ పరిశోధనలు చేయడానికై మరియు పరిష్కార మార్గాలను తెలియచేయడానికై అంశాన్ని ప్రధానంగా పరిగణించడానికై ఎన్నో కార్యక్రమాలను చెపట్టడమే కాకుండా ప్రతిభా వంతులైన విద్యార్థుకు ఉపకారవేతనాలను అందిస్తు సృజనాత్మకతను రెట్టింపు చేస్తున్నారని తెలిపారు.ఇందులో భాగంగా విద్యార్థులను చైతన్యపరుస్తు వివిధ



స్థాయిలలో నిర్వహించబడే పోటీలకు ఎంపిక,చేయడం జరుగుతుందని చెప్పారు. ఇందులో భాగంగానే జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర స్థాయిలో నిర్వహింపబడిన పాటల పోటీలలో పాఠశాలకు చెందిన ఎ.అభిరామ్, 8వ తరగతి అద్భుత ప్రదర్శనను కనబర్చినందుకు శ్రీమతి ఎ. వాణి ప్రసాద్, ఐఎఎస్ , పర్యావరణ సాంకేతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీమతి సిక్తాపట్నాయక్, ఐ.ఎ.ఎస్ గారు, హన్మకొండ జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా నిన్న బుధవారం రోజున హన్మకొండలో నిర్వహించినటువంటి ప్రత్యేక కార్యక్రమంలో సన్మానం పొందడం చాలా గొప్ప విషయమని హర్షం వ్యక్తం చేవారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

## వేసవి కాలంలో మంచి నీటి ఎద్దడి లేకుండా చూడాలి

**కరీంనగర్, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్)**
ఈరోజు కొత్తపెల్లి మున్సిపాలిటీలో మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం జరిగింది. ఇట్టి సమావేశం యొక్క ముఖ్య ఉద్దేశం కొత్తపెల్లి మున్సిపల్ లో భూమి విలువలు పెరగడం వల్ల గతంలో భువన్ అప్ ద్వారా మున్సిపల్



పట్టణంలో ఇంటి పనులు చాలా పెరగడం జరిగింది. కొత్తపెల్లి మున్సిపల్ పట్టణ ప్రజలను దృష్టిలో పెట్టుకొని గతంలో చేసిన తీర్మానమే కాకుండా ఈరోజు మళ్లీ కౌన్సిల్ సమావేశంలో గతంలో రెసిడెన్షియల్ కు టాక్స్ 0.25 శాతము ఉండగా ఈ రోజు దానిని 0.12.5 శాతము గా కమర్షియల్ ట్యాక్స్ 0.30 ఉండగా దానిని 0.25 శాతం గా తగ్గించాలని కౌన్సిల్ సమావేశంలో తీర్మానించడం జరిగింది. రాబోవు వేసవి కాలం లో మంచి నీటి ఎద్దడి వుండ కుండ చూడాలని అధికారులను ఆదేశించారు. ఇట్టి కార్యక్రమంలో కమీషనర్ రమేశ్ , కౌన్సిలర్స్ వసాల రమేశ్, జీరిపోతుల మొండయ్య , జరిపోతుల అంజలీ,మనుపటి వేణుగోపాల్, గున్నల విజయ, గందు రాంబాబు, వేముల కవిత, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# యాసంగి పంటలు ఎండక ముందే సాగునీళ్లు ఇవ్వాలి

- నీళ్లివ్వకుండా రైతులను బలిచేయొద్దు
- గన్నేరువరం మండలం చీమలకుంటపల్లి గ్రామలో ఎండిన పంటల పరిశీలన
- మిడ్ మానేరు రాజరాజేశ్వర ప్రాజెక్టులోకి నీళ్లు ఎత్తిపోసి పంట పొలాలకు కాల్వల ద్వారా సాగునీళ్లు ఇవ్వాలి
- సాగునీళ్లు లేక రైతులు సాగు చేసిన పంటలన్ని ఎండుతున్నాయి
- యాసంగి పంటలకు సాగునీళ్లు ఇవ్వకుండా ప్రభుత్వం రైతులను బలిచేయొద్దు
- కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్

కరీంనగర్, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్)



గన్నేరువరం మండలంలోని చీమలకుంట పల్లి గ్రామంలో ఎండిన పంటలు, నీళ్లు లేక నెర్రెలు భారిన చెరువు, సాగునీటి కాల్వ ను మానకొండూరు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తో కలిసి పరిశీలించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ,మేడిగడ్డ బ్యారేజ్ పిల్లర్లు కుంగినాయనే సాకుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టు లను ఎండబెట్టే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు.యాసంగి పంటలకు సాగునీళ్లు అందకపోవడంతో పంటలు కళ్ళ ముందే ఎండిపోతుంటే రైతులు గుండెలు పగిలేలా కన్నీరు పెడుతున్నారని పంటల సాగుకు పెట్టిన పెట్టుబడి మట్టిపాలు అవుతుందన్నారు.మేడిగడ్డ దగ్గర గోదావరి నదిలో 5000ల క్యూసెక్కుల నీరు వృధాగా సముద్రం లోకి పోతున్న కూడా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని..మేడిగడ్డ దగ్గర గోదావరి నదిపై కాఫర్ డ్యాం నిర్మాణం చేసి వెంటనే నీళ్లను అన్నారం, సుందిళ్ళ, ఎల్లంపల్లి ప్రాజెక్టుల్లోకి ఎత్తిపోసి అక్కడి నుంచి మిడ్ మానేరు లోకి నీళ్లను ఎత్తిపోయడంతో పాటు కాల్వల ద్వారా యాసంగి పంటలకు సాగునీళ్లు ఇవ్వాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు ఎప్పుడు అవసరం ఉంటే అప్పుడు సాగునీళ్లు ఇవ్వడం జరిగిందని ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అసమర్థత కారణంగా చెరువులు ఎండిపోవడంతో పాటు సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయని అన్నారు. మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ వెంట బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవి రామకృష్ణ రావు, రాజన్న సిరిసిల్ల జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, ఎలుక దేవయ్య, దీటి రాజు, జక్కుల నాగరాజు యాదవ్, దూలం సంపత్ గౌడ్, సాయి, తదితరులు ఉన్నారు.

## జిల్లాలో సిటీ పోలీస్ యాక్ట్ అమలు

- జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్



**జగిత్యాల, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్)**
జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని నెల రోజుల (మార్చి 1వ తేది నుండి 31 వరకు) పాటు జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ సంప్రీత్ సింగ్ తెలిపారు. నిబంధనల ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని అన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని ఎస్పి సూచించారు. జిల్లా ప్రజలు పోలీసు వారికి ఇట్టి విషయంలో సహకరించాలని శాంతిభద్రతల పరిరక్షణ కు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని సూచించారు.

## జమ్మికుంట మార్కెట్ కమిటీ చైర్మన్ రేసులో మొలుగూరి పద్మావతి

- అధిష్టానం ఆశీస్సులతోపాటు స్థానిక నేతల అండదండలు
- వ్యాపారులతో సత్సంబంధాలు విద్యావేత్తగా గుర్తింపు

**జమ్మికుంట, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్)**



కరీంనగర్ జిల్లాలోనే అతి పెద్ద వ్యాపార కేంద్రమైన జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి రేసులో జమ్మికుంట పట్టణానికి చెందిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు న్యాయవాది మొలుగూరి సదయ్య సతీమణి న్యాయవాది ములుగురి పద్మావతి చైర్మన్ పదవి రేసులో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ లో కార్యకర్త స్థాయి నుండి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వరకు అంచలంచలుగా ఎదిగిన సదయ్య కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కొరకు మొదటి నుంచి కష్టపడి పార్టీ జెండాను తన భుజాలపై మోస్తూ పార్టీ అభివృద్ధి కొరకు అహర్నిశలు కష్టపడ్డాడు. అంతేకాకుండా హుజురాబాద్ ఉప ఎన్నికల సమయంలో కూడా వివిధ పార్టీల నుండి సదయ్య దంపతులను తమ పార్టీలోకి రావాలని ఆహ్వానించిన కాంగ్రెస్ పార్టీని విడకుండా పార్టీ కోసం పనిచేసిన కరుడుగట్టిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలుగా ఉండిపోయారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని ఇప్పటివరకు తమ ప్రస్తానాన్ని కొనసాగించడం స్థానికులతో కలిసి మెలిసి ఉండడం గ్రూపు రాజకీయాలకు దూరంగా ఉండటం అధిష్టానం ఆశీస్సులు మెండుగా ఉండడం చదువుకున్న విద్యావేత్తగా న్యాయవాదిగా పద్మావతికి మంచి పేరు ఉండడం వారికి కలిసి వచ్చే అవకాశం ఉంది. హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ వోడితల ప్రణవ్ తో పాటు జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ జిల్లా అధ్యక్షులు కవ్వంపల్లి సత్యనారాయణ తో పాటు పట్టణంలోని వ్యాపారులతో అమాలి సంఘాలతో సతయ్య దంపతులకు మంచి సత్సంబంధాలు కలిగి ఉండడం వారికి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇవ్వాలని స్థానిక కాంగ్రెస్ నాయకులు కూడా వారికి మద్దతు తెలపడం కనిపిస్తుంది. ఏది ఏమైనా మొలుగూరి పద్మావతికి జమ్మికుంట మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇవ్వాలని స్థానిక కాంగ్రెస్ నేతలు అధిష్టానం దృష్టికి తీసుకు వెళ్ళనున్నట్లు సమాచారం.

## మండల వ్యవసాయ అధికారిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

- తప్పుడు బిల్లులతో ప్రభుత్వ సొమ్ము స్వాహా
- వ్యవసాయ శాఖ అధికారి అవినీతికి అంతులేదు
- డివైఎఫ్ఐ నాయకులు చిలుపూరి రాములు



**జమ్మికుంట, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్)**
జమ్మికుంట మండల వ్యవసాయ అధికారి (ఏఓ) గోవర్ధన్ రెడ్డి ప్రభుత్వ సొమ్మును కాజేస్తూ అవినీతికి పాల్పడుతున్నాడని డివైఎఫ్ఐ నాయకులు చిలుపూరి రాములు కరీంనగర్ కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం కింద మండల వ్యవసాయ అధికారికి 2018 నుండి 2022 వరకు ఖర్చుల వివరాలు కావాలని దరఖాస్తు చేయగా వ్యవసాయ అధికారి ఇచ్చిన బిల్లులను పరిశీలిస్తే అంతా మోసమని తేలిందని ఆయన అన్నారు. రైతులకు భోజనాలు తినిపించానని చాయ్ టిఫిన్ పెట్టించానని వివిధ హోటల్స్ నుండి బిల్లులు తీసుకువచ్చి దొంగ బిల్లులు పెట్టుకొని ప్రభుత్వ సొమ్మును కాజేసాడని వెంటనే ఆయన పైన చర్యలు తీసుకొని అతని వద్ద నుండి డబ్బులు రికవరీ చేసి ప్రభుత్వానికి అప్పగించాలని ఆయన కలెక్టర్కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గత కొన్ని ఏళ్లుగా ఒకే చోట పని చేస్తూ ఉండడం స్థానిక వాతావరణం లో అందరితో సాన్నిహిత్యం పెంచుకొని తన అవినీతికి తెరలేపాడని వెంటనే అతనిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలి

**జమ్మికుంట, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్)**



శాస్త్ర సాంకేతిక రంగంతో పాటు అన్ని రంగాల్లో విద్యార్థులు ముందుండాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. గురువారం జమ్మికుంటలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్ ను కలెక్టర్ తిలకించారు. ఈ సందర్భంగా పరికరాల తయారీ విధానం, వాటి పనితీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మన జీవన విధానంలో అవి ఏ విధంగా ఉపయోగపడుతాయని తెలుసుకున్నారు. హాజీరా అనే 9వ తరగతి విద్యార్థి చంద్రగ్రహణం ఏర్పడే విధానంపై తయారుచేసిన పరికరాన్ని విద్యాశాఖ యూట్యూబ్ చానల్ లో అప్లోడ్ చేయాలని డీఈవోను ఆదేశించారు. చాలా చక్కగా పరికరాలు తయారు చేశారని విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. సందర్భంగా హెచ్ఎం, ఉపాధ్యాయులు కలెక్టర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిఈఓ జనార్దన్ రావు, ఎంఈఓ విడుపు శ్రీనివాస్, పాఠశాల హెచ్ఎం ఆకుల సదానందం ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చూడవోయి భారతీయుడా...

అవని

**పర్యటనలే మనిషిని పరిపూర్ణుడిని చేస్తాయి. 'ఓ ఏడాది గడిచిపోయే సరికి ఇంతకుముందు చూడని ప్రదేశానికి వెళ్లిరావాలి' అంటారు బౌద్ధ గురువు దలైలామా. ఇంటినుంచి అడుగు బయట పెట్టకపోతే మాత్రం ఉన్నచోటనే ఉండిపోతాం. అదే కొత్త ప్రదేశాలను చుట్టేసి వస్తే కొత్త అనుభూతులు, సరికొత్త అనుభవాలు పోగేసుకుంటాం. మనసు విశాలమవుతుంది. ఇలాంటి దర్శనీయ స్థలాలు ప్రపంచంలో చాలానే ఉంటాయి. వాటిలోంచి ఈ ఏడాది సందర్శించాల్సిన 25 అత్యుత్తమ ప్రదేశాలను సిఫారసు చేస్తున్నారు పర్యాటక నిపుణులు. మనం ఎంచుకునే చోటును బట్టి, మన జీవనశైలిని బట్టి వ్యయాలు మారుతూ ఉంటాయి.**



**నెగొంబో, శ్రీలంక...** శ్రీలంక రాజధాని కొలంబో సమీపంలోని సముద్రతీర నగరం నెగొంబో. బండారనాయకే అంతర్జాతీయ విమానాశ్రయానికి దగ్గర్లోనే ఉంటుంది. సముద్రపు కయ్య (లగూన్)ను అనుసరించుకుని ఉన్న నెగొంబో శ్రీలంకలో పురాతనమైన చేపల పరిశ్రమకు నెలవైన నగరం. ఇక్కడి బీచ్ ప్రశాంతంగా ఉంటుంది. సముద్రం మీద మత్స్యకారులు చేపల్ని వేటాడే దృశ్యాలు కట్టిపడేస్తాయి. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో సముద్రంలో మునిగిపోయిన బ్రిటిష్ సరుకు రవాణా విమానాన్ని చూడటానికి డైవింగ్ సదుపాయం ఉంటుంది. తీర ప్రాంతంలో మడ అడవులు ప్రత్యేక ఆకర్షణ. వీటిని చూడటానికి పడవ సదుపాయం ఉంది. అలా వెళ్తూ వెళ్తూ నీటి ఉడుములు, వలస పక్షులను చూసి పరవశించిపోవచ్చు. ఇక్కడికి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న మున్నేశ్వరం దేవాలయం, స్థానికంగా ఉండే చేపల మార్కెట్ కూడా దర్శనీయమే. ఇక్కడి పెద్దపెద్ద హోటళ్లు విండ్ సర్ఫింగ్, సెయిలింగ్, స్కీయింగ్ సదుపాయాలు కూడా కల్పిస్తుండటం విశేషం.

**కోహ్ కేర్, కాంబోడియా...** కాంబోడియా దేశంలోని పవిత్ర నగరం. నాలుగున్నర చదరపు మైళ్ల విస్తీర్ణంలో నెలకొన్న దేవాలయాల సముదాయమే కోహ్ కేర్. ప్రసాత్ థామ్ అనే ఏడంతస్తుల పిరమిడ్ ఇక్కడి ప్రసిద్ధ నిర్మాణం. రకరకాల శిల్పాలు, రాతి చెక్కడాలు, కొలనులు, పురాతన నిర్మాణాలతో పెనవేసుకుని భారీగా పెరిగిపోయిన చెట్లు ప్రధాన ఆకర్షణ. దగ్గరి విమానాశ్రయం సియెమ్ రీప్.

**ముస్తాంగ్, నేపాల్...** నేపాల్ హిమాలయ దేశంగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడి ముస్తాంగ్ ప్రాంతం చూపు తిప్పుకోనివ్వని అన్నపూర్ణ, ధవళగిరి హిమగిరులు, పర్వతాల మధ్య మలుపులు తిరుగుతూ లోయల్లో హొయలొలికే నదులు, మంచుకొండల నుంచి నెమ్మదిగా జాలువారుతున్న హిమనదాలు, ఎత్తుపల్లాలతో కూడుకున్న లోయలు, జడలబర్రెలు, గొర్రెలతో ముస్తాంగ్ ప్రాంతం చూడముచ్చటగా ఉంటుంది. మనదేశానికి పొరుగునే ఉండే నేపాల్‌లో పర్యటన సులభమే.

**అల్మాటీ, కజక్‌స్తాన్...** మధ్య ఆసియా దేశం కజక్‌స్తాన్‌లో అతిపెద్ద నగరం. పురాతనమైన సిల్క్‌రోడ్‌లో వెలసిన అల్మాటీ కజక్‌స్తాన్‌లో అత్యంత అందమైన నగరం. ట్రాన్స్ ఇలి ఆల్టాయ్ పర్వతాల నేపథ్యంతో ఉండే అల్మాటీ మంచి ప్రణాళికతో, దారికి రెండువైపులా చెట్లతో కూడిన రోడ్లు, లెక్కలేనన్ని పార్కులు, తోటలతో సందర్శకులకు మధురానుభూతులను అందిస్తుంది. ఇక్కడి అసెన్షన్ కేథడ్రెల్ ప్రపంచంలోనే రెండో అత్యంత ఎత్తయిన కొయ్య కట్టడం. దీన్ని 1907లో నిర్మించారు.

**డొమినికా** ...కరీబియన్ దీవుల్లో కొలువైన 750 చదరపు కిలోమీటర్ల దేశం డొమినికా. అగ్నిపర్వతాలు, ఉష్ణమండల వర్షారణ్యాలు, అంతెత్తునుంచి జాలువారే జలపాతాలు ఇక్కడి ఆకర్షణ. అందుకే దీన్ని 'ప్రకృతి ద్వీపం' (నేచర్ ఐలాండ్) అని పిలుచుకుంటారు. దట్టమైన అడవులు, అందమైన రోజో లోయ, దాదాపు 200 అడుగుల వెడల్పుతో.. పొగలుకక్కుతూ మరిగే నీటి సరస్సు సందర్శనీయ స్థలాలు.

**మసా అండ్ కరారా, ఇటలీ...** కళా ప్రేమికులకు స్వర్గధామం ఇటలీలోని మసా అండ్ కరారా ప్రావిన్స్. మన హిమాలయాలను తలపించే అపువన్ ఆల్ప్స్ పర్వతాలు ఇక్కడ ప్రధాన ఆకర్షణ. ప్రపంచ ప్రసిద్ధ పాలరాతి గనులు ఇక్కడే ఉన్నాయి. మైఖేలాంజెలో రూపొందించిన సుప్రసిద్ధ శిల్పం డేవిడ్ ఇక్కడి పాలరాతితో తీర్చిదిద్దిందే. రోడ్డు వారగా శిల్పుల ఉలి సవ్వళ్లు వినిపించడం మసా అండ్ కరారా విలక్షణత. ఆల్ప్స్ పర్వతాలకు తోడు



మధ్యధరా సముద్రతీర బీచ్‌లు, భారీతనం ఉట్టిపడే క్రైస్తవ కేథడ్రెల్‌లు, మధ్యయుగాల ఐరోపా చరిత్రను గుర్తుకుతెచ్చే కోటలకు మసా అండ్ కరారా పెట్టింది పేరు.

**లద్దాక్, భారత్...**హిమాచల్‌ప్రదేశ్‌లోని రోహ్‌తాంగ్ కనుమ మీదుగా అటల్ టన్నెల్ గుండా సాగిపోతే కేంద్రపాలిత ప్రాంతం లద్దాక్ చేరుకుంటాం. ఆకాశాన్ని అందుకునే హిమాలయాలు, పాతాళాన్ని తాకే పర్వత లోయలు, సింధు, ష్యోక్ నదుల ఒయ్యారపు మలుపులు, బౌద్ధ మఠాలు, జడలబర్రెలు, కొండగొర్రెలు, నల్లమెడ కొంగలు, స్వచ్ఛమైన సరస్సులు లద్దాక్ ఆకర్షణలు. ఇక్కడి పెద్ద పట్టణమైన లేహ్‌లో మార్కెట్లు, మ్యూజియంలు, తొమ్మిది అంతస్తుల రాజభవనం చూడదగిన ప్రదేశాలు.

**బ్రెసీలియా, బ్రెజిల్** ...దక్షిణ అమెరికా ఖండంలో పెద్దదేశం బ్రెజిల్ రాజధాని నగరం బ్రెసీలియా. ప్రణాళికా బద్ధంగా నిర్మించిన ఈ నగరం అధునాతనమైన తెల్లటి భవంతులకు తార్కాణం. బ్రెజిల్ దేశపు అధ్యక్షుడి నివాసం పలాసియో డ అల్వొరడా కొత్త రూపాన్ని సంతరించుకుని ఈ ఏడాది మళ్లీ ప్రారంభం కానుంది. ఆధునిక నగర ప్రణాళికకు నమూనాగా నిలిచే బ్రెసీలియా నగరానికి యునెస్కో ప్రపంచ వారసత్వ స్థలాల జాబితాలో చోటు దక్కింది.

**యమగూచి, జపాన్...** స్వచ్ఛమైన ఉద్యానవనాలు, ఐదు అంతస్తుల రూరికోజీ ఆలయ పగోడాకు ప్రసిద్ధి చెందిన నగరం యమగూచి. వందల ఏండ్ల చరిత్ర కలిగిన బౌద్ధ మందిరం రూరికోజి పగోడాను జపాన్ జాతీయ సంపదల్లో ఒకటిగా పరిగణిస్తారు. ఇక నగరంలోని మలుపులు మలుపుల వీధులు యుద్ధ వ్యూహాన్ని అనుభూతికి తెస్తాయి.

**న్యూజిలాండ్** ...దక్షిణ పసిఫిక్ మహాసముద్రంలో ఆస్ట్రేలియాకు దగ్గరగా ఉన్న దేశం న్యూజిలాండ్. ఉత్తర, దక్షిణ న్యూజిలాండ్ ప్రధాన దీవులు కాగా, చిన్నచిన్న దీవులు అనేకం ఉన్నాయి. క్రియాశీల అగ్నిపర్వతాలు, చూపు తిప్పుకోనివ్వని గుహలు, హిమనదాలతో ఏర్పడిన లోతైన సరస్సులు, అందమైన లోయలు, పొడవైన బీచ్‌లు, మంచుతో కప్పి ఉండే ఎత్తయిన పర్వతాలకు నిలయం ఈ దేశం. కివీ పక్షులు మరో ఆకర్షణ. న్యూజిలాండ్‌ను రోడ్డు ద్వారా వెళ్తూ చూడాలని పర్యాటకులు కోరుకుంటారు. కానీ రైలులో చుట్టేయడం గొప్ప అనుభూతిని ఇస్తుంది. ఇలా న్యూజిలాండ్‌ను తిరగడానికి 17 రోజులు పడుతుంది.

**మావుయి, అమెరికా...** అమెరికాకు చెందిన హవాయి దీవుల్లో భాగమే ఈ మావుయి ద్వీపం. పసిఫిక్ మహాసముద్రం ఓ వైపు.. కాలుష్యం జాడలు లేని స్వచ్ఛమైన బీచ్‌లు, కొబ్బరిచెట్లు, ఎత్తయిన పర్వతాలతో కూడిన 700 చదరపు కిలోమీటర్ల ద్వీపం ఇది. హాలియాకలా నేషనల్ పార్క్ ప్రత్యేక ఆకర్షణ. ఇక కామావుల్ స్టేట్ బీచ్‌లో ముఖానికి స్నార్కెల్ పెట్టుకొని సముద్ర గర్భాన్ని చూస్తూ ఈదులాడొచ్చు. బీచ్‌లో సేదదీరుతూ సముద్ర తాబేళ్లను చూస్తూ అవ్యక్తమైన ఆనందానుభూతికి లోనుకావొచ్చు.

**మోనార్క్ బటర్‌ఫ్లై బయోస్ఫియర్ రిజర్వ్, మెక్సికో** ...ఉత్తర అమెరికా దేశం మెక్సికోలో సుమారు 1,40,000 ఎకరాల్లో విస్తరించిన అటవీ ప్రాంతం.. మోనార్క్ బటర్‌ఫ్లై బయోస్ఫియర్ రిజర్వ్. శిశిరం వచ్చిందంటే సరి.. బహుదూరాల నుంచి వలసవచ్చిన కోట్లాది మోనార్క్ జాతి సీతాకోకచిలుకలు ఈ పార్కులో సందడిచేస్తాయి. ఈ వలస కాలంలోనే సీతాకోకచిలుకలు నాలుగు తరాలు పుట్టి మరణిస్తాయట. యునెస్కో వారసత్వ ప్రదేశంగా గుర్తింపు పొందిన ఈ బయోస్ఫియర్ రిజర్వ్ మెక్సికో నగరానికి 100 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.

**తెస్సాలోనికి, గ్రీస్**

గ్రీస్ దేశంలో ఏజియన్ సముద్ర తీరంలో ఉన్న ఈ నగరం పర్యాటక ప్రియులు అత్యధికంగా తరలివచ్చే ప్రదేశాల్లో ఒకటిగా ప్రసిద్ధిచెందింది. క్రీస్తుపూర్వం నాలుగో శతాబ్దంలో 'గ్రీకువీరుడు' అలెగ్జాండర్ ద గ్రేట్ సోదరి





తెస్సాలోనికె పేరుమీదుగా ఆమె భర్త కసాండర్ ఆఫ్ మాసిడోన్ స్థాపించాడు. ప్రాచీన గ్రీకుల కాలపు కట్టడాలు, బైజాంటైన్ సామ్రాజ్యం మొజాయిక్ చిత్రాలు, ఒట్టోమాన్ తురుష్కుల కాలపు కట్టడాలతో ప్రాచీన, మధ్యయుగ, ఆధునిక లక్షణాలతో అలరారుతున్న నగరం తెస్సాలోనికి.

సింగపూర్



ఆసియా ఖండానికి చెందిన నగర దేశం సింగపూర్ నిజంగానే పర్యాటకుల స్వర్గధామం. హిందూ మహాసముద్రం, పసిఫిక్ మహాసముద్రాలను కలిపే మలక్కా జలసంధి ప్రాంతంలో భూమధ్య రేఖ సమీపంలో నెలకొన్న సింగపూర్‌లో మెరీనా బే బీచ్ ఇసుకతిన్నెలు, కళ్లు చెదరగొట్టే ఉద్యానవనాలు, కోలాహలంగా ఉండే ఆర్చర్డ్ రోడ్, మండాయ్ అభయారణ్యంలోని పక్షుల పార్కు, పులావు సెంటోసా ద్వీపాలు, సింగపూర్ నేషనల్ మ్యూజియం, ప్రపంచంలోనే అత్యంత అరుదైన మాంగ్రూవ్ అడవులకు నిలయమైన సుంగేయి బులోహ్ వెట్‌లాండ్ అభయారణ్యం ప్రధాన సందర్శన స్థలాలు.

**జెనీవా, స్విట్జర్లాండ్...** ప్రకృతి అందాల దేశం స్విట్జర్లాండ్‌లో రెండో పెద్ద నగరం జెనీవా. అనేక అంతర్జాతీయ సంస్థలు ఈ నగరం కేంద్రంగా పనిచేస్తున్నాయి. చాక్లెట్లు, గడియారాలకు జెనీవా ప్రసిద్ధి. ఇక్కడ జెట్ డిఈఎయూ ఫౌంటెయిన్, పూల గడియారం ఎల్‌హార్లోగ్ ఫ్లూరీ, సెయింట్ పియర్ కేథడ్రెల్, ప్లేస్ డ్యు బోర్గ్‌డిఫోర్ తదితర ప్రదేశాలు దర్శనీయాలు. ఇక్కడికి 17 కిలోమీటర్ల దూరంలో ఉన్న సీఈఆర్ఎన్ పరిశోధన కేంద్రం

---

## మార్కెట్

### స్మార్ట్ ఏఐ, 4కే వీడియో రికార్డింగ్‌తో ఒప్పో ఎఫ్25 ప్రొ 5జీ లాంచ్..



భారత్ మార్కెట్లో మధ్యశ్రేణి స్మార్ట్‌ఫోన్ల పోర్ట్‌ఫోలియోను విస్తరిస్తున్న ఒప్పో లేటెస్ట్‌గా ఒప్పో ఎఫ్25 ప్రొ 5జీ లాంచ్ చేసింది. 4కే వీడియో రికార్డింగ్, వివిడ్ బోర్డర్‌లెస్ డిస్‌ప్లే, మెరుగైన ఫొటోగ్రఫీ కోసం స్మార్ట్ ఏఐ ఫీచర్స్ వంటి పలు అధునాతన ఫీచర్స్‌తో న్యూ స్మార్ట్‌ఫోన్ కస్టమర్ల ముందుకొచ్చింది పవర్‌ఫుల్ పెర్ఫామెన్స్‌తో స్లిమ్, లైట్‌వెయిట్, డ్యూరబుల్ స్మార్ట్‌ఫోన్‌గా ఈ డివైజ్ ఆకట్టుకుంటుందని కంపెనీ చెబుతోంది. ఇక ఒప్పో ఎఫ్25 ప్రొ 5జీ పవర్‌ఫుల్ మీడియాటెక్ డైమెన్సిటీ 7050 చిప్‌సెట్, 6.7 ఇంచ్ అమోల్డ్ డిస్‌ప్లే, సూపర్‌ఫాస్ట్ 100డబ్ల్యూ చార్జింగ్ సపోర్ట్ వంటి ఫీచర్లను కలిగిఉంది. ఇక ఒప్పో ఎఫ్25 ప్రొ 5జీ ఆండ్రాయిడ్ 14 ఆధారిత కలర్‌ఓఎస్ 14పై రన్ అవుతుంది. మెరుగైన సేఫ్టీ, ప్రైవసీ కోసం అప్‌గ్రేడెడ్ టెక్నాలజీ, యూజర్ ఫ్రెండ్లీ టూల్స్‌తో పాటు ఈ ఓఎస్ స్మార్ట్ ఏఐ ఫీచర్లను కలిగిఉంది. ఇక ఒప్పో ఎఫ్25ప్రొ 5జీ 128జీబీ రూ. 23,999, 256జీబీ రూ. 25,999కి అందుబాటులో ఉంటుంది. మార్చి 5 నుంచి స్టోర్స్‌లో లభించనున్న ఈ డివైజ్ ఒప్పో ఈ-స్టోర్, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌పై అందుబాటులో ఉండనుంది.

# ఏఐతో కొలువుల కోత తప్పదు

### ఇన్ఫోసిస్ ఎగ్జిక్యూటివ్ కీలక వ్యాఖ్యలు




2022 నవంబర్‌లో చాట్‌జీపీటీని ఓపెన్‌ఏఐ లాంఛ్ చేసినప్పటి నుంచి జనరేటివ్ ఏఐ పట్ల టెక్ ప్రపంచంలో హాట్ డిబేట్ సాగుతోంది. ఈ టెక్నాలజీ ప్రజల జీవితాలను మెరుగుపరుస్తుందని, ఉత్పాదకత పెరుగుతుందని కొందరు చెబుతుండగా, న్యూ టెక్నాలజీతో ఉద్యోగాలు కనుమరుగవుతాయని మరికొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక ఇన్ఫోసిస్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ జనరేటివ్ ఏఐ ప్రభావంపై బాంబు పేల్చారు. ఈ టెక్నాలజీతో మనుషులు చేసే ఉద్యోగాలపై వేటు తప్పదని ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐ రాకతో భవిష్యత్‌లో కంపెనీలు తక్కువ సంఖ్యలో ఉద్యోగులను నియమించుకుంటాయని చెప్పారు. జనరేటివ్ ఏఐ వంటి న్యూ టెక్నాలజీస్‌తో రాబోయే రోజుల్లో కంపెనీలకు కొద్దిమంది ఉద్యోగులు సరిపోతారని, ఫలితంగా హైరింగ్ కుచించుకుపోతుందని ఇన్ఫోసిస్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, కో హెడ్ (డెలివరీ) సతీష్ హెచ్‌సీ చెప్పారు. మూడు నుంచి ఐదేండ్లలో క్రమంగా ఈ పరిస్థితి నెలకొంటుందని అన్నారు. జనరేటివ్ ఏఐ వంటి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీస్‌ను వినియోగించడం ప్రారంభిస్తుండటంతో అవి మరింత మెరుగైన సంస్థలుగా ఎదుగుతాయని, ఫలితంగా సంప్రదాయ ఉద్యోగాల అవసరం వాటికి ఏమాత్రం ఉండదని స్పష్టం చేశారు. ఏఐతో కొలువుల కోత తప్పదనే ఆందోళన నడుమ స్వీడిష్ ఫిన్‌టెక్ కంపెనీ క్లార్నా 700 మంది ఉద్యోగులను తొలగించింది. ఏఐతో ఈ ఉద్యోగాలను రీప్లేస్ చేశామని కంపెనీ వెల్లడించింది.

## లేఆఫ్స్ ప్రకటించిన గేమింగ్ కంపెనీ



అతిపెద్ద గేమింగ్ కంపెనీల్లో ఒకటైన ఎలక్ట్రానిక్ ఆర్ట్స్ లేఆఫ్స్ ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా తమ ఉద్యోగుల్లో 5 శాతం మందిని తొలగిస్తున్నట్టు ఈఏ వెల్లడించింది. ప్రభావిత ఉద్యోగులకు ఇప్పటికే ఈమెయిల్స్‌లో సమాచారం అందించారు. ఈఏకు ప్రపంచవ్యాప్తంగా 13,400 మంది ఉద్యోగులుండగా, వారిలో 600 మందికి పైగా కొలువులను కోల్పోనున్నారు. బ్లాగ్ పోస్ట్‌లో కంపెనీ లేఆఫ్స్ సమాచారం వెల్లడించింది. ఉద్యోగులకు కంపెనీ సీఈవో ఆండ్రూ విల్సన్ పంపిన ఈమెయిల్‌ను బ్లాగ్ పోస్ట్ షేర్ చేసింది. వ్యాపార ప్రయోజనాల కోసం కంపెనీ పలు మార్పులు చేపడుతున్నదని, ఈ మార్పుల్లో భాగంగా పలు గేమ్స్‌ను రద్దు చేయడంతో పాటు కంపెనీలో 5 శాతం ఉద్యోగులను తొలగించనున్నట్టు ఈ మెయిల్‌లో సీఈవో స్పష్టం చేశారు. కంపెనీకి విశేషమైన సేవలందించిన పలువురు ఉద్యోగులకు ఈ సంక్లిష్ట నిర్ణయం బాధాకరమని, కంపెనీ చేపట్టిన మార్పుల్లో ఇది అత్యంత సంక్లిష్ట నిర్ణయమని వివరించారు. కాగా, వచ్చే త్రైమాసికం నాటికి లేఆఫ్స్ పూర్తవుతాయని, బాధిత ఉద్యోగులకు కంపెనీ బాసటగా నిలుస్తుందని, వారికి మరోచోట అవకాశం దక్కేలా సహకరిస్తుందని కంపెనీ పేర్కొంది.

## వర్క్ ఫ్రం హోంకు స్వస్తి..

### ఉద్యోగులు ఆఫీస్‌కు రావాల్సిందేనంటున్న కాగ్నిజెంట్




టీసీఎస్ బాటలోనే కాగ్నిజెంట్ పయనించింది. వర్క్ ఫ్రం హోంకు స్వస్తి పలుకుతున్నట్లు, ఇక నుంచి వారానికి మూడు రోజులు ఆఫీస్‌కు రావాల్సిందేనని ఉద్యోగులకు ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు సంబంధించి ఉద్యోగులకు ఈ-మెయిల్ ద్వారా సమాచారం అందించారు కంపెనీ సీఈవో రవి కుమార్. అమెరికా ప్రధాన కేంద్రంగా ఐటీ సేవలు అందిస్తున్న కాగ్నిజెంట్‌కు..భారత్‌లోనే అతిపెద్ద కార్యాలయాలు, ఉద్యోగులు కలిగివున్నది. వారానికి మూడు రోజులు ఆఫీస్‌కు రావాలని తెలిపింది. కంపెనీకి భారత్‌లో 2.45 లక్షల మంది ఉద్యోగులు ఉన్నారు.

## పట్టణాన్ని పట్టి పీడిస్తున్న తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

- మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు
- ఎమ్మెల్యే సహకారంతో పట్టణాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యం
- మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ గా బాధ్యతలు స్వీకరించిన గాజుల లక్ష్మి రాజమల్లు



**సుల్తానాబాద్, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్):** సుల్తానాబాద్ మున్సిపల్ పట్టణాన్నిపట్టిపీడిస్తున్న త్రాగునీటి సమస్య,శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు ధీమా వ్యక్తం చేశారు.ఈ మేరకు గురువారం మండల కేంద్రంలోని మున్సిపల్ కార్యా లయంలో చైర్ పర్సన్ గా పదవి బాధ్యతలు చే పట్టారు.ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడు తూ తనపై నమ్మకంతో కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఎ న్నుకున్నందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపు తు న్నానని అన్నారు.అలాగే పట్టణాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యమని,ప్రజలకు మెరుగైన సౌక ర్యాలను కల్పించేందుకు కృషి చేస్తానని,ము ఖ్యంగా వేసవికాలం పట్టణాన్ని పట్టిపీడిస్తున్న త్రాగునీటి సమస్య పెద్దపల్లి ఎమ్మెల్యే చింత కుం ట విజయ రమణారావు దృష్టికి తీసుకెళ్లి శాశ్వ త పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఎమ్మె ల్యే సహకారంతో పట్టణాన్ని సుందరంగా తీర్చిది ద్దుతనాని తెలియ జేశారు. చైర్ పర్సన్ తో పా టు వైస్ చైర్ పర్సన్ సమతా కృష్ణ,దున్నపోతు ల రాజయ్య,గాజుల హరీష్ తదితరులు ఉన్నా రు.

## సహకార సంఘాన్ని సందర్శించిన మిజోరం స్టేట్ అపెక్స్ బ్యాంకు అధికారుల బృందం



**సుల్తానాబాద్, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్):** సుల్తానాబాద్ ప్రాథమిక వ్యవ సాయ సహకార సంఘాన్ని మిజోరం స్టేట్ అపెక్స్ బ్యాంకు అధికా రుల బృందం గురువారం సందర్శించారు. ఈ మేరకు మండల కేంద్రంలోని సహకార సంఘాన్ని మిజోరం స్టేట్ అపెక్స్ అధికార ప్రతినిధుల బృం దం సందర్శించి బ్యాంకు లావాదేవీలు, రైతుల రుణాలు,దీర్ఘకాలిక రుణాల మంజూరు,రికవరీ చేయుట గురించి అడిగి తెలుసుకున్నారు. అలా గే బ్యాంకు లావాదేవీలకు లాకర్ ఉప యోగాన్ని, రోజు వారి కార్యక్రమాలను సంఘము ఆడిట్ వి ధానం బాగుందన్నారు.అనంతరం సంఘం నిర్వ హిస్తున్న ఐ ఎస్ ఐ వాటర్ ప్లాంట్,సూపర్ మా ర్కెట్ ను సందర్శించి,సంఘాసేవలను సంతృప్తి గా ఉన్నాయని కొనియాడారు.సహకార సంఘా న్ని అభివృద్ధి పదంలో నడిపిస్తున్న చైర్మన్,పాల క వర్గసభ్యులని,సీఈవో,సంఘ సిబ్బందికి అభి నందనలు తెలపినారు.ఈ కార్యక్రమం లో పిఏసి ఎస్ చైర్మన్ శ్రీగిరి శ్రీని వాస్ తో పాటుడైరెక్టర్ పో చమల్లమ్మ,డెవలప్మెంట్అధికారిసత్యనారాయ ణరావు,బ్యాంకు జి ఎం ప్రభాకర్ రెడ్డి,సూప ర్వైజర్ సాగర్ రెడ్డి, సీ ఈ వో బూరుగు సంతో ష్,పి శ్యామ్ సుందర్,ఆరెపల్లిరాజు సంఘ సి బ్బంది పాల్గొన్నారు.

## గ్రామ ప్రజలు అందరూ సమన్యాయంతో కలిసి ఉండాలి



**సుల్తానాబాద్, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్):** గ్రామ ప్రజలందరూ సమన్యాయంతో కలిసి ఉం డాలని తహసిల్దార్ మధుసూదన్ రెడ్డి పిలుపు నిచ్చారు.ఈ మేరకు గురువారం మండలంలోని భూపతిపూర్ గ్రామంలో పౌరహక్కుల దినోత్స వం ఘనంగా నిర్వహించారు.పౌర హక్కులు ప్ర జాస్వామ్యంలో ముఖ్యమైన భాగం అని, పౌర హక్కుల దినోత్సవంలో భాగంగా గ్రామంలో ప్రజ లు అధిక సంఖ్యలో పాల్గొని,ముఖ్యంగా దళితు లు ఇతర కులాల వారు అందరూ కలసి మెలిసి ఉండ వలెనని,రెండు క్లాసుల వ్యవస్థను రూపి మాపి దేవాలయంలో అందరికి ప్రవేశం కల్పిస్తూ కుల వ్యవస్థ లేకుండా అందరూ సమన్వయంతో కలిసి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమం లో తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి తో పాటు, ఎంపిడివో,ఆర్ ఐ స్వాతి, మాజీ సర్పంచులు తి రుపతి, పోచమల్లు, పంచాయతీ సెక్రెటరీ,మం డల అంబేద్కర్ సంఘ నాయకులు సుంక వెంక టేష్, జిల్లా నాయకులు సంకనపల్లి లక్ష్మయ్య తోపాటు పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు తదిత రులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధికి సహకరించండి

### -మాజీ సర్పంచ్ హర్షణ పెల్లి మల్లీశ్వరి శ్రీనివాస్



**గోదావరిఖని ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్ ):** లింగాపూర్ గ్రామంలో ని అభివృద్ధి పనులను సింగరేణి మేనేజర్ మల్లికార్జున కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. గ్రామంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు లింగాపూర్ గ్రామంలో ఇందిరమ్మ కాలనీ మరియు స్మశాన వాటికలో ఎల్ఈడి సోలార్ విధి లైట్లు ఏర్పాటు లింగాపూర్ గ్రామం నుండి ఇందిరమ్మ కాలనీ వరకు 1కి.మీ సీసీ రోడ్డు మరియు ఆర్ ఓ ప్లాంట్ పనులను గ్రామ అభివృద్ధికి సకరించాలని గ్రామ మాజీ సర్పంచ్ అర్షనపల్లి మల్లీశ్వరి శ్రీనివాస్ కోరారు. మేనేజర్ మాట్లాడుతూ వెంటనే జిఎం కి తెలియజెసి మీ గ్రామ అభివృద్ధికి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

## ఆర్జీ-3 ఏ.పి.ఏ ఏరియాల్లో పర్యటించిన సిఎండి బలరాం నాయక్



**రామగిరి (పెద్దపల్లి జిల్లా) ఫిబ్రవరి 29 నినాదం న్యూస్:** అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్ట్ గనిలో 3-సీమ్ పంచ్ ఎంట్రీలను, ఓ.సి.పి -2 నందు కోల్ సైజర్స్ ను ప్రారంభిం చారు. సింగరేణి సంస్థలో నూతన టెక్నాలజీ గల యంత్రాలను ఉపయో గించి సంస్థ నిర్దేశించుకున్న బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించుకోవాలని చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బలరామ్ అన్నారు.గురువారం ఆయన ఆర్జీ-3 , ఏ.పి.ఏ ఏరియాలో జరిగిన కార్యక్రమాల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఓ.సి. పి-2 ఉపరితల గని నందు 24 కోట్ల తో కొనుగోలు చేసి, అమర్చిన రెండు ప్రైమరీ కోల్ సైజర్స్ యంత్రాలను ప్రారంభించారు. అలాగే ఏ.ఎల్. పి గని 3 సీమ్ డెవలప్మెంట్ కోసం పంచ్ ఎంట్రీల పనులకు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థలో అతిపెద్ద భూగర్భగని అయినటువంటి అడ్రియాల లాంగ్ వాల్, ఉపరితల గనులలో అత్యుత్తమ టెక్నాలజీ గల ఆర్ జి ఓసి -2 గనులలో నూతన టెక్నాలజీ గల యంత్రాలను ఇస్తున్నామని, ఇలాంటి అత్యుత్తమ టెక్నాలజీ లను వినియో గించి నిర్దేశించుకున్న బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను భద్రతతో సాధించుకోవాలన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్లో

# భవన నిర్మాణ కార్మికులకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలి!

- ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్లో భవన నిర్మాణ కార్మికులకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలి!



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ ప్రతినిధి ఫిబ్రవరి 29 ( నినాదం న్యూస్):** ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలలో భవన నిర్మాణ కార్మికులకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని గురువారం రోజున జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డిఆర్ఓ లోకేశ్వరరావుకు ఐఎన్టియుసి అనుబంధ సంఘం తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ సంఘం ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి భోగే ఉపేందర్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు, పెట్టుబడిదారులకు, సంపన్న వర్గాలకు దేశ సంపదను దోచిపెడుతుందన్నారు. ప్రధాని మోడీ కార్మిక వర్గం పక్షాన లేదని, కార్పొరేట్ల పక్షాన ఉన్నాడని విమర్శించారు. కార్మిక చట్టాలను పరిశ్రమల అధిపతులకు అనుకూలంగా మార్చి కార్మికుల హక్కులను అణిచివేస్తున్నాడని ఆరోపించారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న అమలు చేస్తున్న కార్మిక తిరోగమన విధానాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ప్రస్తుతం భవన నిర్మాణంలో ప్రభుత్వానికి చెల్లిస్తున్న ఒక శాతం సెస్సును రెండు శాతం కు పెంచాలని కోరారు. 60 ఏళ్ల పైబడిన భవన నిర్మాణ కార్మికులకు నెలకు రూపాయలు ఆరువేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర కార్మిక సంఘాల ప్రతినిధులను రాష్ట్రస్థాయి సలహా బోర్డులో సభ్యులుగా నియమించాలని కోరారు. గతంలో పెండింగ్ లో ఉన్న పెన్షన్లను బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. పాండిచ్చేరి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న తరహాలోని తెలంగాణ ప్రభుత్వం దసరా కనుక మూడు వేల రూపాయలు ప్రతి భవన నిర్మాణ కార్మికుని ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల అడ్డాల వద్ద అన్ని సౌకర్యాలు, ప్రధానంగా షెల్టర్లు ,మంచి నీటి సౌకర్యం కల్పించాలని కోరారు.ప్రమాదంలో మరణిస్తే 10 లక్షలు,సహజ మరణం 5 లక్షలు ఇవ్వాలన్నారు.పెండ్లి కానుక 01లక్ష కు పెంచాలని,పిల్లల చదువులకు స్కాలర్ షిప్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.అర్హులైన కార్మికులకు డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇవ్వలని,నూతన రేషన్ కార్డులు ఇవ్వాలన్నారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లలో భవన నిర్మాణ కార్మికులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు.శ్రమను నమ్ముకొని ఆకాశ హర్మ్యాలు నిర్మిస్తున్న,కార్మికుల బ్రతుకులో మాత్రం అభివృధి,మార్పు లేదని అన్నారు.కార్మిక,వ్యవసాయ వ్యతిరేక చట్టాలు అమలు చేస్తున్న కేంద్రంలోని మోడీ ప్రభుత్వంకు అన్ని రంగాల కార్మికులు తమ ఓటును వ్యతిరేకంగా వేసి ఓడించడానికి ప్రయత్నం చేయాలని పిలపునిచ్చారు. ఈ కార్యక్రమం లో జిల్లా అధ్యక్షుడు దివాకర్,ఉపాధ్యక్షుడు శంకర్,చిరంజీవి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆకాశమే హద్దుగా ఎదగాలి! : డీఈవో అశోక్



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ ప్రతినిధి ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్):** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో గురువారం రోజున నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎంపవర్మెంట్ ఆఫ్ పర్సన్ విత్ డిసేబులిటీస్, సికింద్రాబాద్. వారి ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు విద్యార్థులకు బోధనా సామాగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా విద్యాశాఖ అధికారి పార్సి అశోక్ మాట్లాడుతూ, బోధన అభ్యాసన సామాగ్రిని ఏ విధంగా వినియోగించుకోవాలో విలీన విద్య రిసోర్స్ పర్సన్లు శిక్షణ ఇస్తారని తెలిపారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలు వాటిని వినియోగించుకొని అందరితో సమానంగా ఆకాశమే హద్దుగా ఎదగాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ప్రతినిధి శ్యామ్ ఈ కిట్లను జిల్లా విద్య శాఖ అధికారి అశోక్ కు అందజేశారు. ఈ ప్రత్యేక కిట్లు ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు అందించారు. ఒక్కో కిట్టు విలువ సుమారుగా 10 వేల రూపాయలు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీలీన విద్య కోఆర్డినేటర్లు కటకం మధుకర్ ఆభిద్ ఆ ఉపాధ్యాయులు ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు శారీరక మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయి! : ఎస్పి సురేష్‌కుమార్



**కొమరం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్):** గురువారం రోజున కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్ పోలీసు సాయుధ బలగాల వాలీబాల్ టోర్నమెంట్లు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ సురేష్ కుమార్ హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని అన్నారు. పోలీసులు శాంతి భద్రతల పరిరక్షణలో నిత్యం బిజీగా ఉన్నప్పటికీ, క్రీడలలో పాల్గొనడం వలన నూతన ఉత్సవం పెంచేందుకు ఇటువంటి టోర్నమెంట్లు దోహదపడతాయన్నారు. పోలీసులు విధుల్లో ఒత్తిడిని నుంచి బయటపడడానికి శారీ రక ,మానసిక ధృఢత్వాన్ని కాపాడుకోవడానికి క్రీడలు తోడ్పడతాయన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమన్నారు.గెలుపు,ఓటమిల కంటే జట్టు సహకారం ముఖ్యమని అన్నారు.క్రీడలు మనలో దాగిఉన్న శక్తి సామర్థ్యాలను ,పోరాట పటిమను వెలికి తీయడానికి దోహదం చేస్తాయి అని తెలిపారు.పోలీసులు ఒత్తిడి అలసట లోనవకుండ,శారీరక,మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడానికి ఇటువంటి క్రీడలు ఉపయోగపడుతుందన్నారు.పోలీసులు వ్యాయమాన్ని నిత్య జీవితంలో భాగం చేసుకోవాలి అని తెలిపారు.క్రీడలు మనలోని నాయకత్వ లక్షణాలను తట్టి లేపడంతో పాటు టీం స్పిరిట్ , ఐక్యమత్యాన్ని పెంచుతాయని తెలిపారు.క్రీడలు మనలోని మానసిక స్థైర్యాన్ని ,ఆత్మ విశ్వాసాన్ని పెంచుతయన్నారు. ఈ కార్యక్రమంలో టాస్క్ ఫోర్స్ సిఐ రాణా ప్రతాప్,అర్ ఐ పెద్దన్న ,ఆసిఫాబాద్ సిఐ సతీష్,పోలీస్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## శివ మల్లన్న స్వామి ఉత్సవ కమిటీ ఎన్నిక



**సిర్పూర్, ఫిబ్రవరి 29(నినాదం న్యూస్):** సిర్పూర్ నియోజకవర్గం కాగజ్నగర్ మండలం ఈస్గం శివ మల్లన్న స్వామి జాతర ఉత్సవ కమిటీని దేవదాయ శాఖ మంత్రివర్యులు కొండ సురేఖ మరియు జిల్లా ఇన్చార్జి మంత్రి దనసరి అనసూయ (సీతక్క) ఆదేశాల మేరకు సిర్పూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి రావి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం ఎన్నుకున్నారు. చైర్మన్ గా మైలారపు మురళీధర్, కమిటీ సభ్యులుగా ఎమ్మాజీ శారద, హరి ప్రసాద్ సోని, శృంగారపు ప్రసాద్, జెరుపుల తిరుపతి, రంటెంకి సత్తయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక శివ మల్లన్న స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఆలయ ఈవో ఆధ్వర్యంలో నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

## అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



**సిర్పూర్, ఫిబ్రవరి 29(నినాదం న్యూస్):** సిర్పూర్ నియోజకవర్గం కగజ్ నగర్ మండలంలోని ఇస్గాం పోలీస్ స్టేషన్ పరిధిలో మండువా గ్రామానికి చెందిన కమ్మరి రోజా 25 అనుమానస్పద స్థితిలో మృతి చెందింది. కాగజ్ నగర్ రూరల్ సిఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం ... మండువ గ్రామానికి చెందిన గణపతి కమల దంపతుల కూతురు రోజాకు ఐదేళ్ల క్రితం వివాహం అయింది. మూడేళ్ల కిందట కుటుంబ కలహాలతో రోజాకు భర్తతో విడాకులు అయ్యాయి. అప్పటినుంచి రోజా తల్లిదండ్రుల వద్దనే ఉంటూ జీవనం సాగిస్తుంది. బుధవారం సాయంత్రం తల్లిదండ్రులు బంధువుల ఇంటికి వెళ్లి రాత్రి తిరిగి వచ్చేసరికి రోజా ఇంటిలో కనిపించలేదు. దీంతో కుటుంబీకులు రాత్రంతా వెతికారు. చివరకు గురువారం తెల్లవారుజామున ఇంటి సమీపంలోని పెరట్లో ఉన్న పొదల్లో రోజా మృతదేహాన్ని గుర్తించారు. మృతదేహంపై గొంతు నులిమినట్లు ఆనవాలు కనిపించడంతో కుటుంబీకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతురాలి తల్లి కమల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సిఐ నాగరాజు తెలిపారు.

## పాఠశాలను బార్‌గా మార్చిన ఉపాధ్యాయుడు



**మంచిర్యాల ప్రతినిధి ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్):** బెల్లంపల్లి మండలం చర్లపల్లి ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలో ఉపాధ్యాయుడు గురువారం మద్యం సేవించడం క్షమించరాని నేరం అని పలు విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.పాఠశాలలోనే మద్యం సేవిస్తున్న ఉపాధ్యాయుడిని స్థానికులు ప్రశ్నిస్తే ఏమీ లేదు అని తప్పించుకోవడానికి ప్రయత్నించడం గమనార్హం.పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలో ఉంటు విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన సమయంలో పాఠశాల ఆవరణలోనే మద్యం సేవించడం దారుణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం భావిభారత పౌరులను తీర్చిదిద్దాలని ఉపాధ్యాయ ఉద్యోగాన్ని ఇస్తే టైం పాస్ చేయడానికి పాఠశాలకు వచ్చి మద్యం సేవించడానికి ఉద్యమం చేస్తున్న రీతిగా వ్యవహరించిన అతని తీరుపై గ్రామ ప్రజలు మండిపడ్డారు.ఉద్యోగాలు లేక ఎంతోమంది డిఎస్సీ ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తున్నారని,అలాంటి వారికి ఉద్యోగం లేక ఎన్నో ఆశలు పడుతుంటే ప్రభుత్వ ఉద్యోగంలో ఉంటూ ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించే ఉపాధ్యా యులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.బెల్లంపల్లి మండల విద్యాశాఖాధికారి ఆ ఉపాధ్యాయునిపై వెంటనే శాఖాప రమైన చర్యలు తీసుకోవాలని,లేని పక్షంలో మండలం విద్యాధికారి కార్యాలయం ముట్టడిస్తామని విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు.

## మున్సిపల్ చైర్ పర్సన్‌కు ఘన సన్మానం

### -మండల రజక సంఘం అధ్యక్షుడు నిట్టూరి శ్రీనివాస్



**సుల్తానాబాద్, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్):** సుల్తానాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్గా ఎన్నికైన సందర్భంగా గాజుల లక్ష్మి రాజమల్లును మండ ల రజక సంఘం ఆధ్వర్యంలో మర్యాద పూర్వ కంగా తన నివాసంలో కలిసి పూల బొకే అంద జేసి, ఘనంగా శాలువాతో సన్మానించి శుభాకాం క్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రజక సం ఘం మండల అధ్యక్షుడు తో పాటు పట్టణ అ ధ్యక్షుడు మైసయ్య గౌరవ సభ్యులు నిట్టూరు ఆనంద్, దీపక్, రాజేశం, తోటపల్లి సంతోష్,మైలా రం మధునయ్య,నిట్టూరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ముప్పిరితోటలో సివిల్ రైట్స్ డే



**పెద్దపల్లి, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్):** అంటరానితనాన్ని రూపుమాపణమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతి గ్రామంలో పౌరహక్కుల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. ఆ కార్యక్రమంలో భాగంగా ఎలిగేడు మండలం ముప్పిరితోట గ్రామంలో గురువారం పౌర హక్కుల దినోత్సవాన్ని ఎస్సీ కాలనీలోని కమ్యూనిటీ హాల్ లో జరిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసిల్దార్ కిరణ్ మాట్లాడుతూ రాజ్యాంగం ప్రకారం పౌరులందరికీ సమాన హక్కులు ఉన్నాయని వ్యక్తులను కించపరిచే విధంగా అంటరానితనాన్ని ఎవరు ప్రదర్శించవద్దని అది చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విలేజ్ స్పెషల్ ఆఫీసర్ ఎంపీఓ అనిల్ రెడ్డి, ఏ ఎస్ ఐ భాస్కర్, హెచ్ డబ్ల్యు ఓ శ్రీనివాస్, గిర్ధవర్ శైలజ, పంచాయతీ కార్యదర్శి హైమద్, గ్రామ అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు జల్లి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాస తరగతులు




**సుల్తానాబాద్, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్):** లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాస తర గతులు నిర్వహించారు.ఈమేరకు గురువారం మండల కేంద్రం లోని ఇండియన్ పబ్లిక్ స్కూల్ లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పదవ తరగతి విద్యార్థులకు జిల్లా 320జి అదనపు కార్యదర్శి, రిటైర్డ్ ప్రిన్సిపల్ లయన్ డాక్టర్ బుర్ర మధుసూ దన్ రెడ్డి చే వ్యక్తిత్వ వికాస తరగతులు రాబో యే పదవ తరగతి పరీక్షలలో విద్యార్థిని,విద్యా ర్థులు తీసుకునే మెలకువల గురించి అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా మంచి మెరిట్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు త నవంతు ప్రోత్సాహకరంగా నగదు పారితోషికం అందజేస్తానని లయన్ వలస నీలయ్య తెలిపా రు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు నోముల శ్రీనివాస్ రెడ్డి, జిల్లా అదనపు కార్యదర్శి వలస నీలయ్య,జిల్లా కోఆర్డినేటర్ మాటేటి శ్రీనివాస్, స భ్యులు తమ్మనవేని సతీష్,పూసాలసాంబమూ ర్తి, పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, డై రెక్టర్ క్రిష్ణప్రియ ఉపాధ్యాయ బృందంతో పాటు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**సిర్పూర్, ఫిబ్రవరి 29(నినాదం న్యూస్):** సిర్పూర్ నియోజకవర్గంలో మార్చి నెల 3న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని లోనవెల్లీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ నవత అన్నారు. ఆమె మాట్లాడుతు సిర్పూర్ టి మండలంలో వచ్చే నెల 3నుంచి 5 వరకు నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలో నియోజకవర్గంలోని 0నుంచి 5 సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలన్నారు.

### గ్రామ పంచాయితీ కార్మికుల
# పెండింగ్ జీతాలు చెల్లించాలి
### కార్మికుల ఆధ్వర్యంలో కరీంనగర్ కలెక్టరేట్ వద్ద ధర్నా



**కరీంనగర్, ఫిబ్రవరి 29(నినాదం న్యూస్):** కరీంనగర్ జిల్లా యూనియన్ కమిటీ పిలుపుమేరకు జిల్లాలోని వివిధ గ్రామాల నుండి కార్మికులు కలెక్టరేట్ వద్దకు చేరుకొని ధర్నా నిర్వహించి అనంతరం జిల్లా పరిపాలన అధికారి సుధాకర్ రావు కి, వినతిపత్రం అందజేయడం జరిగినది. ధర్నా కార్యక్రమం అనంతరం విలేకరులతో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పుల శంకర్ మాట్లాడుతూ, ప్రభుత్వాలు మారిన పంచాయతీ కార్మికుల బ్రతుకులు మాత్రం మారడం లేదని, జిల్లాలో వివిధ గ్రామపంచాయతీలలో రెండు నెలల నుండి 10 నెలల వరకు ఒక్కో గ్రామపంచాయతీలో జీతాలు బకాయి ఉండడం వలన కార్మికుల కుటుంబాలు పోషించుకోవడం దుర్భర పరిస్థితుల్లో ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే జిల్లా కలెక్టర్ గారు స్పందించి పెండింగ్ జీతాలను చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని, ఆయన కోరారు. కార్మికులపై వేధింపులు అక్రమ తొలగింపులు అరికట్టాలని, జీవో నెంబర్ 51 ప్రకారం 9500 వేతణలు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ ఇప్పటికీ కొన్ని గ్రామపంచాయతీ లలో కార్మికులకు తక్కువ వేతనాలు ఇస్తూ శ్రమదోపిడి గురి చేస్తున్నారని , కార్మికులకు ఇవ్వవలసిన కనీస భద్రత పరికరాలు, చేతులకు గ్లౌజులు, కాళ్ళకి బూట్లు, రెండు జతల బట్టలు, సబ్బులు, కొబ్బరి నూనె, తదితర పరికరాలు ఇవ్వాలని జీవోలు వచ్చినప్పటికీ వాటిని అమలు చేయడంలో మండల స్థాయి అధికారులు వైఫల్యం చెందారని, ఉద్యోగ భద్రత ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, పీఎఫ్ ఈఎస్ఐ, సదుపాయాలు కల్పించాలని, డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు రాచర్ల మల్లేశం, ఉపాధ్యక్షులు కాశిపాక శంకర్ , జిల్లా కోశాధికారి ఎండీగా రవీందర్రావు, కమిటీ సభ్యులు కందె సదయ్య, వడ్లూరి లక్ష్మీనారాయణ మహంకాళి కొమురయ్య, సారయ్య , మధు నక్క, శనిగర కొమురయ్య, తదితర కార్మికులు పాల్గొన్నారు

### తెలంగాణలో సాగవుతున్న పసుపు
# ప్రపంచ దేశాలకు ఎగుమతి అవుతోంది
- రైతులకు ఆర్థిక చేయూతనిచ్చి వారిని బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది
- నిజామాబాద్‌లో విజయసంకల్ప ముగింపు సభలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

**నిజామాబాద్ ప్రతినిధి, ఫిబ్రవరి 29 (నినాదం న్యూస్) :** తెలంగాణలో సాగవుతున్న పసుపు ప్రపంచ దేశాలకు ఎగుమతి అవుతోందని, రైతులకు ఆర్థిక చేయూతనిచ్చి వారిని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. గురువారం నిజామాబాద్ జిల్లాలో జరుగుతన్న నిజామాబాద్ జిల్లా బీజేపీ విజయ సంకల్ప యాత్ర ముగింపు సభకు కేంద్ర రవాణా శాఖ మంత్ర నితిన్ గడ్కారి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో దేశంలోని అనేక గ్రామాలు అద్వాన్నంగా తయారయ్యాయి అన్నారు. రోడ్లు, తాగు నీరు సౌకర్యాలు లేక ప్రజలు అవస్థలు పడ్డారు అని అవేధన వ్యక్తం చేశారు. సర్కారు ఆసుపత్రులు అందుబాటులో లేక అనేక గ్రామాలు ఖాళీ అయ్యాయి అనాటి దుస్థితి మళ్లి రావద్దని అన్నారు. దేశంలో అన్ని గ్రామాలలో రోడ్ల నిర్మాణాల కోసం ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన అందుబాటులోకి తెచ్చామని అన్నారు. దాని వలననే దేశంలోని అన్ని గ్రామాలకు మొదలుకోని పట్టణాలకు కనేక్టివిటి పేరిగిందని అన్నారు. గ్రామాలలో రోడ్లన్ని గ్రామీణ సడక్ యోజన పథకం కు సంబంధించినవి అని అన్నారు. రైతులు పండించే పంటలతో దేశం సుభిక్షంగా ఉందని కాని రైతుల అత్మహత్యలు జరుగడం బాధకరం అన్నారు. రైతులకు ఆర్థిక చేయూతనిచ్చి వారిని బలోపేతం చేయాల్సిన అవసరం ఉంద న్నారు. రైతుల ఆత్మహత్యలు ఆగాలి అని విమానాలకు ఇంధనం అందించే సత్తా మన రైతుల్లో ఉందని తెలిపారు. దేశంలో 2 లక్షల కోట్లతో రోడ్లు ఎక్స్ ప్రెస్ హైవే నిర్మాణాలు చేపట్టాం అన్నారు. రవాణా సౌకర్యాలు మెరుగుపడినప్పుడే వ్యాపార,వాణిజ్య రంగాలు టూరిజం అబివృద్ధి చెందుతోందని అన్నారు. దేశ ముఖ చిత్రాన్ని మార్చే సత్తా బీజేపీ తోనే సాధ్యం అన్నారు. రాబోయే కాలంలో తెలంగాణలోనూ ప్రభుత్వం ఏర్పాటు చేస్తాం అన్నారు. కాంగ్రెస్.. బీఆర్ఎస్ పాలనలో అవినీతి అక్రమాలు తప్ప ప్రజా సంక్షేమం కనిపించడం లేదు అని తెలిపారు. మూడవసారి మోడి ప్రధానిగా అశీర్వదించి గెలిపించాలని కోరారు. నిజామాబాద్ పార్లమెంట్ క్షేత్రంలో గతంలో జరిగిన ప్రస్తుతం జరిగిన అబివృద్ధి పరిగణలోకి తీసుకుని బిజేపిని గెలిపించాలని అన్నారు. నిజామాబాద్ జిల్లా మీదుగా 63 వ జాతీయ రహదారికి గ్రీన్ కారిడార్ కు నిధులు ఇచ్చిన విషయాన్ని కేంద్రమంత్రి గుర్తు చేశారు.

**పసుపు బోర్డు కల ప్రధాని మోడీ ద్వారా నెరవేరింది**
**- ఎంపి అర్వింద్**



పసుపు రైతుల మూడు దశాబ్ధాల పసుపు బోర్డు కళను ప్రధాని నరేంద్ర మోడిద్వార నేరవేరిందని నిజామాబాద్ ఎంపి ధర్మపూరి అరవింద్ అన్నారు. పసుపు పంట విస్థరించిన 15 ఏళ్లుగా పడిపో యిన పసుపు ధర ఇపుడు పరుగులు పెడుతోంది అన్నారు. నిజామాబాద్ వ్యవసాయ మార్కేట్ లో పసుపు ధర 14 వేలు దాటింది అన్నారు. బోధన్ షుగర్ ఫ్యాక్టరీ ని కాంగ్రెస్ బీఆర్ ఎస్ లు నిర్వీర్యం చేశాయన్నారు. ఈ రెండు పార్టీ లు చెరకు రైతులను మోసం చేశాయని అన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో రైతుల ను మోసం చేసేందుకు ఎన్నికల కోసం మళ్ళీ కాంగ్రెస్ కమిటీ వేసింది అని ఎంపి అరవింద్ ఆరోపించారు. మరోసారి మోడి ప్రధాని కానున్నారని బిజేపి గెలువడం ద్వార జిల్లా రుపు రేఖలు మారుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు దినేష్ కులా చారీ, ఎమ్మెల్యేలు దన్ పాల్ సూర్యానారాయణ, పైడి రాకేష్ రెడ్డి, నాయకులు పల్లె గంగారెడ్డి, కార్పొరేటర్లు స్రవంతి రెడ్డి, లతో పాటు నాయకులు కార్యకర్తలు పాల్గోన్నారు.

# ఇద్దరు అంతర్ రాష్ట్ర దొంగల అరెస్టు
- 2.77లక్షల చోరీ సొత్తు, కారు స్వాదీనం, రిమాండ్
- మిర్యాలగూడ డి.ఎస్.పి రాజశేఖర్ రాజు



**మిర్యాలగూడ, ఫిబ్రవరి 29, (నినాదం న్యూస్):** నిలిపి ఉన్న వాహనాలే లక్ష్యంగా అద్దాలు పగల గొట్టినగదును దొంగలిస్తున్న ఇద్దరు అంతరాష్ట్ర దోపిడీ దొంగలను అరెస్టు చేసి రిమాండ్ కు తరలిం చినట్లు గురువారం మిర్యాలగూడ డి.ఎస్.పి కే.రాజశేఖర్ రాజు తెలిపారు. జిల్లా కేంద్రం లోని పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నిందితుల వివరాలను మీడియాకు వెల్లడించారు. ఆయ న కథనం మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు జిల్లా బోగోల్ మండలం కప్రాలతిప్ప గ్రామానికి చెందిన కేబుల్ టీవీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న పిట్ల మహేష్, సుతారి పని చేసే ఆవుల రాకేష్ లు స్నేహి తులు, ఈజీగా డబ్బులు సంపాదించేందుకు దొంగతనాలను అలవాటు చేసుకున్నారు. ఈ క్రమంలో జనవరి 30వ తారీఖు నాడుపెద్దవూర మండలం చిన్న గూడెం గ్రామానికి చెందిన రావుల శంకర్ అనే వ్యక్తి తన టాటా ఏస్ వాహనంలో కొన్ని గొర్రెపిల్లలను తీసుకువచ్చి మిర్యాలగూడ మండలం అవంతిపురం సంతలో విక్రయించగా వచ్చిన నగదు 97 వేల రూపాయలను వాహనం క్యాబిన్ లో ఉంచి తిరుగు ప్రయాణంలో మిర్యాలగూడ పట్టణంలోని ఎఫ్ సి ఐ వద్ద వాహనం నిలిపి సమీపంలోని హోటల్లో భోజనం చేసి వచ్చేసరికి గుర్తుతెలియని దుండగులు డోర్ అద్దాలు పగలగొట్టి నగదును అపహరించుకుపోయారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టిన రూరల్ పోలీసులు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో గురువారం రూరల్ పోలీసులు బాధలాపురం గ్రామం వద్ద కోదాడ- జడ్చర్ల హైవే పై వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎర్టిగా కారులో ఇరువురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతోపాటు, వాహనంలో అద్దాలను పగలగొట్టేందుకు వాడే సామాగ్రి, నగదు కనిపించడంతో వాటిపై ప్రశ్నించగా పొంతన లేని సమాధానాలు చెప్పారని, వారిని స్టేషన్ కు తరలించి తమదైన రీతిలో విచారించగా కారు అద్దాలు పగలగొట్టి నగదును అపహరించుకు పోయింది తామేనంటూ,దానితోపాటు గతంలో మిర్యాలగూడ వన్ టౌన్, టూటౌన్ పరిధిలో కూడా రెండు చోరీలకుపాల్పడి నగదు అపహరించకపోయినట్లు ఒప్పుకున్నారని డిఎస్పీ తెలిపారు. నిందితుల వద్ద రూ.2 లక్షల,77వేల నగదు, కారు, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకొని కేసు త్వరితగతిన ఛేదించిన రూరల్ సీఐ వీరబాబు, ఎస్సై గోపతి సతీష్ వర్మ, హెడ్ కానిస్టేబుల్ వి.వి. గిరి, కానిస్టేబుళ్ళు ఏ.ప్రభాకర్ రెడ్డి,కె. సైదులు,శ్రీనివాస్ లను డి.ఎస్.పి రాజశేఖర్ రాజు అభినందించారు.

## తల్లిని చంపిన కూతురు



**మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 29(నినాదం న్యూస్):** జిల్లాలోని భూత్పూర్ మండలంలో పరిధిలోని కర్వేన గ్రామానికి చెందిన నకాకీ వెంకటమ్మ,(60),కాకీ నారమ్మ ఇద్దరు తల్లి కూతురు అయితే నారమ్మను భర్త వదిలేశాడు.అయితే తాగుడుకు బానిసైన కాకీ నారమ్మ తరచూ తల్లి కాకి వెంకటమ్మ ను డబ్బులు ఇవ్వమని గొడవ పడుతూ ఉండేది. ఇందులో భాగంగా గురువారం ఉదయం కాకీ నారమ్మ తల్లి కాకి వెంకటమ్మ తో గొడవ పడింది.గ్రామం బయట తల్లి కాకి వెంకటమ్మ పై కుతూరు కాకి నారమ్మ కర్రతో తల పై గట్టిగా మోదడంతో కాకి వెంకటమ్మ తలకు తీవ్ర గాయాలయ్యాయి.చికిత్స నిమిత్తము జిల్లా కేంద్రంలో ని ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించగా చికిత్స పొందుతూ కాకి వెంకటమ్మ (60) మృతి చెందింది. మృతురాలి కుమారుడు కాకి నర్సిహ్మ ఫిర్యాదు మేరకు భూత్పూర్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ శ్రీనివాసులు సంఘటన స్థలానికి చేరుకొని హత్య జరిగిన తీరును పరిశీలించారు.మృతురాలి కుమారుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రామక్రిష్ణ తెలిపారు.

# రక్తదానం ఓ మనిషి జీవితాన్ని కాపాడుతుంది

**హైదరాబాద్ ,(నినాదం న్యూస్) :** రక్తదానం అనేది ఉత్తమ దానమనీ రక్తదానం ఓ మనిషి జీవితాన్ని కాపాడుతుందని మనం దరికీ తెలిసిన విషయమే. ఫిబ్రవరి 28న వాసవి ఫౌండేషన్ చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌లో బ్లడ్ డొనేషన్ క్యాంపెయిన్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి వాసవి గ్రూప్ సభ్యులు ఎంతో మంది పాల్గొని రక్తం దానం చేశారు. వాసవి ఫౌండేషన్ ట్రస్ట్ సభ్యులు అభిషేక్ చందా మరియు సౌమ్య చందా, క్యాంపెయిన్‌కి విచ్చేసి రక్త దానం చేసిన వారిని అభినందించారు. వాసవి ఫౌండేషన్ ఇలాంటి ఎన్నో మంచి కార్యక్రమాలు చేస్తూ అందరికి సహాయపడడంలో ముందు ఉంటుందని వారు అన్నారు. ఇదొక అద్భుతమైన ప్రయత్నమని వాసవి ఫౌండేషన్ నిరంతరమైన కృషి కి చిహ్నామని పేర్కొన్నారు. వాసవి ఫౌండేషన్ ద్వారా సమాజంలో విశేష సేవలు అందించడానికి తమ ఫౌండేషన్ ఎల్లప్పుడు ముందు ఉంటుందని వారు తెలిపారు.



## సిన్నియర్ పోలీసాఫీసర్ కథ.. స్పిరిట్

'యానిమల్' విజయంతో ఫుల్ జోష్‌లో ఉన్నారు దర్శకుడు సందీప్ రెడ్డి వంగా. ప్రభాస్ హీరోగా ఆయన 'స్పిరిట్' తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా అప్‌డేట్స్ కోసం ప్రభాస్ అభిమానులతో పాటు సినీ ప్రియులంతా ఎదురుచూస్తున్నారు. తాజాగా సందీప్ వంగా దీని గురించి మాట్లాడారు. ఓ బాలీవుడ్ సినిమా టీజర్ లాంఛ్ ఈవెంట్‌లో పాల్గొన్న ఆయన 'స్పిరిట్'పై స్పందించారు. 'ప్రస్తుతం నేను ప్రభాస్‌తో చేయనున్న సినిమా పనుల్లో బిజీగా ఉన్నాను. అందరూ అనుకుంటున్నట్లు ఇది హారర్ స్టోరీ కాదు. ఓ నిజాయితీ కలిగిన పోలీస్ ఆఫీసర్ కథ. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అనంతరం 'యానిమల్ పార్క్'ను రూపొందిస్తా. ప్రస్తుతానికి ఈ అప్‌డేట్ మాత్రమే ఇవ్వగలను' అని చెప్పారు. పూర్తి యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ముస్తాబు కానున్న ఈ చిత్రంలో ప్రభాస్ తొలిసారి ఖాకీ దుస్తులు ధరించి, లాఠీ ఝుళిపించనున్నారు. గతంలో నిర్మాత ఈ చిత్రం గురించి మాట్లాడుతూ ఇందులో మునుపెన్నడూ చూడని ప్రభాస్‌ని చూస్తారని హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. దీంతో ఈ చిత్రంపై అంచనాలు రెట్టింపయ్యాయి. ఈ పోలీస్ డ్రామాకు హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీత దర్శకుడిగా వ్యవహరించనున్నారు. ఎనిమిది భాషల్లో ఈ చిత్రం రానుంది. ప్రస్తుతం ప్రభాస్ 'రాజా సాబ్' చిత్రంతో బిజీగా ఉన్నారు. మారుతి దర్శకత్వంలో రొమాంటిక్ హారర్ చిత్రంగా ఇది రూపొందుతోంది. ఇప్పటికే పలు షెడ్యూళ్ల షూటింగ్ కూడా పూర్తయింది. ఇందులో మాళవిక మోహనన్, నిధి అగర్వాల్ కథానాయికలుగా నటిస్తున్నట్లు సమాచారం. దీనితో పాటు 'కల్కి 2898 ఏడీ' లో ప్రభాస్ నటిస్తున్నారు. సైన్స్ ఫిక్షన్ నేపథ్యంలో నాగ్ అశ్విన్ తెరకెక్కిస్తున్న ఈ సినిమా మే 9న విడుదల కానుంది.



# బజరంగీ భాయిజాన్ కథను తిరస్కరించిన రాజమౌళి



బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ నటించిన సూపర్‌హిట్ చిత్రం 'బజరంగీ భాయిజాన్' భారీ విజయాన్ని నమోదు చేసుకున్న సంతగతి తెలిసిందే. కబీర్ ఖాన్ దర్శకత్వంలో 2015లో విడుదలై బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను రాబట్టింది. పాకిస్తాన్‌కు చెందిన ఓ మూగ, చెవిటి చిన్నారిని.. తన స్వదేశానికి చేర్చడానికి భారతదేశానికి చెందిన యువకుడు చేసే సాహస యాత్రే ఈ సినిమా. ఈ చిత్రాన్ని టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు రాజమౌళి తిరస్కరించడానికి గల కారణాన్ని సినీ రచయిత, రాజమౌళి తండ్రి విజయేంద్రప్రసాద్ తెలిపారు. 'నేను బజరంగీ భాయిజాన్ స్క్రిప్ట్ మొదట రాజమౌళికే వివరించాను. స్టోరీ వింటూ అతను కన్నీళ్లు పెట్టుకున్నాడు. ఈ కథను నువ్వు తెరకెక్కిస్తావా? లేదా వేరే ఎవరికైనా దీనిని ఇచ్చేయనా? అని అడిగాను. మౌళి దానిని మరొకరికి ఇవ్వమని చెప్పాడు. సినిమా విడుదలైన తర్వాత తను నా దగ్గరకి వచ్చి 'మీరు సరైన సమయంలో నన్ను అడిగివుంటే నేనే చేసేవాణ్ణి. బాహుబలి ÷-లకైమాక్స్ షూటింగ్ ఒత్తిడిలో ఉన్నప్పుడు వచ్చి అడిగారు. దాంతో నేను చేయలేనని చెప్పాను. అదే మీరు ఓ పది రోజులు ముందుగాని, తర్వాతగాని అడిగి ఉంటే చేస్తాననే చెప్పేవాడిని' అన్నాడు. రాజమౌళి సల్మాన్‌ఖాన్‌తో సినిమా చేస్తాడా అన్నది చెప్పలేము. కానీ మంచి స్క్రిప్ట్ ఉంటే అతను ఏం చేస్తాడో చూడటం ఓ అద్భుతమే అని విజయేంద్రప్రసాద్ వెల్లడించారు. బజరంగీ భాయిజాన్ విడుదలై తొమ్మిది సంవత్సరాలు అవుతుంది. ఇటీవల ఈ సినిమాకు సీక్వెల్ ఉంటుందని వస్తున్న వార్తలపై ఆయన స్పందించారు.' కథ మొదటి భాగం నుంచి మరో 8 సంవత్సరాల గతంతో ముడిపడి ఉంటుంది. బజరంగీ భాయిజాన్ వంటి మంచి హిట్ ఇస్తుందని ఆశిస్తున్నాను' అన్నారు విజయేంద్రప్రసాద్.

# దృశ్యం రీమేక్‌కు హాలీవుడ్ సంస్థ అంగీకారం



మలయాళ, తెలుగు, హిందీ భాషల్లో ఘనవిజయం సాధించిన చిత్రం 'దృశ్యం' ఇప్పటికే పలు రికార్డులను సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ చిత్రం రీమేక్‌లలో మరో ఘనత సాధించింది. ఏకంగా హాలీవుడ్ నిర్మాణ సంస్థ ఈ చిత్రాన్ని ఇంగ్లిష్, స్పానిష్‌లలో రీమేక్ చేయనున్నట్లు ప్రకటించింది. దీంతో హాలీవుడ్‌లో రీమేక్ కానున్న మొదటి భారతీయ చిత్రంగా 'దృశ్యం' నిలిచింది. తొలుత మలయాళంలో రూపొందిన ఈ సినిమా అదే పేరుతో తెలుగు, హిందీలో, 'దృశ్య' పేరుతో కన్నడలో, 'పాపనాశం' పేరుతో తమిళ్‌లో తెరకెక్కి సత్తా చాటింది. దానికి సీక్వెల్‌గా రూపొందిన 'దృశ్యం 2' కూడా విజయవంతమైంది. దీంతో ఈ సిరీస్ చిత్రాల కథలు కొరియన్‌లో రీమేక్ చేశారు. అక్కడ కూడా భారీ విజయాన్ని సొంతం చేసుకున్నాయి. ఇప్పుడు హాలీవుడ్‌లో ప్రసిద్ధి చెందిన గల్ఫ్ స్ట్రీమ్ పిక్చర్స్, మరో నిర్మాణ సంస్థతో కలిసి 'దృశ్యం' కథలను హాలీవుడ్ ప్రేక్షకులకు అందించనుంది. ఇండియన్ సినిమా నిర్మాణ సంస్థ పనోరమ స్టూడియోస్ నుంచి ఈ చిత్రాల అంతర్జాతీయ రీమేక్ హక్కులను ఆ సంస్థ సొంతం చేసుకుంది. దీంతో హాలీవుడ్ 'దృశ్యం'లో నటీనటులుగా ఎవరు కనిపించనున్నారన్నది ప్రస్తుతం ఆసక్తిగా మారింది. ముందుగా.. 'దృశ్యం'ని మోహన్‌లాల్, మీనా ప్రధాన పాత్రల్లో దర్శకుడు జీతూ జోసెఫ్ తెరకెక్కించారు. తెలుగులో వెంకటేశ్ హీరోగా శ్రీప్రియ పార్ట్ 1 తెరకెక్కించగా, పార్ట్ 2ను జీతూ జోసెఫ్ తెరకెక్కించారు. హిందీలో అజయ్ దేవ్‌గణ్, శ్రియ ప్రధాన పాత్రల్లో నటించారు. వేర్వేరు దర్శకులు వాటిని రూపొందించారు. తమిళ్ విషయానికొస్తే.. కమల్ హాసన్, గౌతమి ప్రధాన పాత్రల్లో నటించారు. త్వరలోనే మలయాళంలో 'దృశ్యం 3' రానుంది.

నినాదం సినిమా

# శ్రీవిష్ణు చిత్ర టైటిల్ స్వాగ్



రొటీన్ సినిమాలకు భిన్నంగా తనకంటూ డిఫరెంట్ కథలను ఎంచుకుంటూ హిట్లు కొట్టే టాలీవుడ్ హీరో శ్రీ విష్ణు తన 40వ పుట్టినరోజు నేడు ఈ సందర్భంగా తన కొత్త సినిమాను అనౌన్స్ చేశాడు . శ్రీ విష్ణు ప్రస్తుతం ఓ భీమ్ బుష్ అంటూ ఓ సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా లైన్‌లో ఉండగానే మరో క్రేజీ ప్రాజెక్ట్‌ను అనౌన్స్ చేశాడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టీజీ విశ్వ ప్రసాద్ నిర్మాతగా శ్రీ విష్ణు తన తదుపరి ప్రాజెక్ట్‌ను చేయబోతున్నాడు. తాజాగా ఈ సినిమా టైటిల్‌ను మేకర్స్ అనౌన్స్ చేశారు. ఈ సినిమాకు స్వాగ్ అనే టైటిల్‌ను అనౌన్స్ చేసినట్లు చిత్ర యూనిట్ ప్రకటించారు. ఈ సందర్భంగా టైటిల్ అనౌన్స్మెంట్ గ్లింప్స్ ను రిలీజ్ చేసి బర్త్ డే విషెస్ తెలిపారు. బోరింగ్ కథలకు టాటా చెబుతూ! సరికొత్త పంథాలో అచ్చ తెలుగు సినిమా శ్వాగణిక వంశానికి స్వాగతం అంటూ గ్లింప్స్ ను షేర్ చేశారు. ఈ సినిమా చారిత్రక నేపథ్యం ఉన్న శ్వాగణిక వంశం కథ అని మేకర్స్ అనౌన్స్ చేశారు. కామెడీ బ్యాక్‌డ్రాప్‌లో రానున్న ఈ సినిమాకు సంబంధించి మరిన్ని వివరాలను త్వరలోనే వెల్లడించనున్నారు. ఇక ఈ సినిమాకు హసిత్ గోలి దర్శకత్వం వహించబో తున్నాడు. వివేక్ సాగర్ సంగీతం అందిస్తుండగా.. వేద రామన్ శంకరన్ సినిమాటోగ్రఫర్‌గా వ్యవహరిస్తున్నారు. హీరో శ్రీవిష్ణు, దర్శకుడు హసిత్ గోలి ఫస్ట్ కొలాబరేషన్‌లో వచ్చిన 'రాజ రాజ చోర' చిత్రం నవ్వుల వర్షం కురిపించిన విషయం తెలిసిందే. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై ప్రముఖ నిర్మాత టిజి విశ్వ ప్రసాద్ నిర్మించబోయే కొత్త చిత్రం కోసం మళ్లీ వీరు కలిశారు. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత. ఈ బ్యానర్‌లో రూపుదిద్దుకుంటోన్న ఈ ప్రొడక్షన్ నెం 32 చిత్రానికి 'స్వాగ్' అనే టైటిల్‌ను ఖరారు చేస్తూ.. స్టోరీ ఆఫ్ ది టైటిల్ 'స్వాగ్' వీడియోను మేకర్స్ విడుదల చేశారు.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Sree Seshasai EnterprisesPlot no. 98/1, Co-operative Industrial Estate,Gandhi Nagar, near Balanagar Medchel -Malkajgiri Dist.Hyderabad 500037 (T.S). Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, RNI NO. APTEL /2003/11288, CELL : +91 80742 79741